Prajalakshyam Telugu Daily

# ప్రజాలక్ష్యం

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : గోలి సమ్మిరెడ్డి

సంపుటి: 16 | సంచిక: 329 | కరీంనగర్ | ఆదివారం 19 ఏప్రిల్ 2026 | పేజీలు: 12 | వెల: 2.00

## దేశవ్యాప్తంగా మహిళలను ఏకం చేస్తాం

### బిజెపి ఎంపి లక్ష్మణ్ హెచ్చరిక

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

న్యూఢిల్లీ, ఏప్రిల్18 : రాజ్యాంగ సవరణ బిల్లును వ్యతిరేకించి, మహిళల హక్కులను విపక్షాలు కాల రాశాయని భాజపా రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా మహిళలు కదం తొక్కుతున్నారని అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దక్షిణాది ప్రజలు కాంగ్రెస్, ప్రాంతీయ పార్టీలకు బుద్ధి చెబుతారని అన్నారు. మోదీకి ఆదరణ పెరుగుతుంది, భాజపా బలపడుతుందనే బిల్లును అడ్డు కున్నారు. మహిళలను

11 లో

## తెలంగాణలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

- కెరిమెరిలో అత్యధికంగా 44.6 డిగ్రీల ఉష్ణోగ్రత
- నిజామాబాద్ జిల్లా మెండోరాలో 44.5 డిగ్రీలు
- ఏప్రిల్‌లో మరింత పెరిగే అవకాశం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్ 18 : తెలంగాణలో రోజు రోజుకీ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఏప్రిల్ చివరి నాటికి ఉష్ణోగ్రతలు మరింతగా పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.ఏప్రిల్ తెలంగాణలో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. ఉదయం నుంచే భానుడు భగభగమంటున్నాడు. వివిధ పనుల కోసం బయటకు

11 లో

## మహిళలకు

# విపక్షాలు వ్యతిరేకం



- బిల్లును అడ్డుకుని పెద్ద తప్పు చేశాయి
- ఊరూరా ఈ విషయం ప్రచారం చేయండి
- కేబినేట్ భేటీలో ప్రధాని మోడీ సూచన
- కేంద్ర ఉద్యోగులకు 2శాతం డిఎ పెంపు
- 13వేల కోట్లతో సావరిన్ మారిటైమ్ ఫండ్ ఏర్పాటు

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18 : మహిళా రిజర్వేషన్ల కోసం తెచ్చిన రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడంపై ప్రధాని మోదీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయంలో విపక్షాలు జీవితాంతం చింతిస్తాయన్నారు. ప్రధాని అధ్యక్షతన దిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో శనివారం క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేసినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు మద్దతు ఇవ్వకుండా ప్రతిపక్ష పార్టీలు పెద్ద తప్పు చేశాయని ప్రధాని మోదీ అన్నారు. ఇందుకు వారు భారీ మూల్యం చెల్లించుకుంటాయని వ్యాఖ్యానించారు. ఈ విషయాన్ని కప్పిపుచ్చుకోవడానికి సాకులు వెతుకుతున్నారని విమర్శించారు. ప్రతిపక్ష పార్టీలు మహిళలకు వ్యతిరేకమనే విషయాన్ని ప్రతి గ్రామానికి

11 లో

## రెండోవిడత రైతుభరోసా

# విడుదలకు సిద్ధం

### - 20న కాటారాం సభలో విడుదల చేయనున్న రేవంత్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్ 18 : తెలంగాణ రైతులకు ప్రభుత్వం శుభవార్త తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'రైతు భరోసా'పథకం రెండో విడత నిధుల విడుదలకు ముహూర్తం ఖరారైంది. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది రైతులకు పెట్టుబడి సాయం అందనుంది. తెలం గాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు సంక్షేమమే ధ్యేయంగా కీలక నిర్ణయం తీసుకున్నారు. వానాకాలం సాగుకు అన్నదాతలు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో రైతు భరోసా నిధులు విడుదల చేయాలని సీఎం నిర్ణయించారు. భూపాలపల్లి జిల్లా కాటారంలో ఈనెల 20వ తేదీన నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఈ నిధులను విడుదల చేయనున్నారు. బటన్ నొక్కి నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాల్లోకి నగదును జమ చేయనున్నారు. రెండో విడత నిధుల విడుదల ద్వారా రాష్ట్రంలోని మెజారిటీ రైతులకు లబ్ధి చేకూరనుంది. ప్రతి ఎకరానికి రూ. 6,000 చొప్పున పెట్టుబడి సాయం అందనుంది. ఈ విడతలో 45,11,947 మంది రైతులకు ప్రయోజనం చేకూర నుంది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.50 కోట్ల ఎకరాలకు ఈ సాయం వర్తించనుంది. ప్రభుత్వం రైతు భరోసా కోసం భారీగా నిధులను వెచ్చిస్తోంది. దీనికి సంబంధించిన గణాంకాలు కింది విధంగా ఉన్నాయి. ఇప్పటికే ప్రభుత్వం రూ. 3,590 కోట్లను రైతుల ఖాతాల్లో సక్సెస్‌ఫుల్‌గా జమ చేసింది. 20వ తేదీన రూ. 5,653 కోట్లు జమ

11 లో

## మహిళా రిజర్వేషన్‌లో

# చిత్తశుద్ధి లేదు

- బిల్లు ముసుగులో డీలిమిటేషన్ చట్టం
- దక్షిణాదిని దెబ్బతీసే కుట్రను అడ్డుకున్నాం
- చిత్తుశద్ధి ఉంటే కేవలం మహిళా బిల్లు తేవాలి
- బిజెపితో జతకట్టిన పార్టీలకు ఎదురుదెబ్బలు తప్పవు
- తెలుగు దేశం పార్టీకి కూడా ఆ ప్రమాదం ఉంది
- మీడియా సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)



న్యూఢిల్లీ, ఏప్రిల్ 18 : మహిళా బిల్లు పేరుతో డీలిమిటేషన్ బిల్లు తీసుకువచ్చారని కేంద్ర ప్రభుత్వంపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి విమర్శలు గుప్పించారు. మహిళా బిల్లు వీగిపోవడంతో ప్రతిపక్షాలపై అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ చాలా చేసిందని పేర్కొన్నారు. మహిళా బిల్లు వీగిపోవడం.. భాజపా విధానాల ఓటమిగా

11 లో

## రాజ్యాంగ సవరణ బిల్లు

# వీగిపోవడం ఆనందం

- దేశాన్ని విభజించే కుట్రలను ఆపారు
- వారందరికీ ఎన్నో కృతజ్ఞతలు
- ఎక్స్ వేదికగా స్టాలిన్ వెల్లడి



(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

చెన్నై, ఏప్రిల్ 18 : లోక్‌సభలో శుక్రవారం రాజ్యాంగ 131 సవరణ బిల్లు 2026 వీగిపోయింది. దీంతో నల్లచట్టమైన డీలిమిటేషన్‌ని కేంద్రం ఉపసంహరించుకుంది. డీలిమిటషన్ అనే నల్లచట్టానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు చేసిన పోరాటం పార్లమెంటులో విజయం సాధించిందని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ అన్నారు. దానిని ఓడించినందుకు ఇండియా బ్లాక్ ఎంపీలకు, మహిళలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో వీడియో పోస్టు చేశారు. నేను ఆనందంతో, నూతన శక్తితో మీ ముందు నిలబడ్డాను. డీలిమిటేషన్ అనే నల్లచట్టానికి వ్యతిరేకంగా మన పోరాటం విజయవంతమైంది. ఈ ప్రమాదాన్ని ఏడాది క్రితమే ఊహించి, ఈ విజయాన్ని సాధించడానికి అవసరమైన పనులన్నీ అప్పుడే మొదలుపెట్టాము. మొదట ముఖ్యమంత్రులు, ప్రతిపక్ష నాయకుల సమన్వయ సమావేశంతో మొదలుపెట్టి, మొన్న మేము నల్లజెండా

11 లో

# తెలంగాణ ఆత్మగౌరవం దెబ్బతీసిన తేజస్వీసూర్య

- పెదవి విప్పని తెలంగాణ బిజెపి, కాంగ్రెస్ ఎంపిలు - ఈ వ్యవహారాన్ని ఇంతటితో వదిలే ప్రసక్తి లేదు - రాబోయేది బిఆర్ఎస్ ప్రభుత్వమే అన్న హరీష్ రావు - రాజకీయ పునరేకీకరణ ప్రారంభమయ్యిందన్న కెటిఆర్ - జగిత్యాలలో కెసిఆర్ ఆశీర్వాద సభ ఏర్పట్లు పరిశీలన



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జగిత్యాల,ఏప్రిల్18(ఆర్ఎన్ఎ): బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య లోక్‌సభలో చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. ఈ నెల 20న జగిత్యాలలో నిర్వహించనున్న కేసీఆర్' ప్రజా ఆశీర్వాద సభ' ఏర్పాట్లను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీష్‌రావు మాట్లాడారు. బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలకు తెలంగాణ ఎంపీ , కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సపోర్టుగా నిలిచారని ఆరోపించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచేలా మాట్లాడితే తెలంగాణలో 8 మంది బీజేపీ, 8 మంది కాంగ్రెస్ ఎంపీలు ఉన్నా ఏం లాభమని అన్నారు. బీజేపీ ఎంపీ బేషరతుగా తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఆత్మగౌరాన్ని దెబ్బ తీసిన ఎంపీ విషయంలో బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని వెల్లడించారు. బడేబాయి, చోటే బాయి బంధం మరో సారి బయటపడిందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంట్లో లేని లోటు నిన్న స్పష్టంగా కన్పించిందని హరీష్‌రావు వెల్లడించారు. తెలంగాణ ఉద్యమం, ప్రజల మీద విషం చిమ్మే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. భారత్ - పాక్ విభజనతో తెలంగాణ ఏర్పాను పోల్చుతారా అంటూ మాజీ మంత్రి మండిపడ్డారు. ఇది తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిందన్నారు. పార్లమెంట్‌లో బిల్లు పాస్ అయి.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యిందని హరీశ్ రావు

11 లో

## పులి బయటకు వస్తే...

# ఎన్ని మేకలను మింగిందో చెబుతాం

- ఎన్ని ఆవులను తిన్నదో బయటపెడతాం
- కెసిఆర్ జగిత్యాల సభపై పిసిసి చీఫ్ సెటైర్లు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



హైదరాబాద్, ఏప్రిల్ 18 : పులి బయటకు వస్తే సంగతి చెబుతామని పరోక్షంగా కెసిఆర్‌ను ఉద్దేశించి టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ హెచ్చరించారు. పులి ఎన్ని మేకలు తిన్నదో చెబుతామని.. పులి ఎన్ని ఆవులను మింగిందో చెబుతామని పేర్కొన్నారు. పులి ఆసరా తీసుకొని ఎన్ని పిల్లులు లాభపడ్డాయో బయటపెడుతామని వార్నింగ్ ఇచ్చారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జగిత్యాలలో పాల్గొననున్న మీటింగ్‌పై మహేశ్ కుమార్ గౌడ్ విమర్శలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో పులి ఏం చేసిందో ప్రజలకు వివరిస్తామని పేర్కొన్నారు. ఈ నెల 20వ తేదీన అన్ని విషయాలు బయటపెడతామని హెచ్చరించారు. శనివారం గాంధీభవన్‌లో మహేశ్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. స్వాతంత్ర్య పోరాటంలో బీజేపీ పాత్రనే లేదని మహేశ్ గౌడ్ విమర్శలు చేశారు. బీజేపీ ఎంపీలు యాక్సిడెంటల్ లీడర్స్ అని ఆక్షేపించారు. మతాల మధ్య చిచ్చు, కులాల మధ్య చిచ్చు పెట్టడం తప్ప బీజేపీ ఎంపీలకు ఏం తెలియదని సెటైర్లు గుప్పించారు. కర్ణాటక ఎంపీ తెలంగాణను కించపరిస్తే రాష్ట్ర బీజేపీ ఎంపీలు నిద్రపోయారా..? అని ధ్వజమెత్తారు. నలభై ఏళ్లలో కిషన్‌రెడ్డి ఒక్క బీసీ నాయకుడినైనా

## మహిళా బిల్లును

# అడ్డుకోవడం దురదృష్టకరం

- సమానం చెప్పకోలేని స్థితిలో విపక్షాలు
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శలు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18 : నియోజకవర్గాల పునర్విభజన బిల్లు, మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లు పార్లమెంట్‌లో వీగిపోవడం దురదృష్టకరమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ బిల్లులను అడ్డుకోవడం చారిత్రాత్మక తప్పిదమని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు చరిత్రలో మహిళా ద్రోహులుగా మిగిలిపోతాయని విమర్శించారు. శనివారం ఢిల్లీలో మీడియాతో కిషన్‌రెడ్డి మాట్లాడారు. ఈ బిల్లులను ఎందుకు వ్యతిరేకిస్తున్నారో ప్రజలకు ఇండియా కూటమి నేతలు చెప్పలేక పోయారని పేర్కొన్నారు. మహిళలకు కాంగ్రెస్ పార్టీ మరోసారి అన్యాయం చేసిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. 50 శాతం సీట్లు పెంచాల్సిన అవసరం ఉందని చెప్పామని, ఈ విషయంపై అన్ని

11 లో

# భూముల మార్కెట్ విలువ పెంచే ప్రతిపాదన

### - రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



హైదరాబాద్, ఏప్రిల్18 : త్వరలోనే భూముల మార్కెట్ విలువలను పెంచేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు భూముల ధరల పెంపు జరగలేదని, త్వరలో ఈ విషయంలో నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. రెవెన్యూ శాఖలో కొత్త పాలసీ తీసుకురావడానికి కసరత్తు జరుగుతోందని, త్వరలోనే దీనిపై పూర్తి వివరాలు వెల్లడిస్తామని మంత్రి చెప్పారు. అలాగే కేబినెట్ విస్తరణపై చర్చ జరుగుతోందని, అది విడతల వారీగా జరిగే అవకాశం ఉందని తెలిపారు.ధరణి పోర్టల్‌కు సంబంధించిన సమస్యలను 'భూ-భారతి' ద్వారా పరిష్కరించనున్నట్లు

11 లో

## రేవంత్ దేశ ప్రజలను

# ఏకం చేశారు

- జీర్ణించుకోలేక పోతున్న హరీష్ రావు
- తేజస్వీ వ్యాఖ్లయపై నిరసన తెలిపింది మేమే
- హరీష్ రావు వ్యాఖ్యలపై మండిపడ్డ ఎంపి చామల



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్ 18 : సీఎం రేవంత్ రెడ్డి దక్షిణ భారతదేశ ప్రజలను ఏకం చేయడాన్ని హరీశ్ రావు జీర్ణించుకోలేకపోతున్నారని భువనగిరి ఎంపీ చామల కిరణ్ రెడ్డి విమర్శించారు. 'మీ నాయకుడు ఫామ్ హౌస్‌లో ఉన్నారు. మీకు లోక్‌సభలో ఒక్క ఎంపీ లేరని అంటూ మాజీ మంత్రి హరీశ్ రావుకు భువనగిరి ఎంపీ చామల కిరణ్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. హరీశ్ రావు రోజు ఏదో ఒకటి మాట్లాడి కాంగ్రెస్ పార్టీని, సీఎం రేవంత్ రెడ్డిని బద్నాం చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. డీలిమిటేషన్ బిల్లును పెట్టి మహిళా బిల్లుగా బీజేపీ ప్రొజెక్ట్ చేసుకుంటోందని అన్నారు. బిల్లును అడ్డుకోవడంలో ప్రతిపక్షాలు ఏకతాటిపైకి వచ్చాయన్నారు. బీజేపీ కుట్రలను ఎండగట్టామని తెలిపారు. కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ బ్రేక్ ఫాస్ట్ మీటింగ్‌కు పిలిస్తే సీఎం రేవంత్ రెడ్డి వెళ్లారు. దాన్ని హరీశ్ రావు తప్పుపడుతున్నారు. అక్కడ బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని ఇద్దరు కేంద్ర

11 లో



# డీలిమిటేషన్‌కు మహిళా బిల్లు ముసుగు

### - దక్షిణాదిని దెబ్బతీసే కుట్ర విఫలం - బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్18 : నియోజకవర్గాల పునర్విభజన కోసం కేంద్రం ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు పార్లమెంట్‌లో దక్షిణ భారతదేశ ప్రాధాన్యాన్ని తగ్గిస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటు ఇప్పటికే 2023లో ఆమోదించిందని, ఆ బిల్లుకు నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియతో ముడిపెట్టాల్సిన అవసరమే లేదని వ్యాఖ్యానించారు. నియోజక వర్గాల పునర్విభజనకు 2011 జనాభా లెక్కలను పరిగణలోకి తీసుకున్నా, తాజా జనాభా గణనను ప్రాతిపదికగా తీసుకున్నా దక్షిణ భారతదేశం తీవ్రంగా నష్టపోతుందని కేటీఆర్ అన్నారు.

11 లో





# సమస్యల పరిష్కారానికి గ్రామాలకే వస్తా!

**- ధర్మారం మండల కేంద్రంలో మినీ స్టేడియం ఏర్పాటుకు చర్యలు - ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి - గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు - రైతులకు 48 గంటల్లో చెల్లింపులు**
**- నాణ్యమైన ధాన్యం తీసుకురావాలి రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ధర్మారం, ఏప్రిల్ 18 : ప్రజల సమస్యలను పరిష్కరించడానికి గ్రామాలకే స్వయంగా వస్తానని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. శనివారం ధర్మారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో సుమారు రూ.2 కోట్లతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి లక్ష్మణ్ కుమార్, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి శంకుస్థాపన చేసి, ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ధర్మారం మండలంలోని అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు ఇవ్వడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని చెప్పారు. విద్యార్థులకు సాంకేతిక విద్య అందించేందుకు ఎర్రగుంటపల్లిలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి వివరించారు. ధర్మారం మండల కేంద్రంలోని ఎస్టీ మినీ గురుకుల పాఠశాలను పదవ తరగతి వరకు అప్‌గ్రేడ్ చేసి, 75 శాతం ట్రైబల్ విద్యార్థులకు, 25 శాతం ఇతర వర్గాలకు సీట్లు కేటాయిస్తామని తెలిపారు. మండల కేంద్రంలో మినీ స్టేడియం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇది యువతకు క్రీడల్లో ప్రోత్సాహం కలిగిస్తుందని మంత్రి పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని మంత్రి తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్ వెళ్లాల్సిన అవసరం లేకుండా వారంలో మూడు రోజుల పాటు నియోజకవర్గంలో పర్యటిస్తూ సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు. మొక్కజొన్న రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అవసరమైతే ధర్మారం మండల కేంద్రంలో కూడా మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ మండలంలోని 61 మంది రైతులకు రూ.18.24 లక్షల సబ్సిడీతో వ్యవసాయ పరికరాలు అందించడం అభినందనీయమని తెలిపారు. ధర్మారం మార్కెట్ కమిటీ పరిధిలో సుమారు రూ.2 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. తీవ్ర ఉష్ణోగ్రతల కారణంగా కార్మికుల కొరత ఉండడంతో లోడింగ్ వేగం కొంత తగ్గే అవకాశం ఉందని, రైతులు సహకరించాలని కోరారు. నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి, 48 గంటల్లో చెల్లింపులు జరిపే విధంగా చర్యలు తీసుకుంటున్నామని, రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. అనంతరం మండలంలోని 61 మంది రైతులకు రూ.18.24 లక్షల విలువైన వ్యవసాయ పరికరాలను పంపిణీ చేశారు. అలాగే 23 మందికి కళ్యాణ లక్ష్మి చెక్కులు, ఒకరికి షాదీ ముబారక్ చెక్కు, పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రూప్ లా నాయక్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వేణు, డి.సి.ఓ. శ్రీమాల, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రజలు కేసీఆర్ పాలన రావాలని కోరుకుంటున్నారు

**- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్**
**- జీవన్ రెడ్డి చేరికతో ఉత్తర తెలంగాణలో బిఆర్ఎస్ మరింత బలోపేతం**
**- మాజీ మంత్రి హరీష్ రావు**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, ఏప్రిల్ 18 : రాష్ట్ర ప్రజలు కేసీఆర్ పాలన రావాలని కోరుకుంటున్నారని, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఈనెల 20,వ తేదీన జగిత్యాలలో జరగబోయే కేసీఆర్ బహిరంగ సభ సందర్భంగా సభ ప్రాంగణాన్ని శనివారం బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మాజీ మంత్రి హరీష్ రావుతో కలిసి పరిశీలించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ..రాష్ట్రంలో రాజకీయ పునరేకీకరణ నడుస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు కేసీఆర్ పాలన రావాలని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిల్లర రాజకీయాలు చేస్తూ, జగిత్యాల జైత్రయాత్రకు తరలి వచ్చే జన ప్రభంజనాన్ని అడ్డుకోవాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ 13 డిక్లరేషన్ లు, 06 గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసిందని అన్నారు. రేవంత్ రెడ్డి పాలనతో రాష్ట్ర ప్రజలు విసిగి పోయారని, తిరిగి కేసీఆర్ పాలన రావాలని కోరుకుంటున్నారని తెలిపారు. కేసీఆర్ గతంలో జగిత్యాలలో ఎన్నో బహిరంగ సభలు నిర్వహించారని, అవి ఎంతో విజయవంతం అయ్యాయని తెలిపారు. బహిరంగ సభ విజయవంతానికి నాయకులు కార్యకర్తలు సహకరించి, సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సభకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఎండ తీవ్రతను దృష్టిలో సభను సాయంత్రం నిర్వహిస్తున్నామని తెలిపారు. బహిరంగ సభ సందర్భంగా మంచి నీరు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి చేరిక సందర్భంగా జగిత్యాలలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జీవన్ రెడ్డి చేరికతో ఉత్తర తెలంగాణలో మరింత బలోపేతం అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. బిజెపి ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై చేసిన వ్యాఖ్యలు అతడి అవగాహన రాహిత్యానికి నిదర్శనం అన్నారు. తేజస్వి వ్యాఖ్యలను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెనకేసుకు రావడం సిగ్గుచేటన్నారు. తెలంగాణ ఉద్యమాన్ని దేశ విభజనతో పోల్చడం సరికాదని, ప్రజాస్వామ్య పద్ధతిలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని పేర్కొన్నారు. పాకిస్తాన్ దేశ విభజన అంశాన్ని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో అవగాహన లేకుండా మాట్లాడటం సరికాదన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో బీఆర్ఎస్ ఎంపీలు లేని లోటు స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై ఎంపీ తేజస్వి చేసిన వ్యాఖ్యలను బిజెపి, కాంగ్రెస్ పార్టీల ఎంపీలు ఖండించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని తెలిపారు. రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను అవమానపరిచి, 04 కోట్ల తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన బిజెపి ఎంపీ తేజస్వి సూర్య బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ లో రేవంత్ రెడ్డి బడే భాయ్..చోటే భాయ్ ల బంధం బయటపడిందని అన్నారు. రేవంత్ రెడ్డి ఇంతవరకు తేజస్వి సూర్య వ్యాఖ్యలను ఎందుకు ఖండించడం లేదని ప్రశ్నించారు. బిజెపి, కాంగ్రెస్ ఇద్దరూ కలిసి మహిళా బిల్లు పేరుతో మోసం చేస్తున్నారని ఆరోపించారు. పార్లమెంట్ లో 2/3 మెజారిటీ లేదని తెలిసి కూడా మహిళా బిల్లుకు డీ లిమిటేషన్ తో ముడిపెట్టడం సరికాదన్నారు. కాంగ్రెస్, బిజెపి రెండు పార్టీలకు చిత్తశుద్ధి లేదని ఇద్దరూ కూడబలుక్కుని మహిళలను మోసం చేశారని అన్నారు. రేవంత్ రెడ్డి పాలనతో విసిగి పోయిన రాష్ట్ర ప్రజలు తిరిగి కేసీఆర్ పాలన రావాలని కోరుకుంటున్నారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో బిజెపిని విమర్శిస్తూ ఢిల్లీలో ఎంపీ శ్రీనివాస్ రెడ్డి ఇంటికి టిఫిన్ కు వెళ్లాడని, ఇది హై బ్రీడ్.. సిద్ధాంతమా లేక క్రాస్ బ్రీడ్ సిద్ధాంతమా అర్థం కావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల నియోజకవర్గ కెసిఆర్ సభ ఇన్చార్జ్, జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, జీవన్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్.రమణ, ఎమ్మెల్యేలు కల్వకుంట్ల సంజయ్, ప్రశాంత్ రెడ్డి, కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే లు బాల్క సుమన్, సుంకే రవిశంకర్, జిల్లా తొలి జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్, రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ బహిరంగ సభకు ఊరు ఊరు తరలి రావాలి

**- బిఆర్ఎస్ ప్రభుత్వ ఏర్పాటు లక్ష్యంగా సమష్టిగా కృషి చేద్దాం - మాజీ మంత్రి జీవన్ రెడ్డి**




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల ప్రతినిధి , ఏప్రిల్ 18 : కేసీఆర్ బహిరంగ సభకు ఊరు ఊరు తరలి రావాలని, బిఆర్ఎస్ ప్రభుత్వ ఏర్పాటు లక్ష్యంగా సమష్టిగా కృషి చేద్దామని మాజీ మంత్రి జీవన్ రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జగిత్యాల పట్టణంలోని దేవిశ్రీ గార్డెన్లో శనివారం బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలు నాయకులతో ఈ నెల 20,న నిర్వహించే కెసిఆర్ బహిరంగ సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి మాట్లాడుతూ..నాలుగు దశాబ్దాల పాటు కాంగ్రెస్ పార్టీకి సేవలందించానని, 20 నెలలుగా తీవ్ర మానసిక క్షోభ అనుభవించానని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం కోసం పాటుపడే కెసిఆర్ సారథ్యంలో పనిచేసే అవకాశం లభించడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ప్రజల ఆకాంక్ష మేరకు ఈనెల 20,న కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ లో చేరబోతున్నానని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందన్నారు. రేవంత్ రెడ్డి పోవాలి..కేసీఆర్ రావాలి..కాంగ్రెస్ పోవాలి.. టిఆర్ఎస్ రావాలనేది ప్రజల నానుడిగా మారిందని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమకారుడిగా తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మానం కోసం కేసీఆర్ అహర్నిశలు కృషి చేశారని తెలిపారు. పాలనాపరణ పరమైన సౌలభ్యంతో పాటు ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు నూతన జిల్లాలు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. భారత రాజ్యాంగం ప్రజలకు కల్పించిన హక్కులను అమలు చేసేందుకు విద్య వైద్య సదుపాయాలను మెరుగుపరిచేందుకు కృషి చేశారన్నారు. జిల్లాకు వైద్య కళాశాల ఏర్పాటు చేయడంతో పాటు మెరుగైన వసతుల కల్పన కు కృషి చేశారని, తెలంగాణలోని ప్రతి పల్లెకు నాణ్యమైన విద్యనందించాలనే లక్ష్యంతో గురుకుల పాఠశాలలను ప్రారంభించారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గురుకుల పాఠశాలలో మౌలిక వసతులు మెరుగుపరచాల్సింది పోయి, నిర్లక్ష్యం చేశారన్నారు. గురుకుల పాఠశాలలకు శాశ్వత భవనాలు నిర్మించడంతోపాటు మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు చేస్తే కేసిఆర్ కు పేరు వస్తుందనీ ఇంటర్నేషనల్ స్కూల్ పేరిట కాలయాపన చేస్తున్నారని పేర్కొన్నారు. రైతులకు పెట్టుబడి సాయం కింద కేసీఆర్ రైతుబంధు పేరిట ఎకరానికి 10000 అందిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం 15,000 అందిస్తుందని హామీ ఇచ్చి, రేవంత్ రెడ్డి రైతు భరోసా మూడు పంటలకు ఎగొట్టారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో పెన్షన్ 200 ఇస్తే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కెసిఆర్ పెన్షన్ పదింతలు చేసి రెండు వేలకు పెంచారని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి పాలనలో ఆయన కేబినెట్ మినహా రాష్ట్రంలోని అన్ని వర్గాలు దోపిడికి గురి అయ్యాయన్నారు. ఇల్లు లేని నిరుపేదల కోసం జగిత్యాల పట్టణానికి నాలుగు వేల డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కేటీఆర్ మంజూరు చేశారన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు జగిత్యాల ఎమ్మెల్యేకు ఏటీఎంగా మారాయని ఆరోపించారు. రాబోయే రెండేళ్లు ప్రజల పక్షాన నిలబడి పోరాడుతామని స్పష్టం చేశారు. ఆనాడు జగిత్యాలలో రైతులు, రైతు కూలీలు, కార్మిక, కర్షకులతో నిర్వహించిన జగిత్యాల జైత్రయాత్ర యావత్ సమాజాన్ని మేల్కొల్పితే, నేడు జగిత్యాల లో కెసిఆర్ బహిరంగ సభ జైత్రయాత్ర యావత్ తెలంగాణ సమాజాన్ని జాగృతం చేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర భవిష్యత్ దిక్సూచి కెసిఆర్ అని కొనియాడారు. రాష్ట్రంలో రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. నాలుగు దశాబ్దాలుగా సేవలందించిన కాంగ్రెస్ పార్టీ రాజకీయంగా ఇబ్బంది పెడితే.. కేసీఆర్ తో కల్సి నడిచే అవకాశం కల్పించి, తనకు చేయూతనిచ్చిన కేసీఆర్ కు రుణపడి ఉంటానన్నారు. కెసిఆర్ బహిరంగ సభను జయప్రదం చేసేందుకు ఊరు ఊరు తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు లక్ష్యంగా సమష్టిగా కృషి చేస్తామని అన్నారు.

# బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

**రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు జిల్లా ఏప్రిల్ 18 మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద జరిగిన ప్రమాదంలో కాలు దెబ్బతిన్న బాలుడి కుటుంబానికి దేవాదాయ శాఖ ఆర్థిక సహాయం,ఉద్యోగ భరోసా కల్పించారు.శనివారం ములుగు జిల్లా కలెక్టర్ ఛాంబర్లో మంత్రి సీతక్క చేతుల మీదుగా బాధిత బాలుడి కుటుంబానికి దేవాదాయ శాఖ తరుపున చెక్కును అందజేశారు. ప్రమాదం జరిగిన వెంటనే బాలుడిని తల్లిదండ్రులకు సమాచారం మేరకు ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించి అత్యంత నాణ్యమైన వైద్యం అందించడం జరిగిందని,వైద్యానికి అయిన ప్రతి ఒక్క రూపాయి ఖర్చును ప్రభుత్వమే పూర్తిగా భరించిందని తెలిపారు.బాలుడి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని బాలుడి పేరు మీదనే ఆర్థిక సహాయాన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో బ్యాంకులో జమ చేయడం జరిగిందని,బాలుడి తల్లికి కుటుంబ పోషణార్థం దేవాదాయ శాఖలో,మేడారం వనదేవతల సన్నిధి ప్రాంగణంలోనే అవుట్‌సోర్సింగ్ విధానంలో ఉద్యోగం కల్పించి నెలకు రూ.18,000 వేతనం అందజేయబడుతుందని పేర్కొన్నారు.బాలుడి గాయం నుంచి పూర్తిగా కోరుకున్న అనంతరం అతనికి నాణ్యమైన కృత్రిమ కాలు అమర్చడంతో పాటు, సౌకర్యార్థం ఒక స్కూటీ కూడా అందజేయడం జరుగుతుందని ఈఓ వెల్లడించారు.జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., మేడారం పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధ బోయిన జగ్గారావు,బాలుడి తల్లిదండ్రులు,తదితరులు పాల్గొన్నారు.



# కళ తప్పిన “కళావైభవం”...

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు, ఏప్రిల్ 18 : కాకతీయులు అనగానే ప్రాచీన ఆలయాల కట్టడాలు అబ్బురపరిచే శిల్పాలు... సాగునీటిని అందించే సరస్సుల నిర్మాణాలే గుర్తుకు వస్తాయి. వందల ఏలనాటి కాకతీయ చరిత్రకు వాళ్లు నిర్మించిన కట్టడాలే నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నాయి. కానీ ములుగు మండలంలోని జాకారం గ్రామంలో నిర్మించిన కాకతీయుల అద్భుతమైన కళాసంపద ప్రస్తుతం శిథిలమై పోతున్నది. పట్టించుకునే వారు కరువై ప్రాచీన కళా వైభవం కళతప్పి వెలవెలబోతుంది.ఆధ్యాత్మిక శోభను సంతరించుకోవలసిన ప్రాంతం అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారుతుంది. కాకతీయులు క్రీస్తు శకం 13వ శతాబ్దంలో త్రికూట ఆకారంలో శివాలయాన్ని నిర్మించారు మూడు ముఖద్వారాలు... గర్భగుడిలో శివలింగాన్ని ప్రతిష్ఠించారు తూర్పుదిక్కులో ప్రధాన ద్వారంగా వాస్తు నిర్మాణం చేశారు దేవాలయంపై శిల్పాలను అందంగా మల్చారు అచ్చం రామప్ప ఆలయం తరహా లోనే ఎర్రరాయని ఉపయోగించి ఆలయాన్ని తీర్చిదిద్దారు. ప్రస్తుతం శివాలయంలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారుతుంది పగలు రాత్రి తేడా లేకుండా దేవాలయ పరిసర ప్రాంతాలు మందు బాబులకు అడ్డాగా మారాయి. రాష్ట్ర ప్రభుత్వం చేయూతనందిస్తే ఆలయానికి పూర్వం తీసుకువస్తే భక్తులను, పర్యాటకులను ఆకర్షించే కేంద్రంగా మార్చడంతో పాటుగా ఆధ్యాత్మికత క్షేత్రంగా విరాజిల్లనుంది.



# మేడిగడ్డలో బీఆర్ఎస్ నేతల పర్యటన... కాళేశ్వరం మరమ్మతులకు డిమాండ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, ఏప్రిల్ 18: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహాదేవపూర్ మండలం మేడిగడ్డ కాలేశ్వరం ప్రాజెక్టును బీఆర్ఎస్ పార్టీ నేతలు శనివారం సందర్శించి, ప్రాజెక్టు మరమ్మతులు వెంటనే చేపట్టి రైతులకు సాగునీరు అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా కాలేశ్వరం ప్రాజెక్టును అద్భుతంగా నిర్మించిన ఘనత రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావుకే దక్కుతుందని అన్నారు. భారీ బాహుబలి మోటర్ల ద్వారా నీటిని పైకి లిఫ్ట్ చేసి మల్లన్నసాగర్ వరకు తరలించి, హైదరాబాద్ ప్రజల తాగునీటి అవసరాలు తీర్చడంతో పాటు రైతులకు సాగునీరు అందించిన గొప్ప నాయకుడిగా కేసీఆర్ నిలిచిపోయారని కొనియాడారు. రైతు సంక్షేమానికి రైతుబంధు, రైతు భీమా వంటి పథకాల ద్వారా విశేష సేవలు అందించిన నాయకుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. అయితే ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదని, రైతు భరోసా నిధులను సకాలంలో ఇవ్వడం లేదని విమర్శించారు. మేడిగడ్డ వద్ద రెండు పిల్లర్లు కుంగి పగుళ్లు వచ్చిన విషయం తెలిసిందేనని, మూడు సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటికీ సరైన మరమ్మతులు చేపట్టలేదని ఆరోపించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాలేశ్వరం ప్రాజెక్టును నిర్వీర్యం చేసి కేసీఆర్ పేరును మాయ చేయాలని చూస్తున్నారని విమర్శించారు. ఇకనైనా సీఎం రేవంత్ రెడ్డి కేసీఆర్‌కు క్షమాపణ చెప్పి కాలేశ్వరం ప్రాజెక్టుకు తక్షణం మరమ్మతులు చేపట్టి రైతులకు సాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకట రమణా రెడ్డి, తాటికొండ రాజయ్య, దాస్యం వినయ్ భాస్కర్, శంకర్ నాయక్, పుట్ట మధుకర్, జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి, మాజీ ఎంపీ మాలోతు కవిత, మాజీ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# మేడిగడ్డపై బీఆర్ఎస్ దుష్ప్రచారం

**- సీఎం పర్యటనకు రైతులు భారీగా హాజరై మద్దతు తెలపాలి**
**- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, ఏప్రిల్ 18:మేడిగడ్డ ప్రాజెక్టు అంశంపై బీఆర్ఎస్ నాయకులు తప్పుదారి పట్టించే ప్రచారం చేస్తున్నారని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి పర్యటన ప్రజల ప్రయోజనాల కోసమేనని, రైతులు భారీగా హాజరై మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. మేడిగడ్డ కాలేశ్వరం ప్రాజెక్టు అంశంపై బీఆర్ఎస్ పార్టీ నాయకులు తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు విమర్శలు చేస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తీవ్రంగా విమర్శించారు. శనివారం భూపాలపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన, సీఎం రేవంత్ రెడ్డి మేడిగడ్డ పర్యటనను లక్ష్యంగా చేసుకుని ముందుగానే రాజకీయ విమర్శలు చేయడం సిగ్గుచేటు అని వ్యాఖ్యానించారు. ఇంజనీర్లు తుమ్మిడిహెట్టి ప్రాంతాన్ని ప్రాజెక్టు నిర్మాణానికి అనుకూలంగా సూచించినప్పటికీ, ఆ సూచనలను పక్కనపెట్టి మేడిగడ్డ వద్ద ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారని ఆరోపించారు. అప్పటి ప్రభుత్వం భారీగా ఖర్చు పెంచి సుమారు లక్ష కోట్ల రూపాయల ప్రాజెక్టుగా మార్చిందని తెలిపారు. అంతటి భారీ వ్యయం జరిగినప్పటికీ, భూపాలపల్లి జిల్లా ప్రజలకు, ముఖ్యంగా రైతులకు తగిన ప్రయోజనం అందలేదని పేర్కొన్నారు. మేడిగడ్డ ప్రాంతంలో భూమి స్వభావం (లూజ్ సాయిల్) కారణంగా ప్రాజెక్టు నిర్మాణంలో లోపాలు తలెత్తి, మూడు పిల్లర్లు కుంగిపోయిన ఘటన తీవ్ర ఆందోళన కలిగించిందన్నారు. ఈ పరిణామంతో ప్రజల సొమ్ము వృథా అయిందని విమర్శించారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేసి సీబీఐ విచారణ కోరిన విషయాన్ని గుర్తుచేశారు. ఇంజనీర్లు కూడా నిర్మాణంలో లోపాలు ఉన్నాయని నివేదికలు ఇచ్చినా, వాటిని పట్టించుకోకుండా తీసుకున్న నిర్ణయాలే ఈ పరిస్థితికి కారణమని అన్నారు. ఇప్పుడు ప్రస్తుత ప్రభుత్వం ప్రాజెక్టును సరిదిద్దే దిశగా చర్యలు తీసుకుంటోందని, ప్రజల డబ్బు వృథా కాకుండా ఉండేలా మరమ్మతులు చేపట్టాలని భావిస్తున్నదని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మేడిగడ్డను సందర్శించనున్న నేపథ్యంలో, బీఆర్ఎస్ నాయకులు ముందస్తుగా సోషల్ మీడియా ద్వారా దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ప్రజలను మభ్యపెట్టి తమ తప్పులను దాచుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ ప్రజలు ఇప్పటికే జరిగిన శాసనసభ, పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి తగిన సమాధానం ఇచ్చారని అన్నారు. అయినప్పటికీ ఆ పార్టీ నాయకులు మార్పు చెందకుండా అదే విధంగా ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు కొనసాగిస్తున్నారని విమర్శించారు. మేడిగడ్డ పర్యటన సందర్భంగా కాటారం ప్రాంతంలో నిర్వహించనున్న బహిరంగ సభకు రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల ప్రయోజనాల కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్యతో పాటు ఇతర స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు

## - కుమారస్వామికి విజ్ఞప్తి చేసిన సిఎం రేవంత్
## - ప్రియాంకను కలిసి బిల్లును ఓడించినందుకు అభినందనలు



(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18 : కేంద్ర మంత్రులు కుమారస్వామి, శ్రీనివాసవర్మను సీఎం రేవంత్‌రెడ్డి కలిశారు. బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని కుమారస్వామికి విజ్ఞప్తి చేశారు. దీని ద్వారా ఉక్కు కొరత తగ్గడంతోపాటు.. పర్యావరణానికి మేలు జరుగుతుందని తెలిపారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌లో భాగంగా రూపొందించిన పారిశ్రామిక ప్రతిపాదనలను సీఎం వివరించారు. పాత వాహనాల స్క్రాప్‌ను రీసైక్లింగ్ చేసే పరిశ్రమను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈవీ బ్యాటరీల తయారీ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. హైదరాబాద్‌ను కాలుష్యం లేని నగరంగా మార్చేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో బిజీబిజీగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామితో సమావేశమయ్యారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ నెలకొల్పాలని విజ్ఞప్తి చేశారు. హైడ్రోజన్ టెక్నాలజీతో గ్రీన్ స్టీల్ క్లస్టర్ ఏర్పాటుకు ప్రతిపాదన చేశారు. పాత వాహనాల స్క్రాప్‌తో ఉక్కును రీసైక్లింగ్ చేసే పరిశ్రమను తెలంగాణలో ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర పారిశ్రామిక విజన్ డాక్యుమెంట్‌ను కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరుగుతున్న దృష్ట్యా ఈవీ బ్యాటరీ తయారీ కేంద్రం ఏర్పాటుకు విన్నవించారు. ఆటో, రక్షణ రంగాల ఉత్పత్తులు, రోబోటిక్స్ తయారీకి ప్రత్యేక పార్కుల కోసం ప్రతిపాదించారు ముఖ్యమంత్రి. 2034 నాటికి హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా మార్చేందుకు కేంద్రం సహకారం కోరారు. ఆధునిక పరిశ్రమలకు అనుగుణంగా జాతీయ స్థాయి స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థలను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి కుమార స్వామికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. అలాగే వయనాడ్ ఎంపీ, కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం ఉదయం సమావేశమయ్యారు. 131వ రాజ్యాంగ సవరణ బిల్లును ఓడించినందుకు ప్రియాంకకు సీఎం ధన్యవాదాలు తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లు వెనుక ఉన్న అసలు విషయాలను ప్రియాంక గాంధీ బయటపెట్టారని ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణ ప్రజల తరఫున రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేకు ధన్యవాదాలు తెలియజేశారు. 'దక్షిణాది రాష్ట్రాలను ఏకీకృతం చేయడంలో నా కృషిని ప్రియాంక గాంధీ అభినందించారు' అని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

# మహిళా బిల్లుపై నిరసనలకు పిలుపు

## - బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు గృహనిర్బంధం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



హైదరాబాద్, ఏప్రిల్ 18 : తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావును పోలీ సులు హౌస్ అరెస్ట్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఇంటిని ముట్టడించేందుకు పిలుపునివ్వడంతో శనివారం ఉదయాన్నే రాంచందర్ రావు ఇంటికి వెళ్లిన పోలీసులు గుహ నిర్బంధం చేశారు. లోక్ సభలో శుక్రవారం మహిళా రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్ అడ్డుకుందంటూ రేవంత్ ఇంటి ముట్టడికి బీజేపీ సిద్ధమైంది. దీంతో పోలీసులు రంగంలోకి దిగారు. మరోవైపు పోలీసులు తనను నిర్బంధించడంపై ఆయన ఆగ్రహించారు. నారీ శక్తికి ద్రోహం చేసిన కాంగ్రెస్‌ను వదిలిపెట్టేది లేదని రాంచందర్ రావు హెచ్చరించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మాట్లాడారు. కాంగ్రెస్ వైఖరికి నిరసనగా ఈరోజు దేశ వ్యాప్త ఆందోళనకు పిలుపునిచ్చామన్నారు. పోలీసులు తనను హౌస్ అరెస్ట్ చేశారని, అయినా తమ పార్టీ శ్రేణులు, నాయకులు రేవంత్ రెడ్డి ఇంటిని ముట్టడిస్తారని హెచ్చరిం చారు. దేశంలో ఇంకా రాచరిక పాలన కావాలని కాంగ్రెస్ భావిస్తోందని మండిపడ్డారు. ఒక్క ముస్లిం సమాజానికి మేలు చేసేందుకు ఈ డ్రామా ఆడుతున్నారని ఆరోపించారు. దేశ ప్రజలు,తెలంగాణ సమాజం కాంగ్రెస్ పార్టీకి తగిన విధంగా బుద్ధి చెప్పాలని అన్నారు.

# పిల్లల్ని సురక్షితంగా గమ్యం చేర్చాలి

## - పాఠశాల బస్ డ్రైవర్లకు అవగాహన
## - పాపన్నపేట ఎస్సై సార శ్రీనివాస్ గౌడ్




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, ఏప్రిల్ 18 : రోడ్డు భద్రత నియమాలు పాటించి,పాఠశాల విద్యార్థులను సురక్షితంగా గమ్యం చేర్చాలని పాపన్నపేట ఎస్సై సారా శ్రీనివాస్ గౌడ్ అన్నారు.మండల కేంద్రమైన పాపన్నపేటలోని శ్రీవిద్య పాఠశాలలో రోడ్డు భద్రత వారోత్సవాలలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు,పోలీస్ శాఖ ఆధ్వర్యంలో "ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక" లో భాగంగా అరైవ్ అ లీవ్" కార్యక్రమం ద్వారా బస్సు డ్రైవర్లు, పాఠశాల సిబ్బందికి భద్రత, నియమాలు,నిబంధనలపై అవగాహన కల్పించారు. వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు బస్సు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు.ఫుట్ పాత్ ప్రయాణం చేయకుండా ఎంట్రీ డోర్ మూసిన తర్వాతే బస్సు కదిలించాలన్నారు.పిల్లలు బస్సు దిగిన తర్వాత బస్సు అటెండర్లు జాగ్రత్తగా రోడ్డు క్రాస్ చేయించాలన్నారు.ఎక్కడైనా రోడ్డు ప్రమాదాలు జరిగితే ప్రతి పౌరుడు బాధ్యతగా 108 సమాచారం అందించి గోల్డెన్ అవర్ లో బాధితులను హాస్పిటల్ కి చేరేలా చూడాలన్నారు.ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాలకు రక్షణ కవచంల ఉంటుందని అందువల్ల ప్రతి ఒక్క వాహనదారుడు హెల్మెట్ తోపాటు సీటు బెల్టు ధరించాలన్నారు.ఎవరికి వాళ్లు స్వతహగా నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చున్నారు. ప్రమాదాలు ఎక్కువగా నిర్లక్ష్యం,అతివేగం,మద్యం సేవించి వాహనాలు నడపడం, సెల్ ఫోన్,మైనర్లు,డ్రైవింగ్, ఓవర్ టేకింగ్,టర్నింగ్ పాయింట్ వద్ద క్రాసింగ్ లు చేయడంవల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.రోడ్డు భద్రత అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని ప్రతి వాహనదారుడు ప్రతి పౌరుడు బాధ్యతగావ్యవహరించినప్పుడే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చున్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ రవీందర్ గుప్తా, కరస్పాండెంట్ నిటలాక్షప్ప, సుమన్ తో పాటు బస్సు డ్రైవర్లుబస్ హెల్పర్స్, పాఠశాల,పోలీస్ సిబ్బంది. తదితరులు పాల్గొన్నారు.




# పాపన్నపేటలో బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ మిత్రపక్షాల దిష్టి బొమ్మ దగ్ధం

## - బీజేపీ జిల్లా నాయకులు బీకొండ రాములు నేత

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, ఏప్రిల్ 18 : పార్లమెంట్లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మహిళల కోసం 33 శాతం రిజర్వేషన్ కు సంబంధించిన మహిళా బిల్లును ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే.కాగా అట్టిబిల్లుపై మొదట్లో ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకగ్రీవంగా ఆమోదం తెలుపుతామని చెప్పి కాంగ్రెస్ దాని అనుబంధ పార్టీలన్నీ కలిసి పార్లమెంట్లో మహిళ బిల్లు ఆమోదం పొందకుండా వీగిపోయే విధంగా చేసినందుకు నిరసనగా బీజేపీ రాష్ట్ర,జిల్లాపార్టీ పిలుపుమేరకు శనివారం రోజు పాపన్నపేట మండల కేంద్రంలో బీజేపీ జిల్లానాయకులు బీకొండ రాములు నేత ఆధ్వర్యంలో కాంగ్రెస్ మిత్ర పక్షాల దిష్టిబొమ్మ దగ్ధం చేశారు.ఈకార్యక్రమంలో మండల స్థాయి నాయకులు, కిసాన్ మోర్చా నాయకులు మల్లంపేట చంద్రన్న, పాపన్నపేట పట్టణ అధ్యక్షులు సుంకరికిష్టయ్య,ఓబీసీ నాయకులు బాగేష్,జిల్లా లీగల్ సెల్ నాయకులు సతీష్ కుమార్,మండల నాయకులు వెంకట్, సాయిబాబా, యువమోర్చా నాయకులు పెంటన్న, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.





# విధివిధానాల ప్రకారమే ధాన్యం సేకరణ చేయాలి...

## - రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎన్.కోదండ రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నల్గొండ, ఏప్రిల్ 18 :ప్రభుత్వం రూపొందించిన విధివిధానాల ప్రకారమే ధాన్యం సేకరణ చేయాలని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎన్. కోదండ రెడ్డి అన్నారు. కొనుగోలు కేంద్రాలలో రైతులు ధాన్యం అమ్మిన తర్వాత మిల్లులకు వెళ్లాల్సిన అవసరం లేదని ,ఒకవేళ ఎవరైనా రైతులను రైస్ మిల్లులకు పంపిస్తే సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. శనివారంరైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలో ఉన్న ఆర్జాల బావి ,ఎస్ఎల్ బి సీ మార్కెట్ యార్డ్ లో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సంబంధిత అధికారులతో కలిసి తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాలలోని ధాన్యపు రాశులు, తేమ, తాలు,తరుగు తదితర వివరాలను తెలుసుకోవడమే కాకుండా ధాన్యాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం రెండుచోట్ల రైతులు, హమాలీలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహకులు, అధికారులతో సమావేశాలు నిర్వహించారు. ధాన్యం సేకరణ పాలసీకి విరుద్ధంగా ఎవరు సేకరణ చేయకూడదని, ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బంది పెడితే సహించేది లేదని, ఇందుకు సంబంధిత శాఖల అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ధాన్యం కొనుగోలులో మిల్లర్ల ప్రమేయం ఉండరాదని, కొనుగోలు కేంద్రంలో రైతు, కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు మాత్రమే సంబంధం ఉంటుందని, ధాన్యం అమ్మిన వెంటనే రైతుకు పక్కా రశీదు ఇవ్వాలని, అనంతరం రైతు బ్యాంక్ అకౌంట్లో డబ్బులు జమ చేయాలని చెప్పారు. కొనుగోలు కేంద్రం నుండి మిల్లులకు ధాన్యాన్ని పంపించిన తర్వాత మీల్లులకు వెళ్లాల్సిన బాధ్యత అధికారులదేనని, ధాన్యం విషయంలో రైస్ మిల్లర్ల పెత్తనం కుదరదని, గతంలో పద్ధతి చెల్లదని ఆయన స్పష్టం చేశారు. తాలు ,తరుగు ,తేమకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే రైతులు కొనుగోలు కేంద్రంలోనే పరిష్కారం చేసుకోవాలని, మిల్లర్లకు ఏదైనా సమస్య ఉంటే ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కరించుకోవాలని ఆయన తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం క్వింటాలకు 45 రూపాయలు మాత్రమే హామాలి చార్జీ తీసుకోవాలని, అంతకుమించి ఎక్కువ వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ధాన్యం సేకరణలో ప్రజాప్రతినిధులు ,అధికారులు రైతులకు ప్రాధాన్యత ఇచ్చి పూర్తిగా సహకరించాలని ఆయన కోరారు. ఎఫ్ సి ఐ గైడ్ లైన్స్ ప్రకారం రబీ ధాన్యం కొనుగోలు కు సంబంధించి తేమ, తరుగు వంటివి కొనుగోలు కేంద్రం లోనే ముందే చూసుకోవాలని, రైతుల సొంత ఖర్చులతో కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువస్తారని, తాలు, తరుగు పేరుతో వారిని ఇబ్బంది పెట్టడం భావ్యం కాదని, శాస్త్రీయంగా మద్దతు ధర వచ్చేలా చూడాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. కాంటా వేయకముందు తాలూ, తరుగు, తేమ హమాలీ పేరుతో కొనుగోలు కేంద్రాలలో అనేక ఇబ్బందులు పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇకపై ఇలాంటివన్నీ ఉండడానికి వీలులేదని, ధాన్యం సేకరణ విధానాల ప్రకారమే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, ఎవరైనా తేమ,తరుగు, తాలు పేరుతో రైతులను ఇబ్బందులు పెడితే సహించేది లేదని అన్నారు. ఇకపై ఇలాంటి అన్ని ఆపివేయాలని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వం అని, దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతుబంధు, రైతు రుణమాఫీ, ప్రభుత్వం ఇవ్వడం జరిగిందని తెలిపారు. కాగా పలువురు రైతులు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో మిల్లర్లు తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, తరుగు, తాలు, తూకం పేరిట అనవసరంగా మిల్లుల వద్ద లారీలను ఆపుతున్నారని, లారీకి 10 క్వింటాళ్ల చొప్పున తరుగు తీస్తున్నారని ,ప్రభుత్వం రైతుల గురించి ఆలోచించాలని కోరారు. రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న మాట్లాడారు. రైతు సంక్షేమ కమిషన్ మెంబెర్ సెక్రెటరీ గోపాల్, నల్గొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్ ,రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, మార్కెటింగ్ ఎడి ఛాయాదేవి, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ రాంపతి నాయక్, డిఎస్ఓ, తహసిల్దార్ పరశురాం, మాజీ జెడ్పిటిసి గుమ్మలమోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, ఆదర్శ రైతు రామిరెడ్డి, తదితరులు ఉన్నారు.




# మెదక్‌లో రోడ్డు భద్రతా చైతన్య రథం ప్రారంభం

## - ప్రతి ప్రయాణం సురక్షితం కావాలి
## - మెదక్ జిల్లా ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, ఏప్రిల్ 18 : రోడ్డు ప్రమాదాల నివారణకు మెదక్ జిల్లా పోలీసులు ప్రత్యేక చర్యలు ప్రారంభించారు.99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రతా కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రచార రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రారంభించిన చైతన్య రథం జిల్లాలోని అన్ని మండలాల్లో పర్యటిస్తూ గ్రామాలు,పట్టణాల్లో ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించనుందని,ముఖ్యంగా జనసంచారం అధికంగా ఉండే జంక్షన్‌లు, బస్టాండ్లు, మార్కెట్ ప్రాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారని, హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ వినియోగం,జీబ్రా క్రాసింగ్ వద్ద రోడ్డు దాటడం, వాహనాల మధ్య సురక్షిత దూరం పాటించడం,ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించడం వంటి అంశాలపై ప్రజలకు వివరణ ఇవ్వనున్నారు.అదే సమయంలో సెల్‌ఫోన్‌తో డ్రైవింగ్,మద్యం సేవించి వాహనం నడపడం, రాంగ్ రూట్‌లో ప్రయాణం, ఓవర్‌లోడింగ్ వంటి ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదం ఒక కుటుంబాన్ని పూర్తిగా కూదుపేసే ప్రమాదమని పేర్కొన్నారు.హెల్మెట్,సీట్ బెల్ట్ వినియోగం ప్రాణరక్షణకు అత్యవసరమని,ప్రతి ఒక్కరూ బాధ్యతతో ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు.అవగాహనతో పాటు నియమాల అమలులో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఎఆర్ డియస్పి రంగనాథ్, సీఐలు మహేష్, జర్జ్, సందీప్ రెడ్డి, కృష్ణ మూర్తి, ఆర్ఐలు శైలందర్, రామకృష్ణ, ఎసైలు, సిబ్బంది పాల్గొన్నారు.

# రక్త దానం చేద్దాం... ప్రాణాలను కాపాడుదాం

## జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్





(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు, ఏప్రిల్ 18 : రక్తదానం చేయడం ద్వారా నిండు ప్రాణాలను కాపాడవచ్చని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు.శనివారం ములుగు జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ -టి జి ఓ అసోసియేషన్, టీఎన్జీవో యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో ములుగు జిల్లా కేంద్రంలో మెగా రక్తదాన శిబిరం కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ హాజరై ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మనం ఇచ్చే ప్రతి రక్తపు బొట్టు ఒక నిండు ప్రాణాన్ని నిలబెడుతుందని, రక్తదానం అనేది కేవలం ఒక కార్యక్రమంగా చూడకూడదని, అది ఒక గొప్ప సామాజిక సంస్కృతిగా మారాలని ఉద్ఘాటించారు. జీవితాలను కాపాడే మహత్తర సేవలో భాగంగా ప్రతి ఆరోగ్యవంతుడు స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. రక్తం అందుబాటులో ఉండడం అత్యవసర చికిత్సలలో ఎంతో కీలకమని,ముఖ్యంగా ప్రమాదాలు,శస్త్రచికిత్సలు, అత్యవసర వైద్య సేవల సమయంలో రక్తదానం ప్రాణదాతగా నిలుస్తుందని అన్నారు.జిల్లాలోని ప్రజలు,ఉద్యోగులు, ఉపాధ్యాయులు,యువత, పెద్ద సంఖ్యలో స్వచ్ఛందంగా తరలివచ్చి రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి కలెక్టర్ ప్రశంసా పత్రాలు అందజేశారు. అదనపు కలెక్టర్లు సి హెచ్ మహేందర్ జి,సంపత్ రావులు రక్తదానం చేసి ఉద్యోగులకు, దాతలకు స్ఫూర్తిగా నిలిచారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సి హెచ్ మహేందర్ జి,సంపత్ రావు,డి ఆర్ డి ఓ చంద్రశేఖర్, అడిషనల్ డిఆర్డిఓ శ్రీనివాస్, ములుగు జిల్లా రవాణా శాఖ అధికారి బి శ్రీనివాస్,ఎం వి ఐ వినోద్ రెడ్డి,ఉద్యోగ సంఘ ప్రతినిధులు,యువత,వైద్య బృందం, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మినీ గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

## ప్రాంతీయ సమన్వయ కర్త పి.రత్నకుమారి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 18 : తెలంగాణ గిరిజన బాలికల మినీ గురుకులం మరిపెడ మండలం,కొత్తగూడ - గంగారాం ఉమ్మడి మండలం గోవిందాపూర్ పరిధి ప్రాంతం వారికి 2026-27విద్యా సంవత్సరమునకు (ఆంగ్ల మాధ్యమం) ప్రవేశాలకు 6 సంవత్సరాల వయస్సు కలిగిన బాలికలకు,1 తరగతి ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మహబూబాబాద్ ప్రాంతీయ సమన్వయ కర్త పి.రత్నకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. మరిపెడ మినీ గురుకులం 1 తరగతిలో 30 సీట్లు, బ్యాక్లాగ్ వేకెన్సీలు 2వ తరగతిలో 4 సీట్లు, 5వ తరగతిలో 5 సీట్లు. గోవిందాపూర్ మినీ గురుకులంలో ఒకటవ తరగతిలో 30 సీట్లు ,బ్యాక్లాగ్ వేకెన్సీలు 5వ తరగతిలో 20 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు.మినీ గురుకులం ఉన్న మండల స్థానికులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. సీట్ల ఎంపిక విధానం పి ఓ,ఐ టి డి ఏ ఏటురునాగారం సమక్షంలో లాటరీ ద్వారా ఎంపికైన విద్యార్థులకు ఉచిత భోజన వసతి,నోటు పుస్తకాలు,బెడ్ షీట్స్ దుస్తులు,టెక్స్ట్ బుక్స్ అన్ని రకాలైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ నెల 19వ తేది నుండి వచ్చే నెల 5వ తేదీ లోపు స్థానిక మండల, ఇతర మండలాలకు చెందిన వారు నేరుగా మినీగురుకులం లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు మినీ గురుకుల ప్రధానోపాధ్యాయులను నేరుగా సంప్రదించలని అన్నారు.

ప్రజాలక్ష్యం
సంపాదకీయం


# విపక్షాల ఐక్యతను బలోపేతం చేసిన మోడీ !

ప్రజాస్వామ్యంలో నిరంకుశం చేస్తామంటే కుదరదు. ప్రతి విషయంలోనూ అలాగే వ్యవహరిస్తున్న మోడీ, ఇప్పుడు 131వ రాజ్యాంగ సవరణ విషయంలోనూ అలాగే చేసారు. మహిళా బిల్లు సందర్భంగా సరిగ్గా అదే జరిగింది. బిజెపి నిరంకుశ విధానంపై ఓ రకంగా తిరుగుబాటుగానే భావిం చాలి. అలాగే విపక్షాలను ఐక్యం చేసిన ఘనత కూడా మోడీదనే చెప్పాలి. వారి ఓటు చెక్కుచెదరకుండా వేయగలిగారు. అలాగే వారంతా ఒక్కటిగా నిలబడేలా చేశారు. ఇది భవిష్యత్ రాజకీయాలకు కీలక మలుపుగా భావించాలి. అందుకే 131వ రాజ్యాంగ సవరణ వీగిపోయింది. ఇకపోతే మహిళా బిల్లు వేరు..డీ లిమిటేషన్ వేరు. 2023లోనే దీనిని ఆమోదించి, 2029 నుంచి అమల్లోకి తీసుకుని వస్తామని గతంలోనే చెప్పారు. అనూహ్యంగా ఇప్పుడు రెండూ కలగలిపి తీసుకుని రావడం ద్వారా బిజెపికి శృంగభంగం తప్పలేదు. నిజానికి ఈ బిల్లులను తీసుకుని వచ్చే ముందు అఖిలపక్షంలో చర్చించలేదు. విపక్షాలను విశ్వాసంలోకి తీసుకోలేదు. సొంతపార్టీలో చర్చించలేదు. ఎన్డిఎ పక్షాలతోనూ చర్చించ లేదు. బహుశా మోడీ, అమిత్ షాలు మాత్రమే చర్చించుకుని ఈ సవరణ బిల్లుకు యత్నించి ఉంటారు. బహుశా వారు ఇలాంటి పరిణామం ఎదురవుతుందని కూడా ఊహించ ఉంటారు. దీనిని ఆసరాగా చేసుకుని విపక్షాలను ఎండగట్టాలన్న ఉద్దేశం కూడా ఇందులో దాగి ఉంటుంది. అయితే విపక్షాల ఐక్యత ఇప్పుడు మోడీకి సవాల్ కానుంది. మొన్న సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి సంపూర్ణ మెజార్టీ కోల్పోయింది. కేవలం ఎన్డిఎ పక్షాల మద్దతుతో ప్రభుత్వం కొనసాగుతోంది. కనీసం ఎన్డిఎ పక్షాలతో అయినా మోడీ సమగ్రంగా చర్చించి ఉం టారని అనుకోవడానికి లేదు. ఒకప్పుడు బిజెపిలో మేధావి వర్గం ఉండేది. ఏదైనా సమస్యను ముందు పార్టీలో మేధావి వర్గంతో చర్చించేవారు. ఎత్తులు వేసేవారు. కానీ మోడీ వచ్చాక పెద్దలను దూరం పెట్టారు. ఇప్పుడు పెద్దా, చిన్నా అంతా ఆయనే. అందుకే మహిళా బిల్లు ముసుగులో డీలిమి టేషన్ తీసుకుని రావాలన్న ఎత్తుగడలను ప్రతిపక్షాలు ఉమ్మ డిగా చిత్తుచేశాయి. మహిళా బిల్లును ఉన్నపళంగా అమలు చేయడానికి విపక్షాలు సిద్ధంగా ఉన్నాయి. కానీ మోడీ ఎందు కనో అలా చేయకుండా మెలికి పెట్టారు. డీలిమిటేషన్ వల్ల కూడా సభ్యుల సంఖ్య పెరిగితే కూడా నష్టమే. 542 స్థానాలు ఉన్న లోకసభ 600 వరకు పెరిగితే ఫర్వాలేదు. కానీ 816 లేదా 850కి పెంచాలన్న తీరు మాత్రం ఆమోదించదగ్గది కాదు. రాజకీయంగా పదవులు పెరిగితే దేశానికి నష్టమే తప్ప లాభం లేదు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో బిజెపి వ్యవహరించిన తీరు, దానిని తరిస్కరించిన వైనం బిజెపికి గుణపాఠం కావాలి. ఇప్పటికైనా మేల్కొని ప్రజాస్వామ్య బద్ధం గా పాలన చేయకుంటే విపక్షాలు మరింత ఐక్యం అవుతాయని నిరూపించాయి. ఇప్పటికే సర్ ప్రక్రియ సెగరేపుతోంది. ఇప్పు డు 131 సవరణ తోడయ్యింది. ప్రజలు ఎప్పుడూ బిజెపి వెంటే ఉంటారని అనుకోవడానికి లేదు. తాజా 131 సవరణ ప్రతిపాదన దక్షిణాదిలో కూడా తీవ్ర చర్చకు దారితీసింది. తమకున్న అధికారం పోతోఉందని, తమ ప్రాతినిధ్యానికి విలువ ఉండదన్న భావనలో ఇక్కడి నేతలు వచ్చారు. అందుకే దక్షిణ్యాది నేతలు కేంద్ర ప్రభుత్వం హడావిడిగా తెచ్చిన నియోజకవర్గాల పునర్విభజన బిల్లుకు వ్యతిరేకంగా పోరాటం చేసారు. మోదీ సర్కారుకు ఓటమి రుచి చూపించారు. మహి ళా రిజర్వేషన్ బిల్లును ముందుపెట్టి.. డీలిమిటేషన్ బిల్లును ఆమోదింపజేసుకోవాలన్న కేంద్ర ఎత్తుగడను లోకసభలో శుక్రవారం మూకుమ్మడిగా తిప్పికొట్టడం వెనక ఈ ఐక్యత స్పష్టం గా కనిపించింది. మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ బిల్లు సభలో వీగిపోయేలా చేయటంలో దక్షిణాది రాష్ట్రాల ఎంపీలు కూడా కీలకపాత్ర పోషించారు. ఆంధ్రప్రదేశ్‌లోని పార్టీలు మినహా తెలంగాణ, కేరళ, తమిళనాడు, కర్ణాటకలోని ఎన్డీయే యేతర పార్టీల ఎంపీలంతా ఈ బిల్లును మరో ఆలోచనకు తావులేకుండా తిరస్కరించారు. తమిళనాడుకు చెందిన 38 మంది, కేరళలోని 20 మంది, తెలంగాణలోని 9మంది, కర్ణాటకలోని 9 మంది ఎన్డీయే యేతర ఎంపీలు డీలిమిటేషన్ బిల్లును అడ్డుకోవటంలో కీలకపాత్ర పోషించారు. డీలిమిటేషన్ బిల్లును బహిరంగా తగులబెట్టి తమ నిరసన ఏ స్థాయిలో ఉంటుందో చూడాలని కేంద్రాన్ని తమిళనాడు సిఎం స్టాలిన్ సవాల్ చేశారు. పార్లమెంటులోనూ తమిళనాడు ఎంపీలు నల్ల దుస్తులు ధరించి బిల్లుకు వ్యతిరేకంగా బలంగా పోరా టం చేశారు. కొత్తగా జనాభా లెక్కలను సేకరించకుండానే మోదీ సర్కారు ఏకపక్షంగా, హడావిడిగా డీలిమిటేషన్‌కు పూనుకోవటంపై అందరిలోనూ అనుమానాలు బలపడ్డాయి. కేంద్రం దక్షిణాదికి ద్రోహం చేస్తోందని ఎలుగెత్తారు. తమ రాష్ట్రాల ప్రాతినిధ్యం లేకుండానే భవిష్యత్తులో ఉత్తరాది బలంతో కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు జరిగేలా దక్షిణాది ప్రాతినిధ్యంతో పనిలేకుండా చేయటమే మోదీ సర్కారు అసలు లక్ష్యమని విమర్శలు గుప్పించారు. రాజ్యాంగాన్ని బలహీన పర్చి, దేశ ఎన్నికల ముఖచిత్రాన్నే మార్చేయాలని కేంద్రం కుట్ర చేస్తోందని కమ్యూనిస్టు పార్టీలు కూడా పోరాటం చేశా యి. అందుకే కసిగా ఉన్న స్టాలిన్ 'ఢిల్లీని తమిళనాడు ఓడిం చింది' అని ప్రకటించారు. ఈ క్రమంలో ఇప్పుడు బిజెపి పునరాలోచన చేయాలి. పెద్దలను, మేధావులను గౌరవిం చడం అలవాటు చేసుకవాలి. కీలకమైన ఇలాంటి సవరణల సందర్భంలో విపక్షాలను విశ్వాసంలోకి తీసుకోవాలి. డీలిమి టేషన్ కూడా లిమిట్ దాటకుండా సీట్లను కుదించాలి. అందరి ఆమోదంతో మళ్లీ బిల్లును ప్రవేశ పెట్టడం ద్వారా ముందుగా మహిళా బిల్లుకు ఆమోదం దక్కేలా చూడాలి. అప్పుడే పోయిన పరువు కొంతయినా దక్కుతుంది.అంతే తప్ప మహిళా బిల్లు ను వ్యతిరేకించారన్న ప్రచారం ఫలితం ఇవ్వదని గుర్తించాలి.

# తెలంగాణ ఆత్మగౌరవ ప్రయాణంలో పుష్కరకాల ప్రస్థానం



తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం కేవలం ఒక భౌగోళిక విభజన కోసం జరిగిన పోరాటం కాదు...అది దశాబ్దాలుగా మోపబడిన అన్యాయానికి, దోపిడీకి, అవమానానికి వ్యతిరేకంగా ఎగిసిన అగ్నిజ్వాల. "నీళ్లు, నిధులు, నియామ కాలు" అనే మూడు మూల సూత్రాలపై నిలిచిన ఈ ఉద్యమం, ప్రతి రైతు చెమటలో, ప్రతి నిరు ద్యోగి ఆవేదనలో, ప్రతి మహిళ గుండె చప్పుడు లో ప్రతిధ్వనిం చింది. కృష్ణా, గోదావరి వంటి మహానదులు గుండా ప్రవహిస్తున్నా, సాగు నీరు కోసం ఎండిన భూములు, తాగునీటి కోసం అల్లాడిన గ్రామాలు ఈ పోరాటానికి ప్రాణం పోశాయి. "మన నిధులు మనకే" అనే గర్జన, "మన కొలువులు మనకే" అనే ఆవేదన, "మన సంస్కృతి మనకే" అనే గౌరవం...ఇవన్నీ కలిసే తెలంగాణ ఆత్మగౌరవ యాత్రకు రూపం ఇచ్చాయి. ఇది కేవలం రాష్ట్రం కోసం కాదు, స్వీయ అస్తిత్వం కోసం; ఇది కేవలం సరిహద్దుల కోసం కాదు, స్వాభిమాన హక్కుల కోసం. ఈ ఉద్యమం ప్రతి వర్గాన్ని, ప్రతి తరగతిని, ప్రతి మతాన్ని ఒకే జెండా కింద సమీకరించింది. బతుకమ్మ, బోనాలు వంటి పండుగలకు గుర్తింపు దక్కాలని, స్థానిక యువతకు ఉద్యోగాలు రావాలని, దళితులకు భూమి దక్కాలని, మైనారిటీలకు సమాన అవకాశాలు లభించాలని ప్రజలు గళమెత్తారు. తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటం, ఒక ప్రాంతపు భౌగోళిక హక్కు మాత్రమే కాదు---సామాజిక న్యాయం, ఆర్థిక సమానత్వం, సాంస్కృతిక గౌరవం కోసం సాగిన మహా యజ్ఞం. ఈ నేపథ్యంలో దశాబ్దాలతరబడి సాగిన పోరాటక్రమంలో, అనేక బలిదానాల ఫలితంగా, అనేక పోరాటాల పర్యవసానంగా సాధించుకున్న తెలంగాణ ప్రత్యేకరాష్ట్ర ప్రస్థానంలో అప్పుడే ఒక పుష్కరకాలం గతించిపోతున్నది. ఈ క్రమంలో నిర్రాణమైపోతున్న పౌరసమాజాన్ని మరోమారు తట్టిలేపేందుకు ఈ పన్నెండు సంవత్సరాల స్వీయఅస్తిత్వ ప్రయాణంలో ఎదురైన అనుభవాలను, ఆటుపోట్లను మననం చేసుకోవాల్సిన అవసరం ఉన్నది. ఉద్యమ ఆకాంక్షలను, వాటి అమలుతీరును మరోమారు సమీక్షించుకోవాల్సి ఉన్నది. ఆ ప్రయత్నంలో ఒక చిరుప్రయత్నమే ఈ సుధీర్ఘ వ్యాసం ఉద్దేశ్యం.




## ఆకాంక్షల కవాతు... అస్తిత్వ సమరం!

తెలంగాణ.. ఇది కేవలం ఒక భౌగోళిక పటం మీద గీసిన రేఖ కాదు; ఆరు దశాబ్దాల ఆవేదనను, అణచివేతను ఛేదించుకుంటూ ఉవ్వెత్తున ఎగిసిన ఒక సామూహిక చైతన్య కేతనం. ప్రపంచ చరిత్రలోనే ఒక జాతి తన ఆత్మగౌరవం కోసం, మనుగడ కోసం చేసిన అత్యంత సుదీర్ఘమైన, శాంతియుతమైన ప్రజాస్వామ్య పోరాటానికి సజీవ సాక్ష్యం ఈ నేల. వేలమంది అమరవీరుల త్యాగఫలం, కోట్లాది గొంతుకల ఏకీకృత నినాదం 'నీళ్లు, నిధులు, నియామకాలు' అనే సూక్ష్మ లక్ష్యాలతో వలసవాద సంకెళ్లను తెంచింది. కానీ, స్వరాష్ట్ర కల సాకారమై పుష్కర కాలం గడిచినా, ఆనాడు ఏ ఆకాంక్షల కోసమైతే పల్లె పల్లెనా ఉద్యమ అగ్ని రాజుకుందో, ఆ లక్ష్యాలు నేటికీ సంపూర్ణంగా సాకారం కాలేదనేది ఒక కఠువైన వాస్తవం.

రాష్ట్రం భౌతికంగా రూపుదిద్దుకుంది, ఆర్థికంగా బలపడింది, రోడ్లు-భవనాలతో ధగధగలాడుతోంది. కానీ, ఉద్యమ ఆత్మ అయిన 'సామాజిక తెలంగాణ' మరియు 'ప్రజాస్వామ్య తెలంగాణ' అనే విలువలు నేడు రాజకీయ స్వార్థం, అధికార కేంద్రీకరణ మరియు అస్తిత్వ విధ్వంసక శక్తుల మధ్య నలిగిపోతున్నాయి. వలసవాదులు నాడు నేరుగా దోచుకుంటే, నేడు అంతర్గత, బాహ్య శక్తులు కొత్త ముసుగులలో తెలంగాణ ఆత్మగౌరవాన్ని, సంపదను కొల్లగొట్టే కుట్రలు చేస్తున్నాయి. రాజకీయ పార్టీలు కేవలం అధికార మార్పిడికే ప్రాధాన్యతనిస్తూ, ప్రజల అసలు సమస్యలను తెరమరుగు చేస్తున్న తరుణంలో, పౌర సమాజం తన మౌనాన్ని వీడాల్సిన సమయం ఆసన్నమైంది.

ఈ సంధి కాలంలో, తెలంగాణ పోరాట స్ఫూర్తిని రక్షించుకోవడానికి, పాలకులను నిరంతరం ప్రజాస్వామ్య బద్ధంగా నిలదీయడానికి, మరియు అణగారిన వర్గాల ఆత్మగౌరవాన్ని కాపాడడానికి ఒక నైతిక దిక్సూచి అవసరం. అదే 'తెలంగాణ అస్తిత్వ వేదిక'. ఇది కేవలం ఒక సంస్థ కాదు; తెలంగాణ మూల ఆకాంక్షలను మోసే ఒక చైతన్య రథం, రాజ్యాంగ విలువల రక్షణ కవచం, మరియు రేపటి తరాలకు వక్రీకరణ లేని తెలంగాణను అందించే అక్షరాయుధం. తెలంగాణ ఆత్మగౌరవ జెండాను మళ్ళీ సమున్నతంగా ఎగురవేయడానికి, ప్రజాస్వామ్య విలువలను పునరుద్ధరించడానికి ఈ వేదిక ఆవిర్భావం ఒక చారిత్రక అనివార్యత.

-పిట్టల రవీందర్

### తెలంగాణ రాష్ట్రసాధన ఉద్యమ నేపథ్యం

ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థానిక నిరుద్యోగులకు రావాల్సిన అవకాశాలను అక్రమ పద్ధతుల్లో ఇతరులు దక్కించుకోవడంపై యువతలో తీవ్ర ఆగ్రహం ఉండేది. 'ముల్కీ' నిబంధనల స్ఫూర్తితో స్థానిక కొలువులు స్థానికులకే దక్కాలని, ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసి తెలంగాణ యువతకు ఉపాధి కల్పించాలనేది ఉద్యమ కీలక ఆకాంక్ష.

ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ భాష, యాస, సంస్కృతిపై జరిగిన హేళనను ప్రజలు సహించలేకపోయారు. బతుకమ్మ, బోనాలు వంటి పండుగలకు సరైన గుర్తింపు దక్కాలని, తమ ప్రత్యేక సంస్కృతిని కాపాడుకోవాలని తెలంగాణ అస్తిత్వ పోరాటం ఉధృతమైంది. ఇది కేవలం భూమి కోసం కాదు, తమ గౌరవం కోసం జరిగిన పోరాటం.

రాష్ట్ర సాధనలో అన్ని కులాల, మతాల ప్రజలు (సబ్బండ వర్గాలు) భాగస్వాములయ్యారు. ప్రత్యేక రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు రాజకీయ, ఆర్థిక రంగాల్లో సమాన అవకాశాలు దక్కాలని, సామాజిక న్యాయంతో కూడిన అభివృద్ధి జరగాలని అందరూ ఆశిం చారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రజలను సమీకరించడానికి మరియు రాష్ట్రం ఏర్పడితే జరిగే మార్పులను వివరించడానికి ఉద్యమ పార్టీలు (ప్రధానంగా టీఆర్ఎస్/బీఆర్ఎస్) అనేక కీలకమైన రాజకీయ హామీలను ఇచ్చాయి. దళిత ముఖ్యమంత్రి: స్వరాష్ట్రం సిద్ధించిన తర్వాత తెలంగాణకు తొలి ముఖ్యమంత్రిగా దళిత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని నియమిస్తామని ఉద్యమ ప్రారంభ దశలో హామీ ఇచ్చారు. భూమి లేని ప్రతి దళిత కుటుంబానికి మూడు ఎకరాల సాగు భూమిని పంపిణీ చేసి, వారిని ఆర్థికంగా బలోపేతం చేస్తామని ప్రకటించారు. ముస్లిం మైనారిటీలకు మరియు గిరిజనులకు (ఎస్టీ) వారి జనాభా నిష్పత్తికి అనుగుణంగా విద్య, ఉద్యోగ రంగాల్లో 12 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన అన్యాయాన్ని సరిదిద్దుతూ, స్వరాష్ట్రంలో లక్షకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలను యుద్ధ ప్రాతిపదికన భర్తీ చేస్తామని యువతకు మాట ఇచ్చారు.అప్పుల ఊబిలో ఉన్న రైతులను ఆదుకోవడానికి, వారు తీసుకున్న వ్యవసాయ రుణాలను రద్దు చేస్తామని హామీ ఇచ్చారు.కుటీర పరిశ్రమలు ఒ కుల వృత్తులు: సబ్బండ వర్గాల (అన్ని వెనుకబడిన తరగతుల) అభివృద్ధి కోసం కుల వృత్తులకు పూర్వవైభవం తీసుకువస్తామని, సామాజిక న్యాయం పాటిస్తామని రాజకీయ పక్షాలు ప్రకటించాయి.

### పుష్కరకాల స్వీయఅస్తిత్వ తెలంగాణ రాష్ట్రఉనికి కాలంలో...

తెలంగాణ రాష్ట్రం గడిచిన 12 ఏళ్లలో (బి.ఆర్.ఎస్ ప్రభుత్వ 9.5 ఏళ్లు, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ సుమారు 2 ఏళ్లు) సాగునీరు, సంక్షేమం, మరియు ఆర్థిక రంగాల్లో గణనీయమైన మార్పులను చూసింది. రాష్ట్ర ప్రభుత్వం నీటి పారుదల రంగానికి అత్యంత ప్రాధాన్యతనిచ్చింది. మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికీ రక్షిత మంచినీరు అందించి, దేశానికే ఆదర్శంగా నిలిచింది. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ద్వారా లక్షలాది ఎకరాలకు సాగునీరు అందిన ప్పటికీ, మేడిగడ్డ వంటి చోట్ల నిర్మాణ లోపాలు మరియు ప్రాజెక్టు వ్యయంపై రాజకీయంగా, సాంకేతికంగా విమర్శలు వెల్లువెత్తాయి. అదేవిధంగా, దక్షిణ తెలంగాణ వరప్రదాయిని అయిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులు తుది దశకు చేరుకుని, కొన్ని ప్రాంతాల్లో నీటి విడుదల ప్రారంభం కావడం ఒక కీలక మైలురాయి.

తెలంగాణ ఆర్థికంగా బలమైన రాష్ట్రంగా అవతరించింది. రాష్ట్ర బడ్జెట్ పరిమాణం ఏటేటా పెరుగుతూ వచ్చింది. తలసరి ఆదాయంలో తెలంగాణ దేశంలోనే అగ్రగామి రాష్ట్రాలలో ఒకటిగా నిలవడం విశేషం. ముఖ్యంగా హైదరాబాద్ను కేంద్రంగా చేసుకుని ఐటీ మరియు ఫార్మా రంగాలు సాధించిన వృద్ధి రాష్ట్ర ఖజానాకు ప్రధాన ఆదాయ వనరుగా మారింది.

ఉద్యోగాల భర్తీ విషయంలో మిశ్రమ ఫలితాలు కనిపించాయి. టీఎస్పీఎస్సీ ద్వారా నోటిఫికేషన్లు వెలువడినప్పటికీ, పేపర్ లీకేజీలు, సాంకేతిక సమస్యలు మరియు న్యాయపరమైన చిక్కుల వల్ల నియామక ప్రక్రియలో జాప్యం జరిగింది. దీనివల్ల నిరుద్యోగుల్లో కొంత అసంతృప్తి నెలకొంది. అయితే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మెగా డిఎస్సీ మరియు గ్రూప్ పరీక్షల నిర్వహణ ద్వారా ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేసే ప్రయత్నాలు చేస్తోంది. సంక్షేమ రంగంలో తెలంగాణ వినూత్న పథకాలకు వేదికైంది. రైతులకు పెట్టుబడి సాయం అందించి వ్యవసాయాన్ని నిలకడగా మార్చింది. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేద కుటుంబాలకు ఆసరాగా నిలిచాయి. ఎస్సీ కుటుంబాల ఆర్థిక స్వాలంబన కోసం దళితబంధులాంటి ప్రతిష్టాత్మక పథకం ప్రారంభమైంది. ప్రస్తుత ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి (మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం), గృహజ్యోతి (200 యూనిట్ల ఉచిత విద్యుత్) వంటి పథకాలు క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయి. గడిచిన 12 ఏళ్లలో తెలంగాణ మౌలిక సదుపాయాలు మరియు సంక్షేమంలో ముందడుగు వేసినప్పటికీ, నియామకాల భర్తీ మరియు ప్రాజెక్టుల నిర్వహణలో ఎదురైన సవాళ్లను అధిగమించడం భవిష్యత్తు అభివృ ద్ధికి కీలకం.

అయితే... తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని విశ్లేషిస్తే, గత పుష్కర కాల పాలనపై ప్రజల్లో భిన్నమైన అభిప్రాయాలు మరియు మిశ్రమ స్పందన కనిపిస్తోంది. తెలంగాణ సమాజంలో సంతృప్తిని కలిగిస్తున్న ప్రధాన అంశం సొంత రాష్ట్ర అస్తిత్వం. తెలంగాణ సంస్కృతి, భాష మరియు పండుగలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు దక్కడం ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపింది. పాలనాపరంగా చూస్తే, కొత్త జిల్లాల ఏర్పాటుతో ప్రభుత్వ యంత్రాంగం ప్రజలకు చేరువయ్యింది. అలాగే విద్యుత్ సరఫరాలో గణనీయమైన మెరుగుదల, రహదారుల విస్తరణ మరియు సాగునీటి ప్రాజెక్టుల వల్ల వ్యవసాయం స్థిరీకరించబడటం పట్ల గ్రామీణ రైతాంగం సానుకూలంగా ఉంది.

మరోవైపు, కొన్ని అంశాలు ప్రజల్లో, ముఖ్యంగా యువతలో అసంతృప్తికి దారితీస్తున్నాయి. ఉద్యమ ప్రధాన ఆకాంక్ష అయిన 'నియామకాలు' పూర్తిస్థాయిలో నెరవేరకపోవడం, పరీక్షల నిర్వహణలో జరిగిన జాప్యం యువతలో నిరాశను మిగిల్చింది. ప్రభుత్వం చేపట్టిన భారీ ప్రాజెక్టులు మరియు సంక్షేమ పథకాల వల్ల రాష్ట్రంపై పెరిగిన అప్పుల భారం భవిష్యత్తు ఆర్థిక స్థితిగతులపై ఆందోళన కలిగిస్తోంది. వీటితో పాటు, సామాజిక న్యాయం విషయంలో కూడా విమర్శలు ఉన్నాయి. రాజకీయ అధికారంలో అన్ని వర్గాలకు సమాన ప్రాతినిధ్యం దక్కలేదని, ముఖ్యంగా దళితులకు భూ పంపిణీ వంటి హామీలు ఆశించిన స్థాయిలో అమలు కాలేదనే భావన కొంత అసంతృప్తికి కారణమవుతోంది.

మొత్తంగా చూస్తే, తెలంగాణ రాష్ట్రం భౌతిక అభివృద్ధిలో ముందడుగు వేసినప్పటికీ, సామాజిక మరియు ఉపాధి రంగాల్లో ప్రజల ఆకాంక్షలు ఇంకా పూర్తిస్థాయిలో నెరవేరాల్సి ఉంది. తెలంగాణ రాష్ట్రం ఒక భౌగోళిక యూనిట్గా ఆర్థికంగా బలోపేతమైంది. కానీ, ఉద్యమ కాలం నాటి 'సామాజిక తెలంగాణ' మరియు 'నిరుద్యోగ రహిత తెలంగాణ' అనే లక్ష్యాలను చేరుకోవడంలో ఇంకా ప్రయాణం చేయాల్సి ఉంది. ప్రజలు తమ ప్రాథమిక ఆకాంక్షల అమలు విషయంలో ప్రభుత్వాల పనితీరును నిరంతరం బేరీజు వేస్తూనే ఉన్నారు.

### జాడలేని స్వీయఅస్తిత్వ రాజకీయాలు:

తెలంగాణ రాష్ట్రం కేవలం భౌగోళిక సరిహద్దుల మార్పు కోసం కాకుండా, ప్రజాస్వామ్య విలువల పునరుద్ధరణ మరియు సామాజిక న్యాయం లక్ష్యంగా ఏర్పడింది. గత 12 ఏళ్ల ప్రస్థానాన్ని పరిశీలిస్తే, భౌతిక అభివృద్ధి కొంతమేరకు సంతృప్తికరమైన రీతిలోనే జరిగినప్పటికీ, రాజ్యాంగ నిర్దేశాల అమలు మరియు ప్రజాస్వామ్య స్ఫూర్తి విషయంలో విమర్శనాత్మకమైన వైరుధ్యాలు కనిపిస్తాయి.

అధికార వికేంద్రీకరణ విషయంలో రాజ్యాంగం పారదర్శకతను ఆశిస్తే, గత దశాబ్ద కాలంలో అధికారం సచివాలయం నుంచి ముఖ్యమంత్రి నివాసానికి పరిమితమైందనే విమర్శ బలంగా ఉంది. మంత్రులు, ఎమ్మెల్యేల కంటే ముఖ్య మంత్రి కార్యాలయ నిర్ణయాలే ప్రాధాన్యత సంతరించుకోవడం సమిష్టి బాధ్యతకు విఘాతంగా మారింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయంలోకి ప్రజల ప్రవేశాన్ని సులభతరం చేస్తూ 'ప్రజావాణి' వంటి కార్యక్రమాలను చేపట్టడం ప్రజాస్వామ్య పునరుద్ధరణ దిశగా ఒక సానుకూల అడుగుగా కనిపిస్తోంది. నిరసన తెలిపే హక్కు విషయంలో కూడా గతంలో ధర్నా చౌక్ ఎత్తివేత ప్రయత్నాలు, పోలీసు యంత్రాంగంపై అతిగా ఆధారపడి అరెస్టులు చేయడం వంటివి పౌర స్వేచ్ఛకు విఘాతం కలిగించాయి. ప్రస్తుతం ఆంక్షల తీవ్రత కొంత తగ్గినట్లు అనిపించినా, శాంతిభద్రతల పేరిట నియంత్రణలు కొనసాగుతూనే ఉన్నాయి.

రాజకీయ నైతికత విషయానికి వస్తే, 10వ షెడ్యూల్ స్ఫూర్తిని విస్మరించి పార్టీ ఫిరాయిం పులను ప్రోత్సహించడం ద్వారా ప్రజా తీర్పును అవమానించడం ఒక సంప్రదాయంగా మారింది. విపక్షాలను నిర్వీర్యం చేయడం వల్ల శాసనసభలో విమర్శనాత్మక గొంతుక కరువై ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యం దెబ్బతింది. సామాజిక న్యాయం మరియు ఆదేశిక సూత్రాల అమలులో కూడా లోపాలు కనిపిస్తున్నాయి; ముఖ్యంగా జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీ వర్గాలకు నిర్ణయాధికారంలో తగిన ప్రాతినిధ్యం దక్కలేదు. స్థానిక సంస్థలైన గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయించకుండా వాటిని నిర్వీర్యం చేయడం వల్ల రాజ్యాంగ సవరణల స్ఫూర్తి కుంటుపడింది.

సమాఖ్య వ్యవస్థలో కేంద్రంతో జరిగిన ఘర్షణ మరియు గవర్నర్ వ్యవస్థతో నెలకొన్న వివాదాలు రాజ్యాంగ సంక్షోభ పరిస్థితులను తలపించడమే కాకుండా పరిపాలనాపరమైన స్తబ్ధతకు కారణమయ్యాయి. సానుకూల కోణంలో తెలంగాణ బలమైన ఆర్థిక శక్తిగా ఎదిగి, సంక్షేమ పథకాల ద్వారా రాజ్యాంగ ఆశయాలకు అనుగుణంగా అట్టడుగు వర్గాలకు చేరువైనప్పటికీ, వ్యవస్థల స్వయంప్రతిపత్తి దెబ్బతినడం ఆందోళనకరం. అధికారిక నాయక త్వంలో ప్రజా సేవకుల భావన కంటే అధికార దర్పం పెరగడం ప్రజాస్వామ్యాన్ని కేవలం ఓట్ల పండుగగా మార్చేసింది. రోడ్లు మరి యు ప్రాజెక్టుల వంటి భౌతిక అభివృద్ధి సాధించిన తెలంగాణ, సామాజిక న్యాయం మరియు ప్రజాస్వామ్య విలువల బలోపేతం విషయంలో రాజ్యాంగ స్ఫూర్తిని రాజకీయ ఆచరణలోకి తీసుకు రావాల్సిన అవసరం చాలా కనిపిస్తున్నది.

తెలంగాణ రాష్ట్ర సాధనలో అద్వితీయ పాత్ర పోషించిన 'సబ్బండ వర్గాలు' మరియు పౌర సమాజం, రాష్ట్రం సిద్ధించిన తర్వాత ప్రభుత్వాలను జవాబుదారీ చేయడంలో ఎదుర్కొన్న సవా ళ్లు, ఆయా సంఘాల పరిణామ క్రమాన్ని కూడా ఈ సందర్భంలో పరిశీలించుకోవాల్సిఉన్నది.

### పౌర సమాజం మరియు వృత్తి సంఘాల పాత్ర:

ఉద్యమ కాలంలో 'సకల జనుల సమ్మె' ద్వారా రాష్ట్రాన్ని స్తంభింపజేసిన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, స్వరాష్ట్రం వచ్చిన ప్రారంభంలో పాలనను గాడిలో పెట్టడంలో ప్రభుత్వానికి సహకరించాయి. అయితే, కాలక్రమేణా సంఘాల నాయకత్వం రాజకీయంగా ప్రభావితం కావడం, కీలక నాయకులు రాజకీయ పదవులను ఆశించడం వల్ల సాధారణ ఉద్యోగుల సమస్యలైన పిఆర్సి, సిపిఎస్ రద్దు, మరియు 317 జీవో వంటి అంశాలపై ఆశించిన స్థాయిలో పోరాడలేకపోయారనే విమర్శ ఉంది. అలాగే, తమ పాటలతో పల్లెలను మేల్కొల్పిన కవులు, రచయితలు మరియు సాంస్కృతిక సమూహాలు రాష్ట్రం వచ్చాక రెండు వర్గాలుగా విడిపోయారు. ఒక వర్గం ప్రభుత్వ సాంస్కృతిక సారథులుగా మారి అస్తిత్వాన్ని చాటిచెప్పగా, మరో వర్గం ప్రజాస్వామ్య తెలంగాణ కోసం గొంతుకను కొనసాగించింది. ఉద్యమ కాలంలో పాలకులను ప్రశ్నించిన కొన్ని గొంతులు, అధికారిక ప్రశంసలకే పరిమితమయ్యాయనే ఆరోపణలు కూడా ఉన్నాయి.న్యాయవాదులు, జర్నలిస్టులు మరియు మేధావి వర్గాలు పాత్రను గమనిస్తే, న్యాయవాదులు హైకోర్టు విభజన కోసం శ్రమించినప్పటికీ, పౌర హక్కుల ఉల్లంఘన జరిగినప్పుడు వారి గొంతు గతంలో వినిపించినంత బలంగా వినిపించలేదు. జర్నలి స్టులు ఒకప్పుడు ఉద్యమ ప్రచారకర్తలుగా ఉన్నా, గత దశాబ్ద కాలంలో మీడియాపై పెరిగిన అప్రకటిత ఆంక్షలు మరియు ప్రభుత్వ నియంత్రణ వల్ల వారి స్వేచ్ఛా

(మిగతా 5వ పేజీలో...)

# రోడ్ల విస్తరణ పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే

## 2.5 కోట్ల సింగరేణి నిధులతో అభివృద్ధి పనులు ప్రారంభం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, ఏప్రిల్ 18 : రామగుండం నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి మరో ముందడుగు పడింది. సింగరేణి యాజమాన్యం, స్థానిక ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ సమన్వయంతో ఆర్జీ-1 ఏరియా పరిధిలోని జవహర్ నగర్ నుంచి పరశురాం నగర్, 5 ఇంక్లైన్ వరకు చేపట్టనున్న ప్రధాన రోడ్ల విస్తరణ పనులకు శనివారం శ్రీకారం చుట్టారు. ఆర్జీ-1 జనరల్ మేనేజర్ డి.లలిత్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ రూ. 2.5 కోట్ల సింగరేణి నిధులతో పనులను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం లలిత్ కుమార్ మాట్లాడుతూ రామగుండం అభివృద్ధిపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించి చేసిన విజ్ఞప్తి మేరకు సింగరేణి యాజమాన్యం ఈ పనులకు నిధులు కేటాయించిందన్నారు. జవహర్ నగర్, పరశురాం నగర్, 5 ఇంక్లైన్ కాలనీల్లో పెరుగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకుని వాహనదారులకు ఇబ్బందులు లేకుండా రోడ్ల విస్తరణకు భూమి పూజ నిర్వహించి పనులను ప్రారంభించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం సింగరేణి నిధులను వినియోగిస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. రోడ్ల విస్తరణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి మూడు నుంచి నాలుగు నెలల్లో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ పనులు పూర్తయిన తర్వాత స్థానిక కాలనీల రూపురేఖలు మారనున్నాయని పేర్కొన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతిపెల్లి ఎల్లయ్య, డీజీఎం (సివిల్) వరప్రసాద్, సింగరేణి శ్రీనివాస్, కాంట్రాక్టర్ మొండయ్య, కార్పొరేటర్లు దూలికట్ట సతీష్, బెంద్రం రాజిరెడ్డి, ముస్తఫా, నాయకులు దాసరి విజయ్ తదితరులు, సింగరేణి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# వాహనదారులు నిబంధనలు ఖచ్చితంగా పాటించాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మంచిర్యాల, ఏప్రిల్ 18 : వాహనదారులు రహదారి భద్రతా నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వేంపల్లి లో గల జిల్లా రవాణా శాఖ అధికారి కార్యాలయ ఆవరణలో అరైవ్ అలైవ్ లో భాగంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి జిల్లా రవాణా అధికారి సిహెచ్. రంజిత్, అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో అరైవ్ అలైవ్ లో భాగంగా ఆటో, లారీల డ్రైవర్లకు వైద్య పరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులతో దాదాపు 200 మంది డ్రైవర్లకు పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్నవారికి మందులు, కంటి అద్దాలు అందించడం జరిగిందని తెలిపారు. రోడ్లపై ప్రయాణించే సమయంలో రక్షణ ముఖ్యమని, ప్రతి వాహనదారుడు లైసెన్స్ కలిగి ఉండాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారులో ప్రయాణించేవారు సీటు బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. వాహనం నడిపే సమయంలో వేగ పరిమితి అనుసరించాలని, మద్యం సేవించి, మొబైల్ మాట్లాడుతూ వాహనం నడపకూడదని తెలిపారు. ప్రజల రక్షణలో భాగంగా వాహనదారులు ఎలాంటి కంటి సమస్యలు లేకుండా చూసుకోవాలని, వాహనాలు నడిపే వారికి కంటిచూపు అత్యవసరమని, కంటి పరీక్షలు నిర్వహించిన వారిలో అవసరం ఉన్నవారికి శస్త్రచికిత్స చేయడం జరుగుతుందని తెలిపారు. రోడ్డు ప్రమాదం అంటే ఒక కుటుంబానికి జరిగే ప్రమాదమని తెలిపారు. జిల్లాలో రహదారులపై లైట్లు, బ్లైండ్ స్పాట్లను గుర్తించి తగు ఏర్పాట్ల చేయడం జరుగుతుందని, సిగ్నల్ వ్యవస్థలను ఏర్పాటు చేసి వాహనాలను నియంత్రించడం జరుగుతుందని తెలిపారు. అనుభవానికి, ప్రమాదానికి సంబంధం లేదని, వాహనం నడిపి సమయంలో ఏకాగ్రతతో నడపాలని తెలిపారు. ప్రతి వాహనానికి సంబంధించి ధ్రువపత్రాలు కలిగి ఉండాలని, రాంగ్ రూట్ లో వాహనం నడపకూడదని తెలిపారు. తనిఖీలలో మద్యం సేవించి వాహనం నడుపుతూ దొరికినట్లైతే సంబంధిత వాహనదారుడి లైసెన్స్ సస్పెండ్ చేయడం జరుగుతుందని, 18 సంవత్సరాల వయసు నిండని వారు వాహనాలు నడపకూడదని, ఒకవేళ నడిపినట్లయితే వారి తల్లితండ్రులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అతివేగం చాలా ప్రమాదమని, వేగం పరిమితిలో ఉండి నిబంధనలు పాటించినట్లయితే గమ్యస్థానానికి సురక్షితంగా చేరుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.






# మాతా శిశు సంరక్షణ, గర్భవతులకు అన్ని రకాల సేవలను అందించాలి : జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వికారాబాద్, ఏప్రిల్ 18 : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మాతా శిశు సంరక్షణ, గర్భవతులకు అన్ని రకాల సేవలను అందించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలపై వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... మాతా శిశు సంరక్షణ, గర్భవతులకు అన్ని రకాల సేవలను అందిస్తూ వాటి వివరాలు ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు చేయాలని, మాతృ మరణాలు జరగకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. జిల్లా పరిధిలో అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్ నిర్వహణ 62 శాతం మాత్రమే ఉందని దీనిని 100 శాతం సాధించే విధంగా వైద్యులు కృషి చేయాలని సూచించారు.

టి.బి వ్యాధిగ్రస్తుల స్క్రీనింగ్ పరీక్షలు మరియు నిర్ధారణ అయిన వారందరికీ చికిత్స అందిస్తూ వారి వివరాలు ఎప్పటికప్పుడు నిశ్చయ్ ఆన్లైన్ పోర్టల్ లో నమోదు చేయాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా పరిధిలో 14 నుంచి 15 సంవత్సరాల మధ్య వయసు ఉన్న అమ్మాయిలకు సర్వైకల్ క్యాన్సర్ రాకుండా నిరోధించడం కోసం ప్రత్యేక డ్రైవ్ ద్వారా హెచ్పివి వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నప్పటికీ నిర్దేశిత లక్ష్యం మేరకు వ్యాక్సినేషన్ కార్యక్రమం జరగకపోవడం వలన జిల్లా విద్యాశాఖ అధికారి మరియు సాంఘిక సంక్షేమ శాఖ రీజినల్ కోఆర్డినేటర్లతో సమన్వయం చేసుకొని వ్యాక్సినేషన్ కార్యక్రమం విజయవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. శిశు మరణాల నియంత్రణకు ప్రత్యేకంగా నిర్వహిస్తున్న సంకల్ప్ కార్యక్రమ అమలుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, ఆసుపత్రుల సూపరిండెంట్లు మరియు డిసి హెచ్ఎస్ సమన్వయ సమావేశం నిర్వహించుకోవాలని ఆయన తెలిపారు. జిల్లాలోని 23 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కూడా జాతీయ నాణ్యతా ప్రమాణాల నిబంధనలు తప్పకుండా పాటించాలని అందుకు అవసరమైన మౌలిక వసతుల కల్పన కోసం అవసరమైతే అంచనాలు రూపొందించినట్లయితే నిధులు మంజూరు చేస్తామని ఆయన తెలిపారు. ఇకనుండి జిల్లా పరిధిలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుండి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రతి వారం ప్రగతి నివేదికలు తీసుకొని సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి.స్వర్ణ కుమారి జిల్లా పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అందజేస్తున్న వివిధ రకాల సేవలను, సాధించిన ప్రగతి లక్ష్యాలను జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ సుధీర్ , ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ రాజ్యలక్ష్మి, కొడంగల్ ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ మాలతి, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ పవిత్ర, డాక్టర్ వరలక్ష్మి, డాక్టర్ పద్మ, డిప్యూటీ డిఎంహెచ్ఓ లు డాక్టర్ రవీంద్ర యాదవ్, డాక్టర్ జ్యోతి, వైద్యులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఆత్మగౌరవ ప్రయాణంలో పుష్కరకాల ప్రస్థానం

**(4వ పేజీ తరువాయి...)** నిర్వహణకు ఆటంకాలు ఎదుర య్యాయి. మేధావి వర్గం ప్రభుత్వ తప్పిదాలను ఎత్తిచూపడంలో కొంత జాప్యం చేసినా, నిరుద్యోగ సమస్యలు మరియు భూసేకరణ వంటి అంశాలపై పోరాటాలను కొనసాగిస్తూనే ఉంది. కుల మరియు వృత్తి సంఘాలు ప్రభుత్వం అందించిన రాయితీలు మరియు సంక్షేమ పథకాలకు ప్రాధాన్యతనిచ్చి, తమ వర్గాల దీర్ఘకాలిక సమస్యలైన విద్య, వైద్యం మరియు భూమి వంటి అంశాలపై ఒత్తిడి తీసుకురావడంలో కొంత వెనుకబడ్డాయి. వీరు రాజకీయ పార్టీలకు కేవలం 'ఓటు బ్యాంకులు'గా మారారనే విమర్శ వినిపిస్తోంది.

ప్రవాస తెలంగాణ సంస్థలు ఉద్యమ సమయం నుంచి నేటి వరకు ఆర్థికంగా, సేవా కార్యక్రమాల పరంగా అండగా నిలుస్తున్నప్పటికీ, రాష్ట్రంలో పెరుగుతున్న రాజకీయ కేంద్రీకరణను ప్రశ్నించడంలో కొంత మౌనం వహించాయి. మొత్తం మీద ఈ 12 ఏళ్ల ప్రస్థానాన్ని విశ్లేషిస్తే, తొలి పదేళ్లలో అధికార కేంద్రీకరణ పెరిగినప్పుడు పౌర సమాజం మరియు టీజేఏసీ వంటి ఉమ్మడి వేదికలు కొంత బలహీనపడి 'రక్షణాత్మక ధోరణి'లోకి వెళ్లాయి. అయితే, గత రెండేళ్లుగా నిరుద్యోగ పోరాటాలు, పేపర్ లీకేజీలు మరియు ధరణి సమస్యల నేపథ్యంలో పౌర సమాజం మళ్లీ చైతన్యవంతమై ప్రభుత్వాలను మార్చడంలో కీలక పాత్ర పోషించింది. తెలంగాణ పౌర సమాజం రాష్ట్ర సాధనలో చూపిన వీరోచిత పాత్రను, రాష్ట్రం వచ్చాక ప్రభుత్వాల పర్యవేక్షణలో నిలకడగా ప్రదర్శించలేకపోయింది. అయినప్పటికీ, ఆర్టీసీ సమ్మె మరియు నిరుద్యోగ మార్చ్ వంటి సంఘటనలు ప్రజాస్వామ్యంలో ఏ ప్రభుత్వం తప్పు చేసినా ప్రశ్నించే శక్తి ప్రజలకు ఉంటుందని నిరూపించాయి. కేవలం పథకాలను పొందడమే కాకుండా, పరిపాలనలో క్రియాశీల భాగస్వామ్యం కోరడమే నిజమైన ప్రజాస్వామ్య తెలంగాణ అని ఈ శక్తులు ఆలశ్యంగానైనా ఇప్పుడిప్పుడే గుర్తిస్తుండటం ఒక సానుకూల పరిణామం. తెలంగాణ

### అస్తిత్వ వేదిక - ఆవశ్యకత:

రాష్ట్రంలోని రాజకీయ వాతావరణంలో ప్రతిపక్షాలు కేవలం అధికార మార్పిడికే ప్రాధాన్యతనిస్తున్న తరుణంలో, ఏ పార్టీ అధికారంలో ఉన్నా వారిని నిలదీయగల నిష్పాక్షికమైన 'ప్రజాస్వామ్య వాచ్డాగ్' అవసరం ఎంతైనా ఉంది. తెలంగాణ మౌలిక ఆకాంక్షలైన నీళ్లు, నిధులు మరియు నియామకాల అమలుపై మీడియా ప్రభావాలకు లోనుకాకుండా, గణాంకాలతో పాలకులపై ఒత్తిడి తెచ్చే ఒక బలమైన పౌర వర్గంగా ఈ వేదిక పనిచేయాల్సి ఉంది. కేవలం ఉత్సవాలకే పరిమితమవుతున్న తెలంగాణ అస్తిత్వ స్పృహను సజీవంగా ఉంచడం దీని ప్రధాన విధి. పాలనలో, విద్యలో తెలంగాణ భాషా సంస్కృతులకు దక్కాల్సిన గౌరవంపై నిరంతర పర్యవేక్షణ చేస్తూనే, రాష్ట్ర పోరాట చరిత్రను వక్రీకరణలు లేకుండా భావి తరాలకు అందించడంలో ఇది కీలక పాత్ర పోషించగలదనే విశ్వాసాన్ని తెలంగాణ పౌరసమాజంలో కలిగించాలి. భౌగోళిక తెలంగాణ సాకారమైనప్పటికీ, అణగారిన వర్గాలకు ఆత్మగౌరవం మరియు ఆర్థిక భరోసా కల్పించే 'సామాజిక తెలంగాణ' లక్ష్యం ఇంకా అసంపూర్తిగానే మిగిలిపోయింది. సబ్బండ వర్గాల సమస్యలు కేవలం ఎన్నికల హామీలుగా మిగిలిపోకుండా, వారి అభివృద్ధిని ఒక హక్కుగా మార్చడానికి మేధావుల మరియు ఉద్యమకారుల గొంతుక ఒకటి కావాల్సిన అవసరం ఉంది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత వివిధ రాజకీయ పార్టీల్లోకి వెళ్లడం వల్ల లేదా నిశ్శబ్దంగా ఉండటం వల్ల చెల్లాచెదురైన నిస్వార్థ ఉద్యమకారులను ఈ వేదిక ద్వారా మరోమారు సమీకరించి ఒక బహుళశక్తివంతమైన సాధనంగా పౌరసమాజాన్ని మార్చవలసిఉన్నది. ఇలాంటి ఏకీకరణ పాలకులలో ఒక రకమైన నైతిక భయాన్ని కలిగిస్తూ, రాష్ట్ర పునర్నిర్మాణానికి ఒక దిక్సూచిలా మారుతుంది. ప్రభుత్వ విధాన రూపకల్పనలో పౌర సమాజ భాగస్వామ్యం అత్యంత కీలకం. భూసేకరణ, ప్రాజెక్టుల వ్యయం, విద్యా మరియు వైద్య విధానాలు కేవలం బ్యూరోక్రాటిక్ కోణంలో కాకుండా ప్రజా కోణంలో ఉండేలా పర్యవేక్షించగలిగే నైతికవిలువలు కలిగిన పౌరసంస్థ ఆవశ్యకత ఇవ్వాల్టి పరిస్థితుల నేపథ్యంలో మరింత ఎక్కువగా కనిపిస్తున్నది. రాజ్యాంగ నిర్దేశాలను లేదా సామాజిక న్యాయాన్ని పాలకులు విస్మరించినప్పుడు, వాస్తవాలను ప్రజల ముందు ఉంచే మేధో సంపత్తిని ఈ సమాజానికి నిజాయితీగా అందించగలిగే పౌరవ్యవస్థ వర్తమాన మరియు భవిష్యత్తు తెలంగాణకు అవసరం ఉన్నది. అన్నింటికంటే ముఖ్యంగా, గత పుష్కర కాలంలో నెలకొన్న 'నిశ్శబ్ద పౌరసమాజం' స్థానంలో, రాజ్యాంగం కల్పించిన నిరసన హక్కును మరియు ప్రశ్నించే తత్వాన్ని తిరిగి పల్లె పల్లెకూ తీసుకుపోగలిగే నిస్వార్థపూరితమైన భావవ్యాప్తి సంస్థ ఇవ్వాల్టి అనివార్యతగా కనిపిస్తున్నది. రాజకీయ పార్టీల మధ్య కొనసాగుతున్న అధికార పోటీ ప్రజల అసలు సమస్యలను పక్కదారి పట్టిస్తున్న తరుణంలో, వలసాధిపత్యశక్తులు కొత్తకొత్తరూపాలలో మరోమారు తెలంగాణ సార్వభౌమాధికారంమీద, ఇక్కడి ప్రజల ఆత్మగౌరవంమీద, ఈ ప్రాంతానికి మాత్రమే ప్రత్యేకమైన అన్నిరకాల అస్తిత్వాలపైన ఆధిపత్యదాడికి సమాయాత్తమవుతున్న అంతర్గత మరియు బాహ్యశక్తులను నిలువరించే అనివార్యతవైపు తెలంగాణ పౌరసమాజాన్ని సమాయాత్తం చేయడంలో 'తెలంగాణ అస్తిత్వ వేదిక' ఆవిర్భావం ఒక ఆశాకిరణం. ఇది కేవలం ఒక పౌరసంస్థగా మాత్రమే కాకుండా, తెలంగాణ ఆత్మగౌరవాన్ని మరియు ప్రజాస్వామ్య విలువలను కాపాడే ఒక చైతన్యవంతమైన ప్రజా వేదికగా నిలబడాల్సిన ఆవశ్యకత వర్తమాన తెలంగాణ పరిస్థితుల్లోనూ, భవిష్యత్తు పురోగమనంలోనూ అనివార్యంగా కనిపిస్తున్నది.



# చెత్తరహిత నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

## - రామగుండం మేయర్ మహంకాళి స్వామి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్ సిటి (గోదావరిఖని), ఏప్రిల్ 18 : రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ సూచనల మేరకు రామగుండం నగర పునర్నిర్మాణంలో భాగంగా చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నామని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. శనివారం 41 వ డివిజన్ ఎల్ బి నగర్ లో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య , స్థానిక కార్పొరేటర్ మార్కాపురి సూర్య తో కలిసి పర్యటించారు. ఈ సంధర్భంగా డివిజన్ లోని ప్రదాన మురుగునీటి కాలువతో పాటు ఇతర కాలువల్లో కూడా పూడిక తీయించి నీళ్ళు సాఫీగా ప్రవహించేలా ఏర్పాట్లు చేశారు. కాలువలో ప్రవహానికి ఆటంకం కలిగిస్తూ పెరిగిన పిచ్చి చెట్లను , కొమ్మలను తొలగించడంలో మేయర్ తో పాటు పలువురు కార్పొరేటర్లు కూడా పాలు పంచుకున్నారు. బ్లేడ్ మిషన్ సహాయంతో చెట్ల కొమ్మలను నరకడంలో సహకరించారు. కాలువలో చెత్త వేయకుండా మునిసిపల్ సిబ్బందికి ఇవ్వాలని స్థానికులకు తాను స్వయంగా చెప్పడంతో పాటు ఇంటింటా తిరుగుతూ అవగాహన కల్పించాలని మెప్మా ఆర్ పి లను మేయర్ ఆదేశించారు. ఇల్లు , శరీరం ఎంత శుభ్రంగా ఉంచుకుంటామో తమ వీధిని కూడా అంతే శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. చెత్త బయట పడవేసే వారికి జరిమానాతో పాటు మునిసిపల్ సేవలను కూడా నిలిపివేస్తామని హెచ్చరించారు . ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు , నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి , ఎస్ ఇ గురువీర , ఇ ఇ . పి వి. రామన్ , డి ఇ .ఇ లు జగదీష్ , అఫ్తాబ్ , ఎ ఇ మనోజ్ , టి పి ఎస్ నవీన్ , టి పి బి ఓ కళ్యాణ్ , ఎలెక్ట్రికల్ ఎ ఇ రాంజీ , సానిటరీ ఇన్స్ పెక్టర్ సంపత్ తదితరులు పాల్గొన్నారు.



# రక్తదానం... ప్రాణదానంతో సమానం

## మున్సిపల్ చైర్మన్ చింతనిప్పల చంద్రకళ బిక్షపతి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు, ఏప్రిల్ 18 : రక్తదానం ప్రాణదానంతో సమానం అని ములుగు మున్సిపల్ చైర్మన్ చింత నిప్పుల చంద్రకళ బిక్షపతి అన్నారు. శనివారం ములుగు జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్లో రెడ్ క్రాస్ బ్లడ్ సొసైటీ టీఎన్జీవో యూనియన్స్ సంయుక్త ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చెయ్యడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ములుగు మున్సిపల్ చైర్మన్ చింతనిప్పుల చంద్రకళ బిక్షపతి,హాజరై మాట్లాడుతూ రక్తదానం అనేది మహత్తరమైన సేవ అని,ఒకరి రక్తదానం మరొకరి ప్రాణాన్ని కాపాడగలదని తెలిపారు. సమాజంలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకు రావాలని,యువత ఇందులో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఇటువంటి శిబిరాలు మానవతా విలువలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, ములుగు మాజీ జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు రియాజ్మీర్జా,మున్సిపల్ కౌన్సిలర్లు,ఆస్పత్రి సిబ్బంది,రెడ్ క్రాస్ సొసైటీ వారు,అధికారులు యువత తదితరులు పాల్గొన్నారు.



# చలివేంద్రాలను ప్రారంబించిన మున్సిపల్ చైర్మన్

## గుగులోత్ జ్యోతి రమేష్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 18 : వేసవి కాలం దృష్ట్యా ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో మహబూబాబాద్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో శనివారం పట్టణం లోని కూరగాయల మార్కెట్ (గాంధీ పార్కు) వద్ద, ఫారెస్ట్ ఆఫీస్, వివేకానంద సెంటర్ వద్ద చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ గుగులోత్ జ్యోతి రమేష్ వచ్చి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ సూర్నపు సోమయ్య,డి. ఈ. ఈ ఉపేందర్, స్థానిక కౌన్సిలర్లు అజయ్ సారథి, బోడ రవి కుమార్, చిట్యాల జనార్దన్, కాట భాస్కర్, నిమ్మల మాధవి శ్రీనివాస్, బొల్లు రాజు,అంబాల శివ కుమార్, కందుకూరి సుధామోహన్,సల్వాది దిలీప్,ఏఈ కుమార్,ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ క్రాంతి కూరగాయల మార్కెట్ వ్యాపారులు మరియు ప్రజలు పాల్గొన్నారు



## 20న విద్యాపీఠంలో ఆద్య శిలామహోత్సవం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సంగారెడ్డి ఏప్రిల్ 18 : సంగారెడ్డి ఫసల్వాదిలోని శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో ఈ నెల 20న ఆద్య శిల స్థాపనోత్సవ మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ డాక్టర్ శ్రీమహేశ్వర శర్మ సిద్ధాంతి తెలిపారు. అష్టోత్తర శతావర్తన హనుమాన్ చాలీసా పారాయణ పురస్సర ఆద్య శిల స్థాపనోత్సవ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఉదయం 8 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందని చెప్పారు. 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. సాయంత్రం ఐదు గంటలకు భక్తులచే శిలలపై బీజాక్షరాలు రాయించే కార్యక్రమం జరుగుతుందని కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయ వంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విద్యాపీఠం సభ్యులు తోపాజి అనంత కిషన్, నీలం మధు, ప్రశాంత్ కుమార్, సెంథిల్ పాల్గొన్నారు.



# నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే లక్ష్యంతో పని చేస్తున్నాం

## - రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్ సిటీ (గోదావరిఖని), ఏప్రిల్ 18 : గోదావరిఖని ఎల్‌బీ నగర్ లో ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న నర్సింగ్ కాలేజీ పనులను రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ శనివారం ప్రత్యక్షంగా పరిశీలించారు. నిర్మాణ పనుల నాణ్యత, వేగం, అవసరమైన సదుపాయాలపై అధికారులతో సమీక్ష నిర్వహించి, పనులు సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. పరుశురాం నగర్ వరకు నూతన రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ రహదారి నిర్మాణంతో స్థానిక ప్రజలకు రవాణా సౌకర్యం మరింత మెరుగు పడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ విద్యా, మౌలిక వసతుల అభివృద్ధి దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమం లో స్థానిక కార్పోరేటర్లు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



గోదావరిఖని టౌన్, ఏప్రిల్ 18 : సింగరేణి ఆర్జి-2 డివిజన్ పరిధి యైటింక్లైన్ కాలనీలోని సిఈఆర్ క్లబ్ లో ఈ నెల 20న సోమవారం ఉదయం పది గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించబడు తుందని అధికార ప్రతినిధి (ఏజీఎం పర్సనల్) అరవింద్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. భారతీయ సాంప్రదాయ వైద్యమైన ఆయుర్వేదం వ్యాధి లక్షణాలు మాత్రమే కాకుండా రోగ మూలాలను తొలగించి రోగనిరోధక శక్తిని పెంచి దీర్ఘ కాలిక ఆరోగ్యానికి తోడ్పడుతుందని పేర్కొన్నారు. ఈ నెల 20న ఆయుర్వేద వైద్యులు విశ్వనాథ మహర్షిచే వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, దీర్ఘకాలిక వ్యాధులు బిపి, షుగర్, కీళ్ల నొప్పులు, నడుము నొప్పులు, అస్తమా, చర్మవ్యాధులు మొదలైన వాటికి పరీక్షలు చేసి మందులు ఇవ్వడం జరుగుతుందని, అరుదైన ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

# మహిళ రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించడం దురదృష్టకరం

## - బిజెపి నాయకులు మామిడిపెల్లి ప్రసాద్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ధర్మపురి, ఏప్రిల్ 18 : పార్లమెంట్ లో మహిళా రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్ పార్టీ, దాని మిత్రపక్షాలు వ్యతిరేకించడం దురదృష్టకరమని బిజెపి ఎండపల్లి మండల నాయకులు మామిడి పెల్లి ప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ దూరదృష్టితో మహిళలకు 33% రిజర్వేషన్ కల్పించి 50% సీట్లు పెంచి చట్టసభల్లో మహిళలకు సముచిత స్థానం కల్పించాలని రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్లో ప్రవేశ పెడితే కాంగ్రెస్,దాని మిత్రపక్షాలు తమ వక్రబుద్ధిని ప్రదర్శించి మహిళలపై వారి చిత్తశుద్ధిని బయటపెట్టాయన్నారు. మహిళా సాధికారత గురించి కాంగ్రెస్ నాయకులు వేదికలపై ఊకదంపుడు ఉపన్యాసాలు ఇవ్వడం తప్ప, మహిళా సాధికారతపై వారికి చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్,దాని మిత్రపక్షాలకు మహిళా లోకం చేతుల్లో సరైన గుణపాఠం తప్పదని ప్రసాద్ హెచ్చరించారు.

# మహాధర్నాకు తరలివెళ్లిన కాంగ్రెస్ యువజన నాయకులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



లక్షెట్టిపేట, ఏప్రిల్ 18 : హైదరాబాద్ ధర్నా చౌక్ వద్ద శనివారం ఇండో-అమెరిక ట్రేడ్ డీల్ కు వ్యతిరేకంగా భారీ నిరసన కార్యక్రమన్ని చేపట్టిన యువజన కాంగ్రెస్ నాయకులు. ఈ సందర్భంగా లక్షెట్టిపేట మున్సిపాలిటీ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రాందేని చిన్న వెంకటేష్ మాట్లాడుతు కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద ధర్నా కు లక్షెట్టిపేట మండల కాంగ్రెస్ యువజన నాయకులు తరలి వెళ్లడం జరుగుతుందని. దేశ ప్రయోజనాలను అమెరికా చేతిలో తాకట్టుపెట్టి, భారత దేశ ప్రజలకు ప్రత్యేకించి రైతులకు అన్యాయం చేస్తూ,అదానికి మేలు చేసే ఇండో-యుఎస్ ట్రేడ్ డీల్ కు వ్యతిరేకంగా మహాధర్నా కార్యక్రమన్ని చేపట్టారని తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల కాంగ్రెస్ యువజన అధ్యక్షులు బొప్పు సుమన్, జిల్లా అసెంబ్లీ ఉపాధ్యక్షులు, జనరల్ సెక్రటరీ మల్యాల శివ, భైరం వెంకటేష్, యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కూకట్ల మహేష్, ఉపాధ్యక్షులు మాడిశెట్టి శ్రీకర్,సెక్రటరీ దొంత కార్తీక్ పాల్గొన్నారు.

# పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ

## రుద్రంపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ చొరవ


(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 18 :పాలిసెట్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల కోసం రుద్రంపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రధానాచార్యులు బండి శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మే 13న పాలిసెట్ ప్రవేశ పరీక్ష జరగనున్న నేపథ్యంలో విద్యార్థులు సమగ్రంగా సిద్ధం కావడానికి ఈ శిక్షణ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని సూచించారు. ఈ శిక్షణా తరగతులు ప్రతిరోజూ ఉద యం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు నిర్వహించబడతాయని తెలిపారు. పూర్తి వివరాల కోసం 7989103692 నంబర్‌ను సంప్రదించవచ్చని సూచించారు.

# సత్తుపల్లిలో ఎమ్మెల్యే రాగామయి పర్యటన

## - చలివేంద్రాల ప్రారంభం, మహిళలకు కోళ్ల పంపిణీ.

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



సత్తుపల్లి, ఏప్రిల్ 18 : ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే డా. మట్టా రాగామయి దయానంద్ శనివారం విస్తృతంగా పర్యటిస్తూ చలివేంద్రాలను ప్రారంభించడంతో పాటు ఇందిరా మహిళా శక్తి పథకం కింద స్వయం సహాయక సంఘాల మహిళలకు పెరటి కోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్తుపల్లి పట్టణంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో పాత సెంటర్, బస్ స్టాండ్ రింగ్ సెంటర్, ప్రభుత్వ ఆసుపత్రి ముందు ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ఆమె ప్రారంభించారు. అనంతరం పెనుబల్లి మండలం అడివి మల్లెల గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద మదర్ యూనిట్ ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలకు పెరటి కోళ్లను పంపిణీ చేశారు. కోళ్లు పొందిన డ్వాక్రా గ్రూపులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలను ఆర్థికంగా బలపడేలా, కోటీశ్వరులను చేసే లక్ష్యంతో ఇందిరా మహిళా శక్తి ద్వారా డ్వాక్రా మహిళలకు అన్ని విధాలుగా సహకరిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల ద్వారా గ్రామీణ మహిళలకు ఆదాయ వనరులు పెరుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసింహ, మున్సిపల్ చైర్మన్ రిహన బేగం కమల్ పాషా, వైస్ చైర్మన్ బొంతు సుమలత, ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గాదె చెన్నారావు, సీనియర్ నాయకులు, కౌన్సిలర్లు, మహిళా, యూత్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. లాగే పెనుబల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పంది వెంకటేశ్వర రావు, ఏపీఎం, డీపీఎం అధికారులు, గ్రామస్తులు, డ్వాక్రా సభ్యులు, మహిళలు తదితరులు హాజరయ్యారు.

# మంగ్లీపై ఆరోపణల్ని ఖండిస్తున్నాం

## - ప్రధాన నిందితుల్ని విచారించి బాధితులకు న్యాయం చేయాలి

## - బంజారా అడ్వకేట్స్ అసోసియేషన్ నాయకులు భూక్యా హరినాయక్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, ఏప్రిల్ 18 : బంజారా బిడ్డ, ప్రముఖ గాయని మంగ్లీపై కొందరు కావాలనే అవాస్తవ ఆరోపణలు చేస్తున్నారని, వాటిని తీవ్రంగా ఖండిస్తున్నామని బంజారా అడ్వకేట్స్ అసోసియేషన్ నాయకులు, న్యాయవాది భూక్యా హరినాయక్ తెలిపారు. ఖమ్మంలోని ప్రెస్ క్లబ్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మంగ్లీపై చేస్తున్న ఆరోపణలు నిరాధారమని అన్నారు. ఏదైనా తప్పు జరిగితే పోలీసులకు ఫిర్యాదు చేసి, సాక్ష్యాలు సమర్పించాల్సిందిగా సూచించారు. కోర్టు ద్వారానే న్యాయం జరుగుతుందని, మీడియా సమావేశాల ద్వారా ఆరోపణలు చేయడం రాజ్యాంగ విరుద్ధమని వ్యాఖ్యానించారు. మంగ్లీ భవిష్యత్తును దెబ్బతీయాలనే ఉద్దేశంతోనే ఈ ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రధాన నిందితులను విచారించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కంపెనీలో మంగ్లీ పాత్ర ఏమిటో స్పష్టత లేకుండా ఆమెపై ఆరోపణలు చేయడం తగదని పేర్కొన్నారు. అదేవిధంగా, వ్యక్తిగత దూషణలు



చేయడం సరైంది కాదని, న్యాయవాద వృత్తికి భంగం కలిగించేలా ప్రవర్తించవద్దని సూచించారు. సాక్ష్యాలు ఉంటే పోలీసులకు అప్పగిస్తే వారు విచారణ జరిపి నిజానిజాలు వెలికితీస్తారని అన్నారు. ధరావత్ వీరన్న మాట్లాడుతూ, మంగ్లీ ప్రతిష్టను దెబ్బతీయడానికి కొందరు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. న్యాయవాది బాణోత్ మణిమాల మాట్లాడుతూ, మంగ్లీపై ఆరోపణలు బంజారా జాతికి అవమానకరమని అన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా సోషల్ మీడియాలో ప్రచారం చేయవద్దని హితవు పలికారు. ఈ సమావేశంలో న్యాయవాదులు తేజావత్ నర్సింహ, ధరావత్ ప్రసాద్, సునావత్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తి చేయాలి: పాల్వంచ ఎంపీడీవో ఆదేశం




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, ఏప్రిల్ 18 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలోని గ్రామపంచాయతీలలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసి గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) బొగ్గ నారాయణ అధికారులకు ఆదేశించారు. శనివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మండలంలోని 36 గ్రామపంచాయతీలలో ఇందిరమ్మ ఇళ్ల మొదటి విడతలో మంజూరైన 737 మంది లబ్ధిదారుల గృహాలు నిర్ణీత గడువులో పూర్తి కావాలన్నారు. గ్రామస్థాయి అధికారులతో పాటు సర్పంచులు సమన్వయంతో పనిచేసి, లబ్ధిదారులతో నిరంతరం సంప్రదిస్తూ గృహప్రవేశాల తేదీలకు అనుగుణంగా పనులు పూర్తి చేయాలని సూచించారు. అలాగే, స్వయం సహాయక సంఘాల ఫెడరేషన్ భవనాల నిర్మాణ పనులను కూడా వేగవంతం చేసి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో హౌసింగ్ ఏఈఈలు రమేష్, పుష్పలత, మీరాభి, ఏపీఎం శ్రీనివాసరావు, పీఆర్ ఏఈఈ చెన్నకేశవరావు, ఎంపీవో, సర్పంచులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ చట్టాన్ని బలోపేతం చేయాలి

## - పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

## -వీబీ-జీ రాంజీ చట్టం రద్దు చేయాలంటూ డిమాండ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, ఏప్రిల్ 18 : భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం నారాయణరావుపేట గ్రామపంచాయతీలో శనివారం ఉపాధి కార్మికులను వారి పని ప్రదేశంలో కలిసి తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీసంశెట్టి పూర్ణచంద్రరావు వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలు, మధ్యతరగతి ప్రజలు ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరిచే చర్యలు జరుగుతున్నాయని ఆరోపించారు. పథకం పేరును మార్చి, అందులో ఉన్న సౌకర్యాలను తగ్గించడం ద్వారా కూలీలకు నష్టం కలిగిస్తున్నారని విమర్శించారు. ఉపాధి కార్మికులకు పని ప్రదేశాల్లో టెంట్లు, తాగునీరు, మెడికల్ కిట్లు వంటి కనీస సౌకర్యాలు కల్పించకపోవడం దుర్మార్గమని అన్నారు. నెలల తరబడి వేతనాలు చెల్లించకపోవడం కూడా తీవ్ర సమస్యగా మారిందన్నారు. కూలీలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే



చెల్లించాలని, పని ప్రదేశాల్లో అవసరమైన సౌకర్యాలను తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు ప్రతి ఉపాధి కార్మికునికి కూలి భరోసా కింద సంవత్సరానికి రూ.12 వేల చొప్పున రెండు సంవత్సరాలకు రూ.24 వేల ఆర్థిక సహాయం వెంటనే అందించాలని కోరారు. పని చేసే కార్మికులకు అవసరమైన గడ్డపారలు, బొచ్చెలు వంటి పరికరాలను ఉచితంగా అందించాలని సూచించారు. ఉపాధి కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు నిమ్మల రాంబాబు, నారాయణరావుపేట సర్పంచ్ బండ సరస్వతి, ప్రజా సంఘాల నాయకులు మేక రాంబాబు, గుర్రం నాగయ్య, గంగుల సత్యనారాయణ రెడ్డి, చింతా ప్రశాంత్, పొదిలి వెంకటేశ్వర్లు, పొదిలి భద్రయ్య, గుర్రం నాగలక్ష్మి, చాగల జోగమ్మ, పొదిలి కరుణ, తమ్మళ్ళ సాయమ్మ, మేక సుశీల తదితరులు పాల్గొన్నారు.

# నారి శక్తి బిల్లును తిరస్కరించడం సమంజసం కాదు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, ఏప్రిల్ 18 : మహిళా సాధికారతనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నారిశక్తి బిల్లును ప్రతిపక్షాలు తిరస్కరించడం సమంజసం కాదని బిజెపి నాయకులు అన్నారు. భారతీయ జనతా పార్టీ ఆదేశాల మేరకు ఖానాపూర్‌లో శనివారం తెలంగాణ తల్లి చౌరస్తాలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో వారు మాట్లాడారు. నారిశక్తి బిల్లును ప్రతిపక్ష పార్టీలు తిరస్కరించడం చూస్తుంటే, ఆ పార్టీలకు మహిళలంటే ఎంత గౌరవం ఉందో అర్థమవుతుంది అన్నారు. నారి శక్తి బిల్లును తిరస్కరించిన పార్టీలను ఎన్నికలలో తిరస్కరించి, డిపాజిట్ గల్లంతు చేయాలని మహిళా



లోకానికి పిలుపునిచ్చినారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మౌనిక, కౌన్సిలర్లు గుమ్మల ఆనంద్, సత్యవతి, సింధుజ, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆకుల శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి నల్ల రవీందర్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ అంకం మహేందర్, మండల అధ్యక్షులు పుప్పాల ఉపేందర్, మండల ప్రధాన కార్యదర్శి కొండవేని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి క్వాలిటీ కంట్రోల్ విభాగం నూతన కమిటీ ఎన్నిక

## - ఫిట్ సెక్రటరీగా దార పోచయ్య

## - ఏఐటియుసి యూనియన్‌లో చేరిన శాంపిల్ మజ్దూర్ కార్మికులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)


జయశంకర్-భూపాలపల్లి, ఏప్రిల్ 18:సింగరేణి భూపాలపల్లి ఏరియా క్వాలిటీ కంట్రోల్ విభాగం నూతన కమిటిని ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రటరీ కొరిమి రాజ్ కుమార్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ ఫిట్ సెక్రటరీగా ధారపోషం, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీగా కె.కార్తీక్ ను ఎన్నుకున్నారు. అనంతరం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కొమురయ్య భవన్‌లో క్వాలిటీ విభాగంలో పనిచేస్తున్న శాంపిల్ మజ్దూర్ కార్మికులను ఏఐటియుసి యూనియన్‌లోకి కోరిమి రాజ్ కుమార్ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అలాగే



షిఫ్ట్ ఇన్‌చార్జిలుగా ఇ. శ్రీనివాస్, ఎస్.మధు, జి.శ్రీనివాస్, ఎం.రవికృష్ణ, ఎ.కుమార్ ఎన్నికయ్యారు. ఈ పిట్ కమిటీ సమావేశంలో బ్రాంచ్ సెక్రటరీ మోటపలుకుల రమేష్, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీలు జి.సుధాకర్ రెడ్డి, జి.శ్రీనివాస్, ఎండి ఆసిఫ్ పాషా, ఏరియా వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామచందర్, కాంట్రాక్ట్ వర్కర్స్ ఇన్‌చార్జ్ నూకల చంద్రమౌళి , జి.తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జయశంకర్-భూపాలపల్లి, ఏప్రిల్ 18 : సింగరేణి సంస్థ భూపాలపల్లి ఏరియా ఆధ్వర్యంలో ఈనెల 21న ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఏరియా అధికార ప్రతినిధి, పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్ తెలిపారు. స్థానిక కృష్ణ కాలనీలోని సి.ఈ.ఆర్ క్లబ్‌లో ఈ శిబిరం ఏర్పాటు చేయనున్నారు. డా.విశ్వనాథ మహర్షి, ఆయుర్వేద నిపుణుల ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం కొనసాగు తుంది. చర్మవ్యాధులు, మోకాళ్ల నొప్పులు, గుండె దడ, బీపీ, షుగర్, థైరాయిడ్, మలబద్ధకం, అజీర్ణం, పక్షవాతం, అస్తమా, మహిళలకు సంబంధించిన వ్యాధులకు ఉచితంగా వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఈ శిబిరానికి సంబంధించి మరిన్ని వివరాల కోసం డా.విశ్వనాథ మహర్షి (సెల్: 9849574706)ను సంప్రదించవచ్చని సూచించారు.

# బీజేపీ ఆధ్వర్యంలో జలగం పుట్టినరోజు వేడుకలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 18 : భద్రాద్రి జిల్లా కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే,బీజేపీ రాష్ట్ర కమిటీ ప్రత్యేక ఆహ్వానితులు జలగం వెంకటరావు పుట్టినరోజు వేడుకలు శనివారం కొత్తగూడెంలో నిర్వహించారు. తరతరాలు మారిన చెరగని అభిమానంతో జలగం అభిమానులు, ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కొత్తగూడెంలోని స్నేహలత-సంధ్యలత అనాధ శరణాలయంలో కేక్ కట్ చేసి, సేవా కార్యక్రమంతో జలగం పుట్టినరోజు వేడుకలను భారతీయ జనతా పార్టీ జిల్లా నాయకులు ఆకుల నాగేశ్వరరావు గౌడ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కొత్తగూడెం పట్టణ మాజీ అధ్యక్షుడు గొడుగు శ్రీధర్, బిజెపి జిల్లా నాయకులు సువర్ణకంటి మోహన్ రావు గౌడ్, సుజాతనగర్ మండల ప్రధాన కార్యదర్శి కూరపాటి రామారావు, ఉప్పునపల్లి వినీల్ కుమార్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.




# కృష్ణవేణి విద్యాసంస్థలకు జాతీయ స్థాయి అవార్డు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, ఏప్రిల్ 18 : గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతానికి చెందిన కృష్ణవేణి విద్యాసంస్థలు జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మక ప్రథమ అవార్డును సాధించాయి. లీడ్ ఎక్సలెన్సీ ఇండియా సంస్థ నిర్వహించిన జాతీయ శిక్ష అవార్డుల్లో ఈ సంస్థ మొదటి స్థానాన్ని దక్కించుకుంది. విద్యార్థుల విద్యా ప్రమాణాలు, ఉపాధ్యాయుల బోధన నైపుణ్యాలపై నిర్వహించిన సమగ్ర సర్వే ఆధా రంగా ఈ అవార్డులు ప్రకటించగా, కృష్ణవేణి విద్యాసంస్థల ప్రతిభకు గుర్తింపుగా ఈ గౌరవం లభించింది. హైదరాబాద్‌లోని నోవోటెల్ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో సంస్థ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్ మంజులా శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపాళ్లు రామకృష్ణ, రాజిరెడ్డి, సత్యనారాయణ, శైలజ అవార్డును జాతీయ లీడ్ గ్రూప్ సీఈవో సుమిత్ మెహతా, సౌత్ జోన్ ఇంచార్జ్ శ్రీకాంత్ వర్మ చేతుల మీదుగా స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల ప్రతిభ, తల్లిదండ్రుల సహకారంతో ఈ విజయాన్ని సాధించామని, భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాల సాధనకు కృషి చేస్తామని తెలిపారు. ఈ అవార్డు రామగుండం ప్రాంతానికి గౌరవాన్ని తీసుకురావడమే కాకుండా, సంస్థ విద్యా ప్రమాణాలకు నిదర్శనంగా నిలిచింది.



# దివ్యాంగ విద్యార్థులకు భవిత కేంద్రము

## - ద్వారా సౌకర్యాలు కల్పిస్తాం

## - జిల్లా కలెక్టర్ హరిత

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, ఏప్రిల్ 18 : ఇతర విద్యార్థులు లాగే దివ్యాంగ విద్యార్థులను అన్ని రంగాలలో ప్రోత్సహించాలని కలెక్టర్ హరిత అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ గల భవిత కేంద్రంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.లలిత తో కలిసి దివ్యాంగ విద్యార్థులకు టీచింగ్, లర్నింగ్ మేటిరియల్ ను కలెక్టర్ పంపిణి చేశారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు ప్రభుత్వం తరపున పూర్తి స్థాయి సాకారాలు అందిస్తామని తెలిపారు. దివ్యాంగ విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహించకూడదని వారు కూడా ఇతర విద్యార్థుల లాగే చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తున్నారని తెలిపారు. ఇటి వల హైదరాబాద్ లోనిర్వహించిన ఆటల పోటిలలో జిల్లా క్రీడాకా రులు మంచి ప్రతిభ కనబర్చారన్నారు. ఐఈఆర్‌పిలు దివ్యాంగ విద్యార్థులకు అందిస్తున్న సేవలు అభినందనీ యమన్నారు. ఈ కార్యక్రమములో ఆసిఫాబాద్ మండల విద్యా శాఖ అధికారి సుబాష్, విలీన విద్యా కోఆర్డినేటర్ శాంతికుమార్, ఐఈఆర్‌పిలు, దివ్యాంగ విద్యార్థులు, తల్లి దండ్రులు, పాల్గొన్నారు.

# రోజురోజుకి దిగజారి పోతున్న రాష్ట్ర ప్రభుత్వం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆదిలాబాద్ ఏప్రిల్ 18 : గతంలో ఇచ్చిన హామీలన్నీ నిర్వహిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారు ఆయన ఇప్పటివరకు ఎలాంటి హామీ నెరవేరలేదంటూ ఆదిలాబాద్ జిల్లా లైవ్ అ ధ్యక్షుడు మహేందర్ జాదవ్ ఆరోపించారు. మహేందర్ జాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వం పి ఓ టి సర్వేలు, సాదా బైనామా సర్వేలు కూడా జరిపారు కానీ ఇప్పటివరకు గిరిజన ఆదివాసులకు పట్టలు ప్రభుత్వం ఇవ్వలేదు అని అంటున్న మహేందర్ జాదవ్ ఇప్పటివరకు అందని పట్టలు అతి త్వరలో పట్టలు అందించాలని తెలంగాణ ప్రభుత్వానికి మహేందర్ జాదవ్ డిమాండ్ చేశారు లేనిపక్షంలో ఆదివాసి గిరిజనుల తరుపున ఉద్యమానికి కూడా సిద్ధంగా ఉంటామని తెలిపారు.

# లవ్ జీహాద్ ని భారత దేశం నుండి తరిమి కొట్టాలి

## భద్రాద్రి కలెక్టరేట్ ఎదుట నిరసన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, ఏప్రిల్ 18 : భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా పాల్వంచలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్దళ్ ఆధ్వర్యంలో లవ్ జిహాద్ కి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తూ శనివారం ధర్నా నిర్వహించారు. భద్రాద్రి జిల్లా కలెక్టరేట్ వద్ద ఈ నిరసన తెలిపారు. ఇటీవల కాలంలో దేశవ్యాప్తంగా అనేక నగరాలలో (నాసిక్, హైదరాబాదు, బెంగుళూరు, ఢిల్లీ, లక్నో) లవ్ జిహాద్ కేసులు నమోదవుతూ ఉన్నాయి. అమాయక హిందూ అమ్మాయిల్ని కార్యాలయాలు, కాలేజీలలో ముస్లిం యువకులు పరిచయం చేసుకొని మాయమాటలు చెప్పి, అబద్ధాలు చెప్పి, మోసం చేసి పెళ్లి చేసుకుని వారి జీవితాలు నాశనం చేస్తూ లవ్ జిహాద్ కి పాల్పడుతున్నారనీ ఈ ధర్నా, నిరసన కార్యక్రమంలో ఆరోపించారు. ఇలాంటి సంఘటనల వల్ల లక్షలాదిమంది హిందూ అమ్మాయిలు వారి జీవితాలు ఆగం చేసుకోవడమే కాకుండా, కుటుంబాలతో సంబంధాలు కోల్పోతున్నారనీ ఆవేదన వ్యక్తం చేశారు.ఇదంతా ఉగ్రవాద మనస్తత్వం కలిగినటువంటి కొంతమంది జిహాదీ ముస్లింలు, ప్రణాళిక ప్రకారం హిందూ అమ్మాయిలని లక్ష్యంగా చేసుకొని వారిని ప్రలోభ పెట్టి, మోసం చేసి, మూడో పెళ్లి, నాలుగో పెళ్లి చేసుకుని వారి ఇంట్లో ఉన్నటువంటి కుటుంబ సభ్యులతో కూడా అత్యాచారం చేపిస్తూ,హిందూ అమ్మాయిల పట్ల అత్యంత వికృతంగా ప్రవర్తిస్తున్నటువంటి సంఘటనలు ఇటీవల కాలంలో దేశంలో అనేకం వెలుగు చూశాయని తెలిపారు. స్త్రీని అత్యంత పవిత్రంగా ఆరాధించే భారతదేశంలో ఇలాంటి సంఘటనలు జరగటం చాలా దురదృష్టకరమని, ఇలాంటి లవ్ జీహాద్ సంఘటనల వల్ల హిందూ సమాజం బలహీనపడటమే కాక దేశ భద్రతకు కూడా చాలా ప్రమాదకరం, కనుక వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని భారతదేశం నుండి లవ్ జిహాద్ మూకల్ని తరిమికొట్టాలని డిమాండ్ చేస్తూ విశ్వహిందూ పరిషత్, బజరంగ్దళ్ ఆధ్వర్యంలో భద్రాద్రి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ముఖ్య అథిదిగా పాల్గొన్న విశ్వహిందూ పరిషత్ మందిర అర్చక పురోహిత్, తెలంగాణ




ప్రాంత సహ ప్రముఖ్ వోరుగంటి సురేష్ కుమార్ భారత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బజరంగ్దళ్ భద్రాద్రి జిల్లా సంయోజక్ కూసన సాగర్ మాట్లాడుతూ లవ్ జీహాద్ పట్ల హిందూ అమ్మాయిలు చాలా జాగ్రత్తగా ఉండాలనీ, ముస్లిం అబ్బాయిల మోసపు మాటలు నమ్మవద్దనీ అన్నారు. అనంతరం భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మూ కు జిల్లా కలెక్టర్ ద్వారా మొమెరాండం పంపిస్తూ, కలెక్టర్ కార్యాలయం లోని పరిపాలన అధికారికి మెమొరాండం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ఖమ్మం విభాగ్ సంఘటన కార్యదర్శి గడిదేశి వెంకటేశ్వర్లు, విభాగ్ మాతృశక్తి సంయోజిక రేగడి విజయలక్ష్మి , విశ్వహిందూ పరిషత్ జిల్లా సంఘటన కార్యదర్శి గంగాధరి సీత , బజరంగ్దళ్ జిల్లా గోరక్ష ప్రముఖ్ దేవేందర్, జిల్లా ధర్మాచార్య సంపర్క్ ప్రముఖ్ వింజమూరు మురళి , జిల్లా సామాజిక సమరసత ప్రముఖ్ గొడ్ల రాజయ్య , పాల్వంచ ప్రఖండ ఉపాధ్యక్షులు చల్లా లింగన్న, పాల్వంచ ప్రఖండ కార్యదర్శి దాసరి మాధవరావు , పాల్వంచ ప్రఖండ సహ కార్యదర్శి వేములపల్లి ప్రవీణ్ , పాల్వంచ ప్రఖండ మాతశక్తి సంయోజిక మంద వెంకటరమణ , కొత్తగూడెం ప్రఖండ కార్యదర్శి అగుల్ల యాకయ్య , చర్ల ప్రఖండ ఉపాధ్యక్షులు జట్టి వెంకటేశ్వర్లు, కొత్తగూడెం ధర్మప్రసార్ కార్యకర్త ఆగుళ్ల సుజాత , చుంచుపల్లి ప్రకండ బజరంగ్దళ్ విద్యార్థి ప్రముఖ్ మోక్ష, మరికొందరు విశ్వహిందూ పరిషత్ బజరంగ్దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.




# ఏడు రోజుల సంక్షేమ వారాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు
- జిల్లాలో ఏడు రోజుల కార్యచరణ అమలుకరై
- అధికారులకు ఆదేశించిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 18 : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 20వ తేదీ నుండి 26వ తేదీ వరకు 7 రోజుల పాటు సంక్షేమ వారాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు.శనివారం హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారు లతో కలిసి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంక్షేమ వారం నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు.జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో తో కలిసి జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఈ వీడియో కాన్ఫరెన్స్ కు హాజరయ్యారు.ఈ సమావేశం అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈ 7 రోజుల పాటు ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా చర్యలు తీసుకో వాలని, జిల్లాలోని అన్నీ ఎస్సి,ఎస్టి,బిసి,మైనారిటీ గురుకులాల్లో,వసతి గృహాల్లో వంట గది,పారిశుద్ధ్యం,మరమ్మతు పనులు చేపట్టాలని,విద్యార్థులకు వివిధ విభాగాలలో పోటీలు నిర్వహించాలని,స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు చేపట్టాలని,విద్యార్థుల తల్లిదండ్రులు,ఉపాధ్యాయులతో సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ట్రైబల్ వెల్ఫేర్ సంచాలకులు దేశీరాం ఇతర సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# 12వ వేతన కమిటీ వెంటనే ఏర్పాటు చేయాలి

## సింగరేణి కార్పొరేట్ ఏరియాలో బీఎంఎస్ గేట్ మీటింగ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రికొత్తగూడెం, ఏప్రిల్ 18 : భద్రాద్రి కొత్తగూడెం సింగరేణి కార్పొరేట్ ఏరియాలో బీఎంఎస్ అనుబంధ ఏబీకేఎంఎస్ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించి, 12వ వేతన సవరణ కమిటీని తక్షణమే ఏర్పాటు చేసి నోటిఫికేషన్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (ఏబీకేఎంఎస్–బీఎంఎస్) ఆధ్వర్యంలో శనివారం భద్రాద్రి జిల్లా కొత్తగూడెంలోని సింగరేణి కార్పొరేట్ ఏరియాలో సెంట్రల్ వర్క్షాప్ వద్ద గేట్ మీటింగ్ నిర్వహించారు. పిట్ సెక్రటరీ భూపతి రాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో 12వ వేతన సవరణ కమిటీ (జేబీసీసీఐ)ను వెంటనే ఏర్పాటు చేసి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సంఘం కార్యదర్శి పి. మాధవ్ నాయక్ మాట్లాడుతూ, 11వ వేతన కమిటీ గడువు 2026 జూన్ 30తో ముగియనున్న నేపథ్యంలో, జూలై 1 నుంచి అమల్లోకి వచ్చేలా 12వ వేతన కమిటీని తక్షణమే ఏర్పాటు చేయాలని కోరారు. కార్మికుల హక్కుల కోసం భారతీయ మజ్దూర్ సంఘ్ నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి ఈ విషయమై లేఖ పంపినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా బొగ్గు గనుల ప్రాంతాల్లో వారం రోజులపాటు గేట్ మీటింగ్లు నిర్వహిస్తూ ఆందోళనలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాల్లో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సింగరేణి సంస్థలో ఉత్పత్తి తగ్గుదల, కొత్త గనుల లభ్యత లేకపోవడానికి కొన్ని కార్మిక సంఘాల వైఖరి కారణమైందని విమర్శించారు. గతంలో బొగ్గు గనుల వేలంలో పాల్గొనకుండా తీసుకున్న నిర్ణయాలు సంస్థకు నష్టం కలిగించాయని అన్నారు. బొగ్గు గనుల వేలం ద్వారా కొత్త గనులు పొందడమే సంస్థకు లాభదాయకమని బీఎంఎస్ 2020 నుంచే చెబుతోందని గుర్తు చేశారు. అలాగే సింగరేణికి రావలసిన సుమారు రూ.53 వేల కోట్ల బకాయిలను ట్రాన్స్కో, జెన్కో సంస్థల నుంచి వసూలు చేయడంలో కొన్ని సంఘాలు విఫలమయ్యాయని ఆరోపించారు. కార్మిక సమస్యలపై స్పందించని ఏఐటీయూసీ గుర్తింపు సంఘం ఇప్పుడు ఆందోళనల పేరుతో కార్మికులను తప్పుదారి పట్టిస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు బి. రాంసింగ్, కార్యదర్శులు, నాయకులు, పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాలలో ప్రతిభ చాటుకున్న విజ్ఞాన్ జూనియర్ కళాశాల విద్యార్థులు

## కాలేజీ ప్రిన్సిపాల్ రాజేష్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, ఏప్రిల్, 18 : వనపర్తి జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ దగ్గర గల విజ్ఞాన్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫలితాలలో విజయ దుందుభీ మోగించారని కాలేజీ ప్రిన్సిపాల్ రాజేష్ పేర్కొన్నారు. తాజాగా ప్రకటించిన ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలలో బైపిసి మొదటి సంవత్సంర విద్యార్థులు గంగా భవాని అమలేశ్వరి 436 మార్కులతో రాష్ట్ర స్థాయి నాల్గవ ర్యాంక్ సాధించినట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. అదే విదంగా ఎంపిసి ద్వితీయ సంవత్సరం విద్యార్తిని గంగా భవాని 992 మార్కులతో రాష్ట్ర స్థాయి ఐదవ ర్యాంక్ సాధించగా బైపిసి మొదటి సంవత్సరంలో రాణి 431, ఏంపిసి మొదటి సంవత్సరం విద్యార్థి కృష్ణ కుమార్, 456, జి.ప్రియాంక, 454, సిఇసిసి మొదటి సంవత్సరంలో 500 మార్కులగాను అశోక్ కుమార్ 473, బబ్లు నాయక్ 456 సినియర్ ఏంపిసిలో సి.దివ్య, 986, ఎస్ఏండి సోయల్ 986, సినీయర్ సిఈసిలో ఆర్ గణేష్ 975, సినీయర్ బైపిసిలో వాకిటి పావని 975, ఎస్ చంద్, 975, మార్కులు సాధించినట్లు తెలిపారు. ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ రాజేష్, డైరెక్టర్ క్రాంతి ప్రిన్సిపాల్ శిభామణి అధ్యాపకులు అభినంధించి సత్కరించారు.

# ఏఐ వినియోగంతో పనితీరులో వేగం, సామర్థ్యం పెరుగుతుంది

- ఏఐ సాంకేతికతను ప్రతి ఒక్కరూ అవలంబించాలి
- సాంకేతిక పరిజ్ఞానంతో సేవల నాణ్యతను మెరుగుపరచాలి
- శిక్షణలను సద్వినియోగం చేసుకుని పనిలో ప్రతిఫలింపజేయాలి
- ప్రభుత్వ సేవలను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా అందించాలి
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పెద్దపల్లి, ఏప్రిల్ 18 : ఏఐ సాంకేతికత వినియోగం ద్వారా ప్రభుత్వ పనితీరులో వేగం, సామర్థ్యం పెరుగుతుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. ప్రతి అధికారి, సిబ్బంది ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంబించి తమ పనిని మరింత సమర్థవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. శనివారం జిల్లాలో నిర్వహించిన ఏఐ శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీహర్ష పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సాంకేతిక పరిజ్ఞానాలను స్వీకరించడం ద్వారా పనుల్లో వేగం పెరగడంతో పాటు సమయాన్ని ఆదా చేయవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఏఐ వంటి ఆధునిక సాంకేతికతను నేర్చుకుని, తమ దైనందిన విధుల్లో అమలు చేయాలని సూచించారు. శిక్షణ కార్యక్రమాలను కేవలం హాజరుకే పరిమితంగా కాకుండా, అందులో నేర్చుకున్న విషయాలను పనిలో ప్రతిఫలింపజేయాలని అన్నారు. ప్రభుత్వ సేవలను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా అందించేందుకు సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలకు త్వరితగతిన, నాణ్యమైన సేవలు అందించే దిశగా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. శిక్షణ కార్యక్రమాలకు సమయపాలనతో హాజరై, పూర్తి స్థాయిలో పాల్గొనాలని, నేర్చుకునే మనస్తత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఇంకా ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి బండి ప్రకాష్, సంబంధిత అధికారులు, అన్ని శాఖల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధుల పోషణ విస్మరిస్తే జైలుకే..

## జగిత్యాల ఆర్డీవో పి.మధు సూదన్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జగిత్యాల, ఏప్రిల్ 18 : వృద్ధ తల్లిదండ్రుల పోషణ విస్మరించి, వేధింపులకు గురిచేస్తే వారి కొడుకులకు, కోడళ్ళకు, వారసులకు జైలు శిక్ష విధిస్తామని జగిత్యాల డివిజన్ వయో వృద్ధుల సంరక్షణ ట్రిబ్యునల్ అధికారి ఆర్డీవో పి.మధు సూదన్ హెచ్చరించారు. శనివారం వయో వృద్ధుల సంరక్షణ చట్టం కింద వచ్చిన ఫిర్యాదుల మేరకు ఆర్డీవో మధుసూదన్ బుగ్గారం గ్రామానికి చెందిన కొడిమ్యాల రాజయ్య ఇద్దరు కొడుకులు, కోడళ్ళు పోషించక వేధింపులకు గురి చేస్తున్నారని, జగిత్యాల రూరల్ మండలం సంగం పల్లి గ్రామానికి చెందిన బైరి చిన్న మల్లయ్యను కొడుకు కొడుతున్నాడని, జగిత్యాల పట్టణానికి చెందిన సంకోజీ నారాయణ దంపతులను కొడుకు, కోడలు తరుచుగా దాడులు చేస్తున్నారని, వారితో ప్రాణ భయం ఉందనే ఫిర్యాదులపై కొడుకులు, కోడళ్ళను విచారించారు. సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ వృద్ధ తల్లిదండ్రుల పక్షాన వాదనలు వినిపిస్తూ న్యాయం చేయాలని కోరారు. విచారణకు హాజరు కానివారిపై సైతం చర్యలకు ఆర్డీవో నోటీసులు జారీచేశారు. విచారణల్లో సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్, సెక్షన్ సీనియర్ సహాయకురాలు పద్మజ పాల్గొన్నారు.



# బ్రెయిన్ స్ట్రోక్ తో ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ మృతి

## నివాళులర్పించిన పలువురు ప్రముఖులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం,ఏప్రిల్ 18 : నగరంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్న పోలగాని శ్రీనివాసరావు (57) హైదరాబాదులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బ్రెయిన్ స్ట్రోక్ తో శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నేలకొండపల్లి మండలం పైనంపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసరావు 1995లో కానిస్టేబులుగా ఉద్యోగం పొంది ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు ప్రాంతాలలో పనిచేశారు. ఇటీవల హెడ్ కానిస్టేబులుగా పదోన్నతి పొంది ఖమ్మం నగరంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనను హైదరాబాద్లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి సమయంలో ఆయన తుది శ్వాస విడిచారు. ఆయన మృతదేహాన్ని ఖమ్మం నగర పరిధిలోని బోనకల్ రోడ్డులో గల ధంసలాపురంలోని ఎస్సార్ హోమ్ లో గల ఆయన స్వగృహానికి తరలించారు. నిజాయితీకి నిబద్ధతకు పేరుగాంచిన శ్రీనివాసరావు విధుల నిర్వహణలో అటు అధికారులు మన్ననలు ఇటు ప్రజల ఆదరాభిమానాలు చూరగొన్నారు. పోలీస్ శాఖలో ఆయన మంచి పేరు సంపాదించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నప్పటికీ విధుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా ఎండలను సైతం లెక్కచేయకుండా తన విధులు నిర్వహించారు. ఈ క్రమంలో ఆయన ఆరోగ్యం మరింతగా క్షీణించింది. ఈ మేరకు శ్రీనివాసరావును హైదరాబాద్ తరలించగా అక్కడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. శనివారం ఉదయం ధంసలాపురంలో ఆయన పార్థివ దేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

**పలువురు ప్రముఖుల నివాళులు:** ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్గా పనిచేస్తున్న శ్రీనివాసరావు గౌడ్ మృతి చెందారని వార్త తెలుసుకొని పలువురు ప్రముఖులు నగర పరిధిలోని ధంసలాపురంలోని ఎస్సార్ హోమ్స్ లోని ఆయన స్వగృహం కి వెళ్లి పార్థివ దేహానికి నివాళులర్పించారు. ఆయన మృతి పోలీస్ శాఖకు తీరని లోటని ఆ శాఖ అధికారులు, గోపా సంఘ నాయకులు, తోటి ఉద్యోగులు కొనియాడారు.

రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ ప్రతాపరెడ్డి, పోలీస్ శాఖ సీనియర్ సిటిజన్ సంఘం అధ్యక్షులు రాధాకృష్ణమూర్తి, రిటైర్డ్ ఏవో నూతక్కి వెంకటేశ్వరరావు, డిసిసిబి మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎసిపి మల్లయ్య స్వామి గౌడ్, సీఐ రథం భాను ప్రకాష్ గౌడ్, పోలీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మరికంటి వెంకటేశ్వర్లు, గౌడ సంఘం రాష్ట్ర నాయకులు అమరగాని వెంకటేశ్వర్లు గౌడ్, గోపా సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ బొల్లికొండ శ్రీనివాసరావు గౌడ్, సీనియర్ న్యాయవాది జేఏసీ చైర్మన్ బిచ్చాల తిరుమలరావు గౌడ్, గోపా సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బెల్లంకొండ శరత్ గౌడ్, తోడేటి దుర్గాప్రసాద్ గౌడ్, అమరగాని శ్రీనివాస్ గౌడ్, సైదులు గౌడ్ తదితరులు నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ తప్పనిసరి -

## - సర్వైకల్ క్యాన్సర్ నివారణకు కీలకం

### - సులానగర్ వైద్యాధికారి కంచర్ల వెంకటేష్ సూచన



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

టేకులపల్లి, ఏప్రిల్ 14 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండల పరిధిలోని సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్.పి.వి.) వ్యాక్సిన్‌ను 27 మంది బాలికలకు అందించినట్లు వైద్యాధికారి డాక్టర్ కంచర్ల వెంకటేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 14 నుంచి 15 సంవత్సరాల లోపు వయస్సు గల బాలికలకు ఈ వ్యాక్సిన్ భవిష్యత్తులో గర్భాశయ ముఖ క్యాన్సర్ (సర్వైకల్ క్యాన్సర్) నివారణకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఎన్నో క్లినికల్ పరీక్షల అనంతరం సురక్షితంగా నిర్ధారించబడిన ఈ వ్యాక్సిన్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా అందిస్తున్నాయని తెలిపారు. హ్యూమన్ పాపిలోమా వైరస్ ఇన్ఫెక్షన్ నుండి రక్షణ కల్పించడం ద్వారా సర్వైకల్ క్యాన్సర్ వచ్చే అవకాశాలను గణనీయంగా తగ్గించవచ్చని చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రులలో 14 సంవత్సరాలు నిండిన బాలికలకు ఉచితంగా ఈ వ్యాక్సిన్ అందుబాటులో ఉందని, అర్హులైన ప్రతి బాలిక ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వజ్జా పార్వతి, సూపర్వైజర్లు గుజ్జా విజయ, కౌశల్య సింగ్, నాగలక్ష్మి, కమల, రమాకుమారి, సులోచన, స్వప్న, చంద్రకళ, ఫార్మసీ ఆఫీసర్ కిరణ్ కుమారి, ఈఎంఆర్ఎస్ సిబ్బంది భవాని, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# మద్యం మత్తుకు బానిసై ఒంటిపై డీజిల్ పోసుకుని వ్యక్తి ఆత్మహత్య

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, ఏప్రిల్ 18 : మద్యం మత్తుకు బానిసై ఒంటిపై డీజిల్ పోసుకుని ఓ వ్యక్తి ఆత్మ హత్యకు పాల్పడిన సంఘటన శనివారం మండల పరిధిలోని యూసుఫ్ పేటలో జరిగింది.పాపన్నపేట పోలీసులు,కుటుంబీకుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి గ్రామానికి చెందిన నర్రా నరేష్(39) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు.కాగా గత కొన్ని నెలలుగా మద్యానికి బానిసై అతిగా మద్యం సేవించి ఇంటికి వచ్చి మద్యానికి డబ్బులు ఇవ్వాలని తరచూ గొడవ చేస్తూ ఉండేవాడు.అయితే ఈ నెల 16 గురువారం మద్యం అతిగా సేవించి రాత్రి సమయంలో ఇంటికి వచ్చి మద్యం కొనుగోలుకు డబ్బులు ఇవ్వాలని గొడవచేస్తూ ఇంటిలోకి వెళ్ళి ఇంటిలో దీపం వెలిగించేందుకు తెచ్చిన డీజిల్ ను ఒంటిపై పోసుకొని నిప్పంటించుకోవడంతో మంటలు వ్యాపించడంతో అరుపులు చేస్తూ బయటకు రావడంతో ఆరుబయట కూర్చున్న భార్య మాధవి వెంటనే మంటలను ఆర్పి చికిత్స నిమిత్తం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు తెలిపారు.ఈ విషయమై పాపన్న పేట పోలీసులకు మృతుడి భార్య మాధవి పిర్యాదు చేయడంతో పాపన్న పేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.కాగా భార్య మాధవితో పాటు మృతుడికి ఇరువు కుమారు ఉన్నారు.

# శభాష్ డాక్టర్ రాజశేఖర్ గౌడ్ - విధి నిర్వహణలోనే మానవీయ సేవలు

## - అత్యవసర సమయంలో స్పందించి ప్రాణాలు కాపాడిన డి.సి.హెచ్.ఎస్.



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, ఏప్రిల్ 18: వైద్య వృత్తిలో ఉన్నత స్థానంలో ఉండి కూడా మానవీయతను ముందుంచుతూ సేవలందిస్తున్న డి.సి.హెచ్.ఎస్. డాక్టర్ కేశగాని రాజశేఖర్ గౌడ్‌కు ప్రజల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. వైద్య ఆరోగ్యశాఖలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తూ, ప్రభుత్వ ఆసుపత్రుల సేవలపై పర్యవేక్షణలో నిత్యం నిమగ్నమై ఉంటూనే, మార్గమధ్యంలో అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారికి తక్షణ వైద్య సహాయం అందించడం ఆయన ప్రత్యేకతగా నిలుస్తోంది. అనారోగ్యంతో బాధపడుతున్న లేదా ప్రమాదాలకు గురైన వారిని గుర్తించిన వెంటనే తన వాహనాన్ని ఆపి, ప్రాథమిక చికిత్స అందించి సమీప ఆసుపత్రికి తరలించడం ద్వారా పలువురి ప్రాణాలను రక్షించారు. శనివారం ఉదయం ఖమ్మం నగరంలోని నరసింహస్వామి ఆలయం సమీపంలో ఒక గుర్తు తెలియని వ్యక్తి అకస్మాత్తుగా మూర్ఛతో కుప్పకూలగా, అక్కడికి చేరుకున్న డాక్టర్ రాజశేఖర్ గౌడ్ వెంటనే స్పందించారు. బాధితుని రక్తపోటును పరీక్షించి, తన వాహనంలో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, తక్షణ వైద్య చికిత్స అందేలా చర్యలు తీసుకున్నారు. జిల్లాలో నిర్వహిస్తున్న "అరైవ్... అలైవ్..." రోడ్డు భద్రతా కార్యక్రమం ద్వారా వచ్చిన స్ఫూర్తితో ఇలాంటి మానవతా సేవలు కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఆయన సేవా భావాన్ని చూసిన ప్రజలు "శభాష్ డాక్టర్" అంటూ అభినందనలు తెలియజేస్తున్నారు.



# సమగ్ర కుటుంబ సర్వే హానరేరియం వెంటనే చెల్లించాలి

## ఉపాధ్యాయ సంఘాల నిరసన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

టేకులపల్లి, ఏప్రిల్ 18 : భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలంలోని ఉపాధ్యాయ సంఘాలు సమగ్ర కుటుంబ సర్వే హానరేరియం చెల్లింపులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసన చేపట్టాయి. శనివారం ముత్యాలంపాడు ఎక్స్ రోడ్డు రైతు వేదికలో జరుగుతున్న సెన్సస్ శిక్షణా తరగతుల మధ్యాహ్న విరామ సమయంలో ఈ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం 2024 నవంబర్‌లో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న ఎన్యుమరేటర్లకు ఇప్పటివరకు హానరేరియం చెల్లించకపోవడం తీవ్ర నిర్లక్ష్యమని విమర్శించారు. ప్రతి ఒక్కరికి రూ.10,000 చొప్పున చెల్లించాల్సి ఉన్నప్పటికీ, ఒకటిన్నర సంవత్సరాలు గడిచినా చెల్లింపులు జరగకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తం గా మొత్తం సుమారు రూ.50 కోట్లు మాత్రమే అవసరమైనప్పటికీ, ప్రభుత్వం వాటిని విడుదల చేయడంలో విఫలమవుతోందని ఆరోపించారు. ఉపాధ్యాయ సంఘాలు పలుమార్లు విజ్ఞప్తులు చేసినప్పటికీ ఫలితం లేకపోవడం ఆందోళనకరమని అన్నారు. వెంటనే హానరేరియం చెల్లించాలని, లేకపోతే ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు గుగులోత్ హరిలాల్ నాయక్, పీఆర్‌టీయూ-టీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గుగులోత్ మోతీలాల్ నాయక్, టీజీటీటీఎఫ్ మండల అధ్యక్షులు బాదావత్ పూల్ సింగ్ నాయక్తో పాటు ఉపాధ్యాయులు ఏ. వెంకట్ రామ్, ఎం. మోహన్ రావు, డి. వీరన్న, కే. భిక్షమయ్య, జి. రాంబాబు, బి. సునీత, శ్రీలక్ష్మి, సుభద్ర, రాధ, అంజలి, మోకాళ్ల రామకోటేశ్వరి, సరస్వతి, అబ్బయ్య, సులోచన, వాలమ్మ, వెంకటేశ్వర్లు, బాలు, రాంబాబు, శంకర్, బాలాజీ, మున్నా తదితరులు పాల్గొన్నారు.





# మహిళా బిల్లును కాంగ్రెస్ అడ్డుకోవడం సరికాదు

## - ఖనిలో రాజీవ్ గాంధీ దిష్టి బొమ్మ దగ్ధం
## - రామగుండం బిజెపి ఇంచార్జి కందుల సంధ్య రాణి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్ సిటి (గోదావరిఖని), ఏప్రిల్ 18 : కాంగ్రెస్ పార్టీ మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించడం సరికాదని రామగుండం బిజెపి ఇన్చార్జి కందుల సంధ్యారాణి అన్నారు. గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో సంధ్యారాణి ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను శనివారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా హక్కులు సాధికారతకు నిరుద్ధంగా కాంగ్రెస్ నాయకులు బిల్లు కు వ్యతిరేకంగా ఓటు వేయడం వారిమూర్ఖత్వానికి నిదర్శనమన్నారు. కాగా దిష్టిబొమ్మ దహనం చేయడానికి ప్రయత్నించిన సమయంలో పోలీసులు జోక్యం చేసుకొని కార్యక్రమాన్ని అడ్డుకోవడంలో కొంత ఉధృతవాతావరణానికి దారి తీసింది. పోలీసుల చర్యపై నిరసనకారుల ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రజాస్వామ్య హక్కులను అణిచివేస్తున్నారని ఆరోపించారు. అనంతరం దిష్టి బొమ్మలను దహనం చేయడాన్ని అడ్డుకోవడంతో రాహుల్ గాంధీ చిత్ర పటాన్ని కాల్చివేసి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ బల్మూరి వనిత,సీనియర్ నాయకులు సులువ లక్ష్మీనరసయ్య, పద్మ, చిలుక భారతి, మండల అధ్యక్షులు గుండబోయిన భూమయ్య, మెరుగు నరేష్ గౌడ్, బోడ కుంటి సుభాష్, పూరగొండిఅపర్ణ,వెల్తురు సరిత,రాజయ్య, అందే రాజ్ కుమార్,చారి, అంకరి భరత్, జనగామ శివరాం, సునీల్, ఇరిగాల శివకుమార్, బియ్యాల మహేందర్, మాట ప్రభాకర్, రాజేశ్వరి, సుప్రియ, ఈశ్వరి సుమలత తదితరులు పాల్గొన్నారు.

# విధి నిర్వహణకు వెళ్తూ... రోడ్డు ప్రమాదంలో..

## ప్రైవేట్ ఉపాధ్యాయురాలు 'వెన్నెల' మృతి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కోల్ సిటి (గోదావరిఖని), ఏప్రిల్ 18 : రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో విధి నిర్వహణలో భాగంగా పాఠశాలకు వెళ్తున్న ప్రైవేటు ఉపాధ్యాయురాలు వెన్నెల మృతి చ గోదావరిఖని పట్టణంలోని ద్వారక నగర్(ఎన్టీఆర్ నగర్)కు చెందిన మెరుగు వెన్నెల (26)ఆర్ఎఫ్ సి ఎల్ లోని ఒక ప్రైవేటు పాఠశాలలో ఫిజిక్స్ టీచర్ గా పనిచేస్తుంది. పాఠశాలకు స్కూటి వెళ్తున్న సమయంలో మహాలక్ష్మి ఫంక్షన్ హాల్ వద్ద వెనక నుండి ట్రక్(ఏపీ 15 టిసి 3374)నడుపుతున్న డ్రైవర్ మహమ్మద్ నజిరుద్దీన్ జాగ్రత్తగా వేగంగా నడుపుతూ స్కూటీని ఢీకొట్టాడు. దాంతో ఆ టీచర్ కుడి వైపు కు పడటం తో, ఆమె తల పైన ఎడమవైపు గల టైర్ ఎక్కడంతో ఆమె ధరించిన హెల్మెట్ పగలడంతో పాటు తీవ్ర గాయాలయ్యాయి. దాంతో స్థానికులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది.

# అందరి క్షేమాన్ని కోరుకునేది హిందూ ధర్మం

## - 26న కొత్తగూడెంలో భారీ హిందూ సమ్మేళనం.
## - పెద్ద ఎత్తున తరలిరావాలంటూ నిర్వాహకుల పిలుపు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 18 : హిందూ ధర్మం సమస్త ప్రజల క్షేమాన్ని కోరుకునే జీవన విధానం అని హిందూ సమ్మేళనం నిర్వహణ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం పట్టణంలోని వనవాసి కళ్యాణ ఆశ్రమం పరిధిలో శనివారం నిర్వహించిన విలేఖరుల సమావేశంలో వారు ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, హిందూ ధర్మం, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కట్టుబడి ఉన్న హిందూ సమాజం ఆధ్వర్యంలో ఈనెల 26న సాయంత్రం 4 గంటలకు కొత్తగూడెం సింగరేణి ప్రకాశం స్టేడియంలో భారీ హిందూ సమ్మేళనం సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. హిందూ సమాజంలో ఐక్యతను బలోపేతం చేయడం, యువతలో ధార్మిక--సాంస్కృతిక అవగాహన పెంపొందించడం, సంప్రదాయ విలువలను భవిష్యత్ తరాలకు చేరవేయడం ఈ సమ్మేళనం ప్రధాన ఉద్దేశ్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ధార్మిక నాయకులు, పండితులు, సామాజిక కార్యకర్తలు పాల్గొని హిందూ ధర్మం, సంస్కృతి, సమాజంలో ఎదురవుతున్న సవాళ్లపై ప్రసంగాలు చేయనున్నట్లు తెలిపారు. అదనంగా భజనలు, సాంస్కృతిక ప్రదర్శనలు, పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. చుంచుపల్లి మండలం విద్యానగర్ సాయిబాబా దేవాలయం నుంచి పాలకేంద్రం హనుమాన్ దేవాలయం వరకు బైక్ ర్యాలీ కూడా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. హిందూ సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నిర్వహణ కమిటీ అధ్యక్షులు పి. వర్ధన్ రావు, కార్యదర్శి లట్టి జగన్మోహన్ రావు, సభ్యులు యెలదండి పూర్ణచంద్రరావు, పలివెల సాంబశివరావు, గోపాల్ పంచారియా, బండి భాస్కర్, మనీష్ అగర్వాల్, దారా రమేష్, న్యాయవాది పాతూరి విఠల్, సురేష్, అప్పారి లక్ష్మణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి సూపర్ బజార్లు సంక్షోభంలో... అధికారుల నిర్లక్ష్యంపై ఏఐటీయూసీ ఆగ్రహం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)





భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 18 : భద్రాద్రి కొత్తగూడెంలో సింగరేణి సూపర్ బజార్లు సరుకుల కొరత, నిర్వాహణ లోపాలతో కుదేలవుతున్నాయని ఏఐటీయూసీ నేత వంగ వెంకట్ ఆరోపిస్తూ, యాజమాన్యం వెంటనే జోక్యం చేసుకుని పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సింగరేణి కాలరీస్ సెంట్రల్ స్టోర్స్ లిమిటెడ్‌ను కార్మికుల అవసరాల కోసం ఒకప్పుడు సమగ్ర సూపర్ బజార్‌గా అభివృద్ధి చేసినప్పటికీ, ప్రస్తుతం అవి నిర్వాహణ లోపాలతో సంక్షోభంలో కూరుకుపోయాయని ఏఐటీయూసీ కేంద్ర కమిటీ కార్యదర్శి వంగ వెంకట్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒకప్పుడు 26 కౌంటర్లతో కార్యకలాపాలు నిర్వహించిన సూపర్ బజార్లు ప్రస్తుతం 9 కౌంటర్లకు కుదించబడినట్లు తెలిపారు. సరుకుల కొరత కారణంగా కౌంటర్లు వెలవెలబోతున్నాయని, కార్మికులకు అందించే రూ.10 వేల క్రెడిట్ సౌకర్యం ఉన్నప్పటికీ కొనుగోళ్లు జరగక నిరాశతో వెనుదిరుగుతున్నారని చెప్పారు. హైదరాబాద్ మెట్రో మాల్ నుంచి అధిక ధరలకు సరుకులు కొనుగోలు చేయడం, చెల్లింపుల ఆలస్యం వల్ల సరఫరాలు నిలిచిపోవడం వంటి సమస్యలు నెలకొన్నాయని ఆరోపించారు. ఇతర కంపెనీలతో పోలిస్తే అధిక ధరలు చెల్లిస్తున్నప్పటికీ, కొన్నిసార్లు గడువు ముగిసే సరుకులు సరఫరా అవుతున్నాయని పేర్కొన్నారు. సూపర్ బజార్ల పర్యవేక్షణ కోసం ఉన్నతాధికారులను నియమించినప్పటికీ, సరైన నియంత్రణ లేకపోవడం వల్ల వ్యవస్థ పూర్తిగా దెబ్బతిన్నదని విమర్శించారు. గతంలో దీపావళి సందర్భంగా బాణసంచా, ఎలక్ట్రానిక్ వస్తువుల విక్రయాలతో లాభాలు పొందిన సూపర్ బజార్లు ప్రస్తుతం నష్టాల్లో నడుస్తున్నాయని అన్నారు. ఎండాకాలంలో అవసరమైన ఎయిర్ కండిషనర్లు, ఫ్రిడ్జ్‌లు, కూలర్లు అందుబాటులో లేకపోవడం కార్మికుల్లో అసహనం కలిగిస్తోందన్నారు. అనుభవంలేని సిబ్బందితో ఆర్థిక లావాదేవీలు నిర్వహించడం వల్ల ఐటీ, జీఎస్టీ భారం పెరిగిందని తెలిపారు. కొన్నిచోట్ల సిబ్బంది దుర్వినియోగం జరిగినప్పటికీ చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమయ్యారని విమర్శించారు. ఎల్పీజీ గ్యాస్ సరఫరాలో కూడా తీవ్ర సమస్యలు ఉన్నాయని, డిమాండ్ డ్రాఫ్టులు సమయానికి చెల్లించకపోవడం వల్ల సిలిండర్లు ఆలస్యంగా అందుతున్నాయని పేర్కొన్నారు. కొన్ని ప్రాంతాల్లో కార్మికులు ఆందోళనలు కూడా చేపట్టినట్లు తెలిపారు. సూపర్ బజార్ ఎన్నికలు దశాబ్ద కాలంగా నిర్వహించకపోవడం, ఆస్తుల పరిరక్షణలో నిర్లక్ష్యం, న్యాయపరమైన కేసుల పురోగతి తెలియని పరిస్థితి వంటి అంశాలు పరిస్థితిని మరింత దారుణంగా మారుస్తున్నాయని అన్నారు. సింగరేణి యాజమాన్యం తక్షణం జోక్యం చేసుకుని సూపర్ బజార్లకు ఆర్థిక మద్దతు అందించి, నిర్వాహణలో లోపాలు సరిదిద్దాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ నేత వంగ వెంకట్ డిమాండ్ చేశారు.

# ప్రజాస్వామ్యానికి చీకటి రోజు...

## రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అజ్మీర కృష్ణవేణి నాయక్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు, ఏప్రిల్ 18 : ప్రజాస్వామ్యానికి ఏప్రిల్ 17 చీకటి రోజుగా మిగిలిపోతుందని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అజ్మీర కృష్ణవేణి నాయక్ అన్నారు. శనివారం జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం ఆధ్వర్యంలో ములుగు జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారిపై కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేయడం జరిగింది. ఈ సందర్భంగా అజ్మీరా కృష్ణవేణి నాయక్ మాట్లాడుతూ మహిళా సాధికారతకు కీలకమైన మహిళా రిజర్వేషన్ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ మరియు ఐఎన్‌డిఐ ఏ కూటమి మహిళా వ్యతిరేక స్వరూపాన్ని మరోసారి బయటపెట్టాయని, దేశంలోని కోట్లాది మహిళల ఆశయాలను విశ్వాసాన్ని ఈ పార్టీలు ద్రోహం చేశాయని ఈ నిర్ణయం దేశం మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశాయని అన్నారు. రాబోయే రోజుల్లో మహిళల ఆగ్రహానికి కాంగ్రెస్ పార్టీ తప్పకుండా గురవుతుందని, ప్రజాక్షేత్రంలో తగిన గుణపాఠం నేర్పుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భూక్యా జవహర్ లాల్, మహిళా మోర్చా అధ్యక్షురాలు కొర్ర సుమలత, రాష్ట్ర ఎస్టీ మోర్చా అధికార ప్రతినిధి గుగులోతు స్వరూప, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీలమంతుల రవింద్రాచారి, జిల్లా ఉపాధ్యక్షుడు జినుకల కృష్ణాకర్ రావు, అల్లె శోభన్, కోశాధికారి గంగిశెట్టి రాజ్ కుమార్, ములుగు మండల అధ్యక్షులు రాయంచు నాగరాజు, మునిసిపాలిటీ అధ్యక్షుడు ఇమ్మడి రాకేష్ యాదవ్, లీగల్ సెల్ కన్నోజు సునీల్ మమన్, రవి రెడ్డి, మాలోతు ప్రేమ్ సింగ్, రాజన్న శ్రీహరి, హేమాద్రి, పవన్, వెంకటేశ్, రవిందర్ రావు, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

# ఓసిపీ-5, వివిధ గనులలో అరైవ్-అలైవ్ అవగాహన సదస్సు

## గోదావరిఖని ఏసీపీ మడత రమేష్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కోల్ సిటి (గోదావరిఖని), ఏప్రిల్ 18 : అర్జీవన్ ఏరియా లోని వివిధ గనులు డిపార్ట్ మెంట్ లలో "అరైవ్ - అలైవ్" అవగాహన సదస్సు బైక్ ర్యాలీని నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం నిర్వహిస్తున్న రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా, శనివారం ఉదయం 7:30 గంటలకు జీడీకే-5 ఓసి ప్రాంగణంలో "అరైవ్ - అలైవ్" రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్జీ-1 ఏరియా జీఎం డి.లలిత్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రామగుండం ఏసీపీ మడత రమేష్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ (ఎంవీఐ) కె. సంతోష్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆలాగే వివిధ గనులు డిపార్ట్ మెంట్ లలో రోడ్డు భద్రతా వారోత్సవాలలో భాగముగా సివిల్ డిపార్ట్ మెంట్ నందు 1 టౌన్ సి.ఐ ఇంద్ర సేనా రెడ్డి, జిడికె 1అండ్ 3 ఇంక్లైన్ నందు ఏజెంట్ 1 గ్రూప్ యల్ రమేశ్, మేనేజర్ సుదీర్ జక్కుల్ వార్, జిడికె 11 గని మేనేజరు బి మల్లేశం, యస్. అండ్ పిసి నందు వీరారెడ్డి, సెక్యూరిటి ఆఫీసర్ లు ఉద్యోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి జెండా ఊపి బైక్ ర్యాలి ప్రారంభించారు ఈ సందర్భంగా ఏసీపీ మడత రమేష్ మాట్లాడుతూ, వాహనాలు నడిపే సమయంలో ప్రతి ఒక్కరూ స్వయం నియంత్రణ పాటించాలని సూచించారు. ప్రాణ రక్షణ కోసం ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లలో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడపరాదని (డ్రంక్ అండ్ డ్రైవ్ ) చేయరాదని ఉద్యోగులను హెచ్చరించారు. మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కె. సంతోష్ రెడ్డి మాట్లాడుతూ, రహదారి నిబంధనలు పాటించడం వల్ల ప్రమాదాలను నివారించవచ్చన్నారు , ప్రతి ఉద్యోగి రోడ్డు భద్రతా జాగ్రత్తలను విధిగా పాటించాలని కోరారు. ప్రాజెక్ట్ ఆఫీసర్ డి. రమేష, ప్రదీప్ సాగర్ (అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్ పెక్టర్), కె. రామ్మోహన్ (ఏరియా ఇంజనీర్), సాయి ప్రసాద్ (ఏరియా సేఫ్టీ ఆఫీసర్), అనిల్ గబాలే (మేనేజర్), పొనుగోటి శ్రీనివాస్ (సేఫ్టీ ఆఫీసర్), పెరుమాళ్ల శ్రీనివాస్ (సీఎంఓఏఐ ఏరియా వైస్ ప్రెసిడెంట్), వీరారెడ్డి (ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్), పి. రమేష్ (పిట్ ఇంజనీర్), దీటి చంద్రమౌళి (సర్వే ఆఫీసర్), గుర్రం ప్రభుదాస్ (ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ) సింగరేణి ఉద్యోగులు, రక్షణ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేశారు.

# క్లిష్టమైన సర్జరీలకు కేరాఫ్ గా జిల్లా ఆసుపత్రి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ఎద్దపల్లి, ఏప్రిల్ 18 : పెద్దపల్లి జిల్లా ఆసుపత్రి మరోసారి తన వైద్య నైపుణ్యాన్ని చాటుకుంది. పెద్దపల్లికి చెందిన 14 ఏళ్ల బాలుడు ఇటీవల కరీంనగర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా, మొదట ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స కోసం సంప్రదించారు. ఆ వైద్యం ఖరీదైనదని తెలియడంతో కుటుంబం ఆందోళన చెందింది. వారం తర్వాత పెద్దపల్లి మాత శిశు ఆసుపత్రిని ఆశ్రయించగా సూపరింటెండెంట్ డాక్టర్ కె.శ్రీధర్ వెంటనే స్పందించి ఆర్థోపెడిక్ వైద్యుల పర్యవేక్షణలో చికిత్స ప్రారంభించారు. పరీక్షలలో బాలుడి కుడి టిబియా ఎముక వెనుక-మధ్య భాగంలో తీవ్ర అవల్షన్ ఫ్రాక్చర్‌తో పాటు మోకాలిలో అంతర్గత గాయాలు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. ఈ నేపథ్యంలో కార్పోరేట్ స్థాయి సదుపాయాలతో ఖరీదైన టైటానియం స్క్రూలను ఉపయోగించి ఓపెన్ రిడక్షన్ అండ్ ఇంటర్నల్ ఫిక్సేషన్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఈ శస్త్రచికిత్సలో సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కుమార్ గౌడ్, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ వినయ్ కుమార్, అనస్థీషియా నిపుణుడు డాక్టర్ రామం పాల్గొన్నారు. విజయవంతమైన శస్త్రచికిత్సకు సహకరించిన వైద్య బృందం, ఓటీ సిబ్బందిని సూపరింటెండెంట్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో నవజాత శిశు కేంద్రం, 2డి ఎకో, లాప్రోస్కోపిక్ శస్త్రచికిత్సలు, యూరాలజీ, రూట్ కెనాల్ వంటి ఆధునిక వైద్య సేవలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆసుపత్రిలో సానిటేషన్, వాష్‌రూమ్ శుభ్రత లేదా ఇతర సేవల విషయంలో ఎవరైనా డబ్బులు అడిగితే నర్సింగ్ సూపరింటెండెంట్, ఆర్ఎంఓ లేదా నేరుగా సూపరింటెండెంట్‌ను సంప్రదించాలని సూచించారు. అవసరమైతే కంప్లైంట్ బాక్స్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని, సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అందిస్తున్న అన్ని సేవలు పూర్తిగా ఉచితమని, ఎవరూ లంచాలు ఇవ్వవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# రాజ్యాంగ ఓటమి: మహిళా రిజర్వేషన్ల చరిత్రలో మరో కీలక మలుపు

## చట్టసభల గడప దాటని సాధికారత...రాజకీయ వ్యూహమా? వ్యూహాత్మక పొరపాటా?

### ప్రాంతీయ ప్రయోజనాలు వర్సెస్ సామాజిక సంస్కరణలు: మహిళా బిల్లు వీగిపోవడం వెనుక అసలు కారణాలు



రామకిష్టయ్య సంగన భట్ల
9440595494

లోకసభలో మహిళా రిజర్వేషన్ల బిల్లు వీగిపోవడం దేశ రాజకీయాలలో మరో కీలక మలుపుగా నిలిచింది. రా జ్యాంగ సవరణ స్థాయి బిల్లులు సాధా రణ చట్టాల కంటే విభిన్నమైన ప్రామా ణికతను, విస్తృత రాజకీయ సమ్మతిని కోరుకుంటాయి. 131వ రాజ్యాంగ సవరణగా ప్రతిపాదించ బడిన ఈ బిల్లుతో పాటు నియోజకవర్గాల పునర్వి భజన, కేంద్ర పాలిత ప్రాంతాల సీట్ల పెంపు వంటి కీలక ప్రతిపాదనలు ఒకే సారి లోకసభ ముందుకు రావడం రాజకీయంగా ఆసక్తికరమైనా, వ్యూహాత్మకంగా ప్రమాదకర నిర్ణయంగా మారింది. 528 మంది సభ్యులు పాల్గొన్న ఓటింగ్‌లో 298 అనుకూల ఓట్లు, 230 వ్యతిరేక ఓట్లు రావడం గణాంక పరంగా మెజార్టీలా కనిపించినా, రాజ్యాంగ సవరణకు అవసరమైన రెండు-మూడవ వంతు మెజార్టీ సాధించడంలో ప్రభుత్వం విఫలమైంది. ఇదే ఈ పరిణామానికి మూల కారణం.

ఈ పరిణామాన్ని అర్థం చేసుకోవాలంటే ముందుగా మహిళా రిజర్వేషన్ల చరిత్రను పరిశీలించాల్సి ఉంటుంది. 1990ల నుంచే మహి ళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించాలనే ఆలోచన రాజకీయ చర్చల్లో నిలిచింది. 1996లో మొదటిసారి ఈ బిల్లు ప్రవేశ పెట్ట బడినా, అప్పటి నుండి అనేకసార్లు అది పార్లమెంట్‌లో ప్రవేశించి నిలిచి పోయింది. 2010లో రాజ్యసభలో ఆమోదం పొందినా, లోకసభలో ఆమోదం పొందకపోవడం వల్ల చట్టరూపం దాల్చలేదు. అంటే, మహిళా రిజర్వేషన్లు భారత రాజకీయాల్లో ఒక 'అసంపూర్తి వాగ్దానం'గా మిగిలి పోయాయి.

ప్రస్తుత సందర్భంలో కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును మళ్లీ తీసుకు రావడం వెనుక రాజకీయ, సామాజిక రెండు కోణాలు ఉన్నాయి. ఒకవైపు మహిళా సాధికారతకు కట్టుబడి ఉన్నామని చెప్పుకోవడం, మరోవైపు ఎన్నికల ముందు మహిళా ఓటర్లను ఆకర్షించడమే లక్ష్యంగా కనిపించింది. అయితే, ఈ బిల్లును ఇతర రెండు కీలక బిల్లులతో కలిపి ఒకేసారి ప్రవేశ పెట్టడం ప్రభుత్వ వ్యూహంపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.

నియోజకవర్గాల పునర్విభజన అనేది అత్యంత సున్నితమైన అంశం. జనాభా ప్రాతిపదికన సీట్ల పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరుగుతుందనే భయం చాలా కాలంగా ఉంది. ఇదే సమయంలో కేంద్ర పాలిత ప్రాంతాల సీట్ల పెంపు ప్రతిపాదన కూడా రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేసే అంశంగా నిలిచింది. ఈ రెండు అంశాలు ప్రాంతీయ అసమానతలు, రాజకీయ ప్రయోజనాల చుట్టూ తిరుగుతుండగా, మహిళా రిజర్వేషన్ అనే సర్వసాధారణంగా అంగీకరించ దగిన అంశాన్ని కూడా వివాదంలోకి లాగినట్లైంది.

లోకసభలో జరిగిన ఓటింగ్ గణాంకాలను పరిశీలిస్తే, ప్రభుత్వం సాధారణ మెజార్టీని సాధించినప్పటికీ, రాజ్యాంగ సవరణకు అవసర మైన ప్రత్యేక మెజార్టీ దూరంగా ఉంది. మొత్తం హాజరైన సభ్యులలో కనీసం రెండు మూడవ వంతు అనుకూల ఓట్లు అవసరం. 528 మంది సభ్యులు ఉన్న సందర్భంలో కనీసం 352 ఓట్లు అవసరం కాగా, ప్రభుత్వం 298 ఓట్లకే పరిమితమైంది. అంటే సుమారు 54 ఓట్ల లోటుతో బిల్లు వీగిపోయింది.

ఇక్కడ ప్రధాన ప్రశ్న ఏమిటంటే... ఇది ప్రభుత్వ వ్యూహపరమైన పొరపాటా? లేక ఉద్దేశపూర్వక రాజకీయ ప్రణాళికా? విశ్లేషకుల అభిప్రాయాలు ఈ విషయంలో విభిన్నంగా ఉన్నాయి. ఒక వర్గం అభిప్రాయం ప్రకారం, ప్రభుత్వం మూడు బిల్లులను కలిపి ప్రవేశ పెట్టడం ద్వారా ప్రతిపక్షాలను చిక్కులో పెట్టాలని భావించింది. మహిళా రిజర్వేషన్‌కు వ్యతిరేకంగా ఓటు వేస్తే మహిళా వ్యతిరేకులుగా ముద్ర పడుతుంది; మిగతా బిల్లులకు అనుకూలంగా ఓటు వేస్తే తమ రాజకీయ ప్రయోజనాలు దెబ్బతింటాయి. ఈ పరిస్థితిలో ప్రతిపక్షాలు విభజితమవుతాయని ప్రభుత్వం అంచనా వేసి ఉండవచ్చు.

అయితే వాస్తవ ఫలితం వ్యతిరేకంగా వచ్చింది. ప్రతిపక్షాలు ఈ మూడు బిల్లులను వేర్వేరుగా పరిశీలించాలని డిమాండ్ చేశాయి. ముఖ్యంగా పునర్విభజన అంశంపై స్పష్టత లేకపోవడం, మహిళా రిజర్వేషన్ అమలు ఎప్పటి నుంచి అనేది తెలియక పోవడం, కొన్ని వర్గాలకు ఉప-రిజర్వేషన్ల అంశం స్పష్టంగా లేకపోవడం వంటి కారణాలు ప్రతిపక్షాలను ఒక్కటిగా నిలబెట్టాయి. ఫలితంగా వారు బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేసే నిర్ణయం తీసుకున్నారు.

ఇక్కడ మరో కీలక అంశం ప్రాంతీయ పార్టీల వైఖరి. కొన్ని ప్రాంతీయ పార్టీలు మహిళా రిజర్వేషన్‌కు మౌలికంగా అనుకూలంగానే ఉన్నప్పటికీ, పునర్విభజనతో తమ రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గుతుందనే భయంతో బిల్లును వ్యతిరేకించాయి. అంటే, మహిళా సాధికారత అనే అంశం ప్రాంతీయ రాజకీయాల కంటే తక్కువ ప్రాధాన్యత పొందినట్లు కనిపించింది.

కేంద్ర ప్రభుత్వానికి ఇది రాజకీయంగా కూడా ఒక హెచ్చరికగా భావించవచ్చు. రాజ్యాంగ సవరణలు కేవలం సంఖ్యలతో కాదు, విశ్వాసంతో ఆమోదం పొందాలి. ప్రతిపక్షాలను



సంప్రదించకుండా, విస్తృత చర్చలు లేకుండా, కీలక బిల్లులను ఒకేసారి ప్రవేశపెట్టడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది. దీనిని వ్యూహాత్మక పొరపాటు అని చెప్పడం అతిశయోక్తి కాదు.

అయితే మరో కోణంలో చూస్తే, ఇది ఒక రాజకీయ ప్రయోగంగా కూడా భావించవచ్చు. ప్రభుత్వం ఈ బిల్లులను ప్రవేశపెట్టి, ప్రతిపక్షాల అసలు వైఖరిని ప్రజల ముందు ఉంచాలని భావించి ఉండవచ్చు. మహిళా రిజర్వేషన్‌కు మద్దతు ఇస్తున్నామని చెప్పుకునే పార్టీలే చివరకు వ్యతిరేకంగా ఓటు వేసిన పరిస్థితి ప్రజల్లో చర్చకు దారి తీస్తుంది. ఎన్నికల సమయంలో ఇది ఒక ప్రధాన ప్రచార అంశంగా మారే అవకాశం ఉంది.

మొత్తానికి, లోకసభలో ఈ మూడు బిల్లులు వీగిపోవడం ఒకే సమయంలో రాజకీయ వ్యూహం, లెక్కచేసిన రిస్క్, అలాగే అమలు లోపం... కలయికగా కనిపిస్తుంది. మహిళా రిజర్వేషన్ వంటి కీలక సామాజిక సంస్కరణ మరోసారి ఆలస్యమవడం బాధాకరం. అయితే ఈ సంఘటన భవిష్యత్తులో ఇలాంటి బిల్లులను ఎలా ప్రవేశపెట్టాలి, ఎలా సమ్మతి సాధించాలి అనే విషయంలో ఒక పాఠంగా నిలుస్తుంది.

దేశ రాజకీయాలలో సంఖ్యల గణితం మాత్రమే కాదు, సమన్వయం, సమ్మతి, సమగ్ర దృక్పథం కూడా అంతే ముఖ్యమని ఈ పరిణామం స్పష్టంగా తెలియ జేస్తోంది. మహిళా రిజర్వేషన్లు అమలు కావాలంటే, అది కేవలం బిల్లుగా కాకుండా, రాజకీయ సంకల్పంగా మారాలి. లేదంటే, అది ప్రతి సారి పార్లమెంట్ గడప దాటక ముందే నిలిచిపోతూనే ఉంటుంది.

వ్యాసకర్త : సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్.

# గుడి వివాదంలో అప్పాని శ్రీనివాస్‌ను టార్గెట్ చేస్తే సహించము

## విలేఖరుల సమావేశంలో బీఎంఎస్ నాయకుల హెచ్చరిక
## గుడి కోసం క్వార్టర్ వాడులుకోవడానికి కూడా అప్పాని సిద్ధం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, ఏప్రిల్ 18 : భూపాలపల్లిలో అభయాంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణంపై నెలకొన్న వివాదంలో తమ నాయకుడు అప్పాని శ్రీనివాస్‌ను ఉద్దేశ పూర్వకంగా టార్గెట్ చేస్తున్నారని బీఎంఎస్ నేతలు ఆరోపించారు. ఆలయ నిర్మాణానికి తమ పూర్తి మద్దతు ఉందని స్పష్టం చేశారు. భూపాలపల్లి పట్టణంలోని జీఎం కార్యాలయం ఎదుట ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణంపై కొనసాగుతున్న వివాదంపై బీఎంఎస్ నాయకులు శనివారం జిల్లా కేంద్రంలోని బిఎంఎస్ కార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆలయ నిర్మాణానికి ఎలాంటి అభ్యంతరం లేకపోయినా, తమ నాయకుడు అప్పాని శ్రీనివాస్‌పై కొందరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా తప్పుడు ఆరోపణలు చేస్తూ బద్నాం చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఎంఎస్ సెంట్రల్ వర్కింగ్ ప్రెసిడెంట్ అప్పాని శ్రీనివాస్‌పై గత కొద్ది రోజులుగా అనవసర విమర్శలు, ఆరోపణలు చేస్తున్నప్పటికీ తాము సహనంతో వ్యవహరించామని తెలిపారు. ఆయన ఇంటిపై జరిగిన దాడి ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ, వివాదాన్ని మరింత పెంచకుండా ఉండాలని భావించామని చెప్పారు. భూపాలపల్లి ఏరియాలో గుడి విస్తరణ అంశాన్ని రాజకీయ రంగు పులిమి కార్మిక సంఘ నాయకుడు అప్పాని శ్రీనివాస్‌ను లక్ష్యంగా చేసుకోవడం తగదని బీఎంఎస్ నాయకులు హెచ్చరించారు. ఈ విషయంలో ఆయనపై వ్యక్తిగత దూషణలు, దాడి యత్నాలు చేయడం అనుచితమని ఖండించారు. జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట కార్ల్ మార్క్స్ రోడ్‌లో ఉన్న సి-2 క్వార్టర్ సమీపంలోని ఆంజనేయ స్వామి ఆలయ విస్తరణ సందర్భంగా, కార్మిక కుటుంబాల నివాసాలకు ఇబ్బందులు కలుగుతున్నాయని స్థానిక కార్మికులు అభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో కార్మిక సంఘాలైన ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, ఎస్సీఎంకేఎస్, బీఎంఎస్ ప్రతినిధులు కార్మిక కుటుంబాల సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని స్థానిక జీఎంకు సమర్పించినట్లు పేర్కొన్నారు. ఆ మెమోరాండంలో ఆలయ నిర్మాణం నూటికి నూరు శాతం జరగాలని, అయితే పక్కన ఉన్న కుటుంబాలకు నీడ, ఇతర సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మాత్రమే సూచించినట్లు తెలిపారు ఈ అంశాన్ని రాజకీయంగా మలుస్తూ





కొందరు నాయకులు బీఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అప్పాని శ్రీనివాస్‌ను ఏకపక్షంగా టార్గెట్ చేస్తున్నారని ఆరోపించారు. వ్యక్తిగతంగా దాడులకు పాల్పడే ప్రయత్నాలు చేయడం మంచిది కాద ని హెచ్చరించారు.

అయితే ఈ విషయాన్ని వక్రీకరించి, అప్పాని శ్రీనివాస్ ఆలయ నిర్మాణానికి అడ్డుపడుతున్నాడని ప్రచారం చేస్తూ ఆయన ఇంటి ముందు ధర్నాలు, దాడులు నిర్వహించడం అన్యాయమని విమర్శించారు. ఈ అంశంపై జీఎం కార్యాలయంలో, భూపాలపల్లి సీఐ నరేష్ సమక్షంలో జరిగిన చర్చల్లో కూడా అప్పాని శ్రీనివాస్‌కు ఎలాంటి సంబంధం లేదని స్పష్టమైందని పేర్కొన్నారు. ఏఐటీయూసీ ప్రాంత నాయకుడు మోటపలుకుల రమేష్ సైతం వ్యక్తిగత ఆరోపణలు చేయడం తప్పని అంగీకరించినట్లు తెలిపారు. భూమి ఆక్రమణ, గేటు నిర్మాణం వంటి ఆరోపణలు కూడా అసత్యమని, జీఎం అనుమతితోనే గేటు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బీఎంఎస్ కార్యాలయం నిర్మాణం కూడా అధికారుల అనుమతులతోనే జరిగిందని వివరించారు. ఆలయ నిర్మాణానికి రూ.55 లక్షల నిధులు అందనున్న నేపథ్యంలో పారదర్శకంగా పనులు చేపట్టాలని, ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం కాకుండా చూడాలని హెచ్చరించారు. ఇకపై వ్యక్తిగత ఆరోపణలు చేస్తూ దాడులకు పాల్పడితే తగిన విధంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన రాళ్ల దాడిపై పోలీసు చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు అవసరమని డిమాండ్ చేశారు. మొత్తానికి ఆలయ నిర్మాణానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని, కానీ కార్మికులకు ఇబ్బంది కలగకుండా నిర్మాణం జరగాలని మరోసారి స్పష్టం చేశారు. ఈ విలేఖరుల సమావేశంలో బిఎంఎస్ నాయకులు కోరిపెల్లి పునీత్ రావు, కేటికె.6 ఇంక్లైన్ పిట్ సెక్రటరీ, సెంట్రల్ కమిటీ మెంబెర్ పాంద్రాల మల్లేష్, సెంట్రల్ కమిటీ మెంబెర్ శ్రీనివాస్, చిట్యాల ప్రవీణ్ బ్రాంచ్ ఆర్గనైసింగ్ సెక్రటరీలు ఓరం లక్ష్మణ్, అల్లం శ్రీనివాస్, భాస్కర్, రాజు నాయక్, బిఎంఎస్ నాయకులు పాల్గొన్నారు.

# రామగుండంలో సెల్ టవర్ ఎక్కిన యువకుడు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



రామగుండం, ఏప్రిల్ 18 : రామగుండం పట్టణ బి కాలనీలో గల బిఎస్ఎన్ఎల్ టవర్ పైకి ధర్మపురిలో ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న అబ్దుల్ నయీం శనివారం ఎక్కి హల్చల్ చేశారు. సమాచారం అందుకున్న రామగుండం సిఐ ప్రవీణ్ కుమార్ ఎస్సై సంధ్యారాణి సంఘటన స్థలానికి చేరుకొని అబ్దుల్ నయీమ్‌ను ప్రశ్నించగా కొన్ని రోజులుగా తన భార్యతో గొడవలు జరుగుతున్నా యని, అది భరించలేక టవర్ ఎక్కానని సమాధానం ఇచ్చారు. దీంతో బాధితునికి సీఐ ప్రవీణ్ కుమార్ ఎస్సై సంధ్యారాణి తగిన న్యాయం చేస్తామని చెప్పడంతో టవర్ దిగి వచ్చాడు. కాగా కేసు నమోదు చేయలేదని విచారణలో ఉందని ఎస్ఐ సంధ్యారాణి తెలిపారు.



# అర్హులైన జర్నలిస్టులకే అక్రిడిటేషన్లు

## నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు
## జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, ఏప్రిల్ 18 : నిర్మల్ జిల్లాలో నిబద్ధతతో పనిచేస్తున్న నిజమైన జర్నలిస్టు లందరికీ ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేస్తామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ స్పష్టం చేశారు. నూతనంగా ఏర్పాటైన జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు శనివారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అక్రిడిటేషన్ల జారీ ప్రక్రియలో పారదర్శకతకు పెద్దపీట వేయాలని, అర్హత గల ప్రతి విలేకరికి కార్డు అందేలా చూడాల్సిన బాధ్యత జిల్లా పౌర సంబంధాల అధికారి (డిపిఆర్ఓ), కమిటీ సభ్యులపై ఉం దన్నారు. అక్రిడిటేషన్ కార్డుల మంజూరుకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన జీవోలోని మార్గదర్శకాలను కలెక్టర్ ఈ సందర్భంగా వివరించారు. ముఖ్యంగా క్రిమినల్ నేపథ్యం ఉన్న వ్యక్తులు, ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి కార్డులు జారీ చేయకూడదని ఆమె ఆదేశించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని, త్వరలోనే జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీ పూర్తిస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఇ.విష్ణువర్ధన్, కమిటీ సభ్యులు అల్వాల హనుమంతు, కొండూరి రవీందర్, అల్లం అశోక్, ఆర్.మహేందర్, ఎం.ఏ.వసీం, రామెళ్ళ రాజేశ్వర్, సిరిపురం నాగరాజు, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పైసా అభివృద్ధి చేయని ఊరుకు ఎందుకు వస్తున్నారు...?

## మంత్రి, ముఖ్యమంత్రికి మాజీ సర్పంచ్ శేఖర్ సూటి ప్రశ్న



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కాటారం, ఏప్రిల్ 19 : కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన అప్పటి నుండి ఐదు ఇందిరమ్మ ఇల్లులకు ముగ్గు పోయించలేని మంత్రి, ముఖ్యమంత్రి ఏముఖం పెట్టుకొని నస్తూరుపల్లికి వస్తున్నారని మాజీ సర్పంచ్ నిట్టూరు శేఖర్ ప్రశ్నించారు. ఈ మేరకు శనివారం ప్రకటనలో విడుదల చేసారు. నస్తూరుపల్లిలో నిర్వహించే ముఖ్యమంత్రి సభను ఉద్దేశించి మాట్లాడుతూ మీరు అధికారంలోకి వచ్చి 30 నెలలు దాటినా మా గ్రామపంచాయతీకి ఏం అభివృద్ధిచేశారని ఏముఖం పెట్టుకొని వస్తున్నారని ఎద్దేవా చేశారు. గతంలో రాష్ట్రగవర్నర్ తమిళసై సౌందర్య రాజన్ వచ్చి ఎస్టీలతో కేవలం ఫోటో దిగాలని నస్తూరుపల్లికి వచ్చి ఒక ఇద్దరు ఎస్టీలకు తాత్కాలిక నియామక పత్రాలు ఇప్పించినట్లు ఇచ్చి, ఉద్యోగాలు చేసుకోమనగా అందులో ఒక్కరిని మాత్రమే తాత్కాలిక ప్రాతిపదికన నియమించి, మరొకరిని గాలికి వదిలేశారని విమర్శించారు. అలాగే గ్రామ ప్రజలందరినీ రాజ్‌భవన్‌కు పిలిపించుకుం టానని, మీసమస్యలన్నీ విని నేరుగా నేనే పరిష్కరిస్తానని చెప్పి ఆ మాటే అప్పటి గవర్నర్ మరిచిపోయారనీ ఆవేదన వక్తం చేసారు. నస్తూరుపల్లి గ్రామంలోని, 30 ఎస్టీ కుటుంబాలకు నీ సభలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రాలు ఇప్పించడం మీ వల్ల అవుతుందాని ప్రశ్నించారు. ఈ గ్రామపంచాయితీ ఎన్నో సమస్యలతో సతమతమవు తుందని, కనీసం పంచాయితీ భవనం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి స్పందించి ఈ గ్రామ ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరుతో పాటు స్థల సేకరణ చేసి పంచాయితీ భవనం నిర్మించడంతో పాటు ఇక్కడి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేసారు.




# ధర్మపురి కో-ఆప్షన్ రాజకీయం:

# ఆశావహుల కోలాహలం... రాజకీయ చదరంగం

## హామీల భారం... పదవుల పంపకం: ధర్మపురి కాంగ్రెస్ అంతర్గత మథనం

## 15 వార్డుల గెలుపు టెక్కు... 4 పదవులకే అసలు చిక్కు!

(రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్)

ధర్మపురి మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుల ఎంపిక ప్రక్రియ ప్రస్తుతం స్థానిక రాజకీయాల్లో తీవ్రమైన చర్చకు దారితీస్తోంది. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల అనంతరం ఏర్పడిన ఈ పరిస్థితి, అధికార పార్టీకి చెందిన నాయకత్వానికి ఒక విధమైన రాజకీయ పరీక్షగా మారింది. ఎన్నికల సమయంలో తీసుకున్న వ్యూహాత్మక నిర్ణయాలు, అప్పట్లో ఇచ్చిన హామీలు, స్థానిక సమీకరణాలు... కలసి ఇప్పుడు సంక్లిష్ట సమీకరణాలుగా మారి, నాలుగు కో-ఆప్షన్ సభ్యుల ఎంపికను అత్యంత క్లిష్టంగా నిలబెట్టాయి. ఈ పరిణామాలను పరిశీలిస్తే, ధర్మపురి పట్టణ రాజకీయాల లోతైన వాస్తవాలు, నాయకత్వ నైపుణ్యం, పార్టీ అంతర్గత సవాళ్లు స్పష్టంగా బయటపడు తున్నాయి.

మున్సిపల్ ఎన్నికల సమయంలో ధర్మపురి పట్టణ పరిధిలోని 15 వార్డులకు గాను భారీగా ఆశావహులు పోటీపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి చాలా కాలంగా స్థానికంగా అధికారంలో లేని నేపథ్యంలో, ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. పదుల సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు టిక్కెట్ల కోసం పోటీపడ్డారు. ముఖ్యంగా పార్టీకి కష్టకాలంలో అండగా నిలిచిన సీనియర్లు, కేడర్‌కు చెందిన నాయకులు తమకు అవకాశం ఇవ్వాలని పట్టుబట్టారు. ఈ నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌పై తీవ్ర ఒత్తిడి నెలకొంది. ప్రతి వర్గానికీ న్యాయం చేయాలనే ప్రయత్నంలో, ఆయన అనేక సమీకరణాలను పరిగణలోకి తీసుకుని అభ్యర్థుల ఎంపిక చేపట్టారు.

అయితే ఈ ప్రక్రియలో ఒక కీలక వ్యూహం అమలు చేశారు. ప్రత్యర్థి బీఆర్ఎస్‌కు చెందిన సిట్టింగ్ ప్రజాప్రతినిధులను పార్టీలోకి ఆహ్వానించి, వారిని అభ్యర్థులుగా నిలబెట్టడం ద్వారా గెలుపు అవకాశాలను బలోపేతం చేశారు. ఇది రాజకీయంగా వ్యూహాత్మక నిర్ణయం కావడంతో పాటు, కొంతమంది సొంత పార్టీ కార్యకర్తల్లో అసంతృప్తికి దారితీసింది. అయినప్పటికీ, ఈ వ్యూహం ఫలితాన్నిచ్చింది. ధర్మపురి మున్సిపాలిటీలో 15కు 15 సీట్లను గెలుచుకోవడం ద్వారా కాంగ్రెస్ పార్టీ చరిత్రాత్మక విజయాన్ని సాధించింది. ఈ విజయంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నుంచి ప్రశంసలు అందుకోవడం, మంత్రి లక్ష్మణ్ కుమార్‌కు వ్యక్తిగతంగా కూడా ప్రతిష్ఠను తెచ్చింది.

కానీ ఈ విజయానికి పునాది అయిన హామీలు ఇప్పుడు భారంగా మారాయి. టిక్కెట్లు ఇవ్వలేకపోయిన అనేక మంది ఆశావహులను సమర్థంగా ఒప్పించడానికి, వారికి భవిష్యత్తులో నామినేటెడ్ పదవులు, కో-ఆప్షన్ సభ్యత్వాలు ఇస్తామని హామీలు ఇచ్చారు. ఇదే సమయంలో స్థానికంగా ప్రభావం ఉన్న నాయకులు కూడా తమ అనుచరులకు ఈ పదవులు ఇప్పిస్తామని మాట ఇచ్చారు. ఎన్నికల వేళ ఇచ్చిన ఈ హామీలు, అప్పట్లో పార్టీ ఐక్యతకు దోహదపడినా, ఇప్పుడు నిర్ణయ ప్రక్రియను క్లిష్టతరం చేస్తున్నాయి.

ప్రస్తుతం కో-ఆప్షన్ సభ్యుల ఎంపిక ప్రక్రియలో నాలుగు స్థానాలకు గాను 16 మంది అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయడం పరిస్థితిని మరింత గందరగోళంగా మార్చింది. వీరిలో చాలా మంది మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీకి నిబద్ధతతో పనిచేసిన నాయకులు, సామాజికంగా ప్రభావం కలిగిన వ్యక్తులు ఉన్నారు. అందరూ తమ తమ వాదనలు వినిపిస్తూ, తమకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ఎవ్వరినీ నిరాశ పరచకుండా, సమతుల్యంగా నిర్ణయం తీసుకోవడం పార్టీ నాయకత్వానికి పెద్ద సవాలుగా మారింది.

కో-ఆప్షన్ సభ్యుల ఎంపికలో కొన్ని నియమాలు, సామాజిక సమీకరణాలు కూడా కీలక పాత్ర పోషిస్తున్నాయి. నాలుగు స్థానాల్లో రెండు మైనారిటీలకు, రెండు ఇతర వర్గాలకు ఇవ్వాల్సి ఉండటం, అలాగే అందులో కనీసం రెండు స్థానాలు మహిళలకు కేటాయించాల్సిన అవసరం ఉంది. ఈ పరిమితులు ఉన్నప్పుడు, అభ్యర్థుల ఎంపిక మరింత సంక్లిష్టంగా మారుతుంది. ప్రతి వర్గం తమకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతూ, రాజకీయ ఒత్తిడిని పెంచుతోంది. దీనివల్ల నాయకత్వానికి సమతుల్యత పాటించడం కష్టతర మవుతోంది.

ప్రస్తుత పరిస్థితుల్లో ఆశావహులు ... కాంగ్రెస్ సీనియర్ నేత, ఇటీవలే జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దినేష్ సంగన భట్ల, గత మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ గా ఉన్న, ప్రస్తుతం మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మిలను ప్రభావితం చేసి, ప్రసన్నం చేసుకునే ప్రయత్నంలో ఉన్నారు.

ఇక ఈ ప్రక్రియలో మున్సిపల్ చైర్‌పర్సన్ పాత్ర అత్యంత కీలకంగా మారింది. చట్టపరంగా, రాజకీయంగా కూడా చైర్‌పర్సన్ అభిప్రాయం నిర్ణయంలో ప్రభావం చూపగలదు. అందుకే ఆశావహులంతా చైర్‌పర్సన్ చుట్టూ తిరుగుతూ, తమ అభ్యర్థనలను వినిపిస్తున్నారు. ఇది ఒకవైపు రాజకీయ చురుకుదనాన్ని సూచిస్తే, మరోవైపు అంతర్గత పోటీ తీవ్రతను కూడా ప్రతిబింబిస్తోంది.

ఈ పరిణామాల నేపథ్యంలో మంత్రి లక్ష్మణ్ కుమార్‌కు ఇది ఒక కీలక పరీక్షగా మారింది. ఎన్నికల సమయంలో చూపిన వ్యూహాత్మక నైపుణ్యాన్ని ఇప్పుడు సమతుల్య నిర్ణయాల్లో కూడా చూపించాల్సిన అవసరం ఉంది. ఒకవైపు పార్టీకి నిబద్ధతతో పనిచేసిన వారిని గౌరవించాల్సి ఉంది; మరోవైపు బలమైన నేతలను, గత ఎన్నికలలో సహకరించిన వారిని, సామాజిక సమీకరణాలను పాటించాల్సి ఉంది; మరోవైపు భవిష్యత్తులో పార్టీ ఐక్యత దెబ్బతినకుండా జాగ్రత్త పడాల్సి ఉంది. ఈ మూడు అంశాల మధ్య సమతుల్యత సాధించడం నాయకత్వానికి నిజమైన సవాలు.

ఇది కేవలం నాలుగు పదవుల ఎంపిక మాత్రమే కాదు; ఇది పార్టీ అంతర్గత ప్రజాస్వామ్యానికి, నాయకత్వ నైపుణ్యానికి ఒక అద్దం పట్టే సందర్భం. సరైన నిర్ణయం తీసుకుంటే పార్టీ బలోపేతం అవుతుంది; లేకపోతే అసంతృప్తి పెరిగి, భవిష్యత్తులో రాజకీయ ప్రతికూలతలకు దారితీసే అవకాశం ఉంది. ముఖ్యంగా స్థానిక సంస్థల్లో ఏర్పడే అసంతృప్తి, పెద్ద రాజకీయ సమీకరణాలపై కూడా ప్రభావం చూపగలదు.

ధర్మపురి మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుల ఎంపిక ఒక సాధారణ పరిపాలనా ప్రక్రియగా కనిపించినా, దాని వెనుక ఉన్న రాజకీయ వాస్తవాలు, హామీల భారాలు, సామాజిక సమీకరణాలు... కలసి దీనిని ఒక క్లిష్టమైన రాజకీయ సమీకరణంగా మార్చాయి. ఈ సవాల్‌ను నాయకత్వం ఎలా ఎదుర్కొంటుందో అనేదే భవిష్యత్తు రాజకీయ దిశను నిర్ణయించగల అంశంగా మారింది.


# సంక్షేమ వారోత్సవాలు సమర్ధవంతంగా నిర్వహించాలి

## రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, ఏప్రిల్ 18 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా ఈ నెల 20వ నుండి, 26 వరకు 7 రోజుల పాటు సంక్షేమ వారాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, పలు శాఖల అధికారులతో సంక్షేమ వారం నిర్వహణపై సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా ఈ నెల 20వ తేదీ నుండి 26వ తేదీ వరకు ప్రభుత్వ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాలు, విద్యాలయాలలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని తెలిపారు. విద్యార్థులకు క్విజ్, పెయింటింగ్ లాంటి పోటీలు నిర్వహించాలని పేర్కొన్నారు. వసతి గృహాలలో మరమ్మత్తు పనులను చేపట్టాలని తెలిపారు. ప్రత్యేక నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని, వేసవి శిబిరం, బడిబాట కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. రైతు రిజిస్ట్రేషన్ వంద శాతం పూర్తి చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, కలెక్టరేట్లోని సమావేశ మందిరం నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాపాలన-ప్రగతి-ప్రణాళిక కార్యాచరణలో ఈనెల 20వ తేదీ నుండి 26వ తేదీ వరకు 7 రోజుల పాటు ప్రజా భాగంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలోని ఎస్సి, ఎస్టి, బిసి, మైనారిటీ గురుకులాలలో, వసతి గృహాలలో పారిశుధ్యం, మరమ్మత్తు పనులు చేపడుతామని తెలిపారు. విద్యార్థులకు వివిధ విభాగాలలో పోటీలు నిర్వహిస్తామని పేర్కొ న్నారు. ప్రత్యేక





నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. వేసవి శిబిరాలు, బడిబాట కార్యక్రమాలను జిల్లాలో అధికారుల సమన్వయంతో పకడ్బందీగా చేపడతామని, రైతుల రిజిస్ట్రేషన్ వంద శాతం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, సిపిఓ జీవరత్నం, జిల్లా సంక్షేమ అధికారి వినూత్న, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులు దయానంద్, అంబాజీ, శ్రీనివాస్, మోహన్ సింగ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, డీఈవో భోజన్న, జెడ్పి సీఈవో భాగ్యలక్ష్మి, డిఎంహెచ్వో రాజేందర్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.





# వేసవి నుండి ఉపశమనం

## అంబలి పంపిణీ ప్రారంభించిన డిసిసిఆత్రం సుగుణ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, ఏప్రిల్ 18 : తీవ్రమైన ఎండల నుండి ఉపశమనం పొందేందుకు అంబలి ఎంతగానో ఉపయోగపడుతుందని, డిసిసి జిల్లా అధ్యక్షురాలు ఆత్రం సుగుణ అన్నారు. ఆసిఫాబాద్ పట్టణంలో ఉబెద్ ఫౌండేషన్ చైర్మన్, డీసీసీ ఉపాధ్యక్షుడు తారిక్ ఆధ్వర్యంలో అంబలి పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ ముఖ్య అతిథిగా హాజరై, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సుగుణ మాట్లాడుతూ జిల్లా కేంద్రం కావడంతో వివిధ మండలాల నుండి పనుల నిమిత్తం వచ్చే గ్రామీణ ప్రజలకు ఈ అంబలి పంపిణీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా ఎండాకాలంలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో అంబలి వంటి పానీయం శరీరానికి చల్లదనాన్ని అందించి ఆరోగ్యాన్ని కాపాడు తుందని పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మానవతా విలువలను పెంపొందిస్తాయని, అవసరమైన చోట ప్రజలకు అండగా నిలబడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమె అన్నారు. ఫౌండేషన్ చేస్తున్న ఈ సేవా కార్యక్రమాన్ని సుగుణ అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, ఫౌండేషన్ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

# తేజస్వీ సూర్య క్షమాపణ చెప్పాలి



## డిసిసి అధ్యక్షురాలు ఆత్రం సుగుణ

## మహిళా బిల్లు అమలులో కేంద్రం అలసత్వం

## మోదీపై సుగుణ ఘాటు విమర్శలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)


ఆసిఫాబాద్, ఏప్రిల్ 18 : తెలంగాణ తల్లి మనోభావాలను దెబ్బతీసేలా, అమరుల త్యాగాలను అవమానించేలా బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య లోక్‌సభలో చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, కుమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తేజస్వి సూర్య వ్యాఖ్యలకు నిరసనగా శనివారం ఆసిఫాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి ఆయన చిత్రపటంతో ఉన్న ఫ్లెక్సీని దగ్ధం చేశారు. అనంతరం డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సుగుణ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును అవహేళన చేస్తూ మాట్లాడితే సహించబోమని, ఇటువంటి వ్యాఖ్యలు పునరావృతమైతే తీవ్రంగా ప్రతిఘటిస్తామని ఆమె హెచ్చరించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచేలా తేజస్వి సూర్య వ్యాఖ్యానిస్తుండగా, బీజేపీకి చెందిన తెలంగాణ ఎంపీలు, కేంద్ర మంత్రులు మౌనం వహించడం దురదృష్టకరమని విమర్శించారు. ధనబలం, అధికార బలంతో లోక్‌సభకు చేరిన కొందరు బీజేపీ ఎంపీలకు కనీస అవగాహన లేదని, అలాంటి వారికి వారి పార్టీ అయినా బాధ్యత నేర్పాలని వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భారత్-పాక్ విభజనతో పోల్చడం అత్యంత దుర్మార్గమైన వ్యాఖ్యగా అభివర్ణించారు. ఇలాంటి వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన తేజస్వి సూర్యపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో ప్రధాని నరేంద్ర మోదీ విభజనపై విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసిన సందర్భాలు ఉన్నాయని, అదే భావజాల ప్రభావమే ఇప్పుడు తేజస్వి సూర్య మాటల్లో ప్రతిబింబిస్తోందని విమర్శించారు. తెలంగాణ బీజేపీ ఎంపీలకు పౌరుషముంటే ఈ వ్యాఖ్యలను బహిరంగంగా ఖండించాలని ఆమె సవాల్ విసిరారు.

అదేవిధంగా మహిళా బిల్లుపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సుగుణ విమర్శించారు. దేశ సంపదను అదాని, అంబానీ వంటి కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతున్న విషయం ప్రధాని మోదీకి బాగా తెలుసని, ఆయనకు తల్లి, భార్య ఉన్న వారిని చూసుకునే సంస్కారం కూడా లేదని విమర్శిస్తూ, అలాంటి నాయకత్వానికి మహిళల సాధికారత అంటే ఏమిటో తెలియదని మండిపడ్డారు. మహిళలకు తగిన ప్రాతినిధ్యం కల్పించే విషయంలో కేంద్రం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని, డి లిమిటేషన్ తో సంబంధం లేకుండా మహిళా బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. మహిళా సాధికారతకు కట్టుబడి ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ మహిళల హక్కుల కోసం పోరాడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కౌన్సిలర్లు, డిసిసి కార్యవర్గ సభ్యులు, వివిధ మండలాల నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి పాటుపడుతూ మరిన్ని అవార్డులు అందుకోవాలి

## సోనేరావు ను అభినందించిన ఎస్సీ , ఎస్టీ రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



అదిలాబాద్ ఏప్రిల్ 18 : ఈ నెల 14న హైదరా బాద్ లోని రవీంద్ర బాలాజీలో నిర్వ హించిన జయంతి వేడుకల ఉత్సవాలలో రాష్ట్ర ఆధ్వర్యంలోని పలువురు దళితరత్న అవార్డుకు ఎంపికయ్యారు అందులో అత్యంత వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లా పివిటి జి తేవు చెందిన ఆదిమ గిరిజన కోలం సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సోనేరావు ఈ అవార్డుకు ఎంపికయ్యారు. దీంతో ఎస్సీ ఎస్టీ రాష్ట్ర శాఖ మంత్రి క్యాంపు కార్యాలయం నుండి ఆహ్వానం అందడంతో శనివారం జగిత్యాల్ జిల్లాలోని మంత్రి దళిత రత్న అవార్డులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా సోనేరావు మాట్లాడుతూ జిల్లాలోని పలువురు కొలాం తెగకు చెందిన లబ్ధిదారులకు ఇండ్లు మంజూరయ్యాయని అధికారులు సైతం ఇండ్ల నిర్మాణానికి కృషి చేశారన్నారు. ప్రస్తుతం వాటి నిర్మాణాలను చేయించకుండా కోర్ ఏరియా పేరుతో ఆటవి శాఖ అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ విషయంలో పలు ఉద్య మాలు చేయడంతో పాటు రాష్ట్ర, కేంద్ర మంత్రులకు కలవడంతో పాటు రాష్ట్ర, జాతీయ ఎస్సీ, ఎస్టీ, కమిమిషన్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు అయినప్పటికీ సమస్యలు పరిష్కారం లభించకపోవడంతో ప్రస్తుతం నివాసం ఉండేందుకు ఇల్లు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారు ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకువెళ్లడంతో పాటు కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం అయ్యేలా తీసుకోవాలని మంత్రి కోవడం జరిగిందని సోమరాజు తెలిపారు సానుకూలంగా మంత్రి స్పందించి కి తీసుకువెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తారని హామీ ఇచ్చారు అలాగే త్వరలో ఉట్నూర్ లో భారీ బహిరంగ సభ చేయాలని తనే స్వయంగా సభకు హాజరవుతనాని తెలిపినట్లు పేర్కొన్నారు ఆతనితో మాదిగ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంఘం ఉపాధ్యక్షుడు తదితరులు ఉన్నారు.




# మహిళల భద్రత అందరి బాధ్యత

## మంచిర్యాల షీ టీమ్ ఇంచార్జి ఎస్ఐ హైమ

(ప్రజాలక్ష్యం బ్యూరో)

మంచిర్యాల, ఏప్రిల్ 18 : మహిళల భద్రత కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాకుండా సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని మంచిర్యాల జిల్లా షీ టీమ్ ఇంచార్జి ఎస్.ఐ. హైమ పేర్కొన్నారు. మహిళలపై వేధింపుల నివారణ లక్ష్యంగా షీ టీమ్స్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని హాజీపూర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన గుడిపేట గ్రామంలోని రైతు వేదికలో, మంచిర్యాల మరియు ఆసిఫాబాద్ జిల్లాల ఎరువుల డీలర్లకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్స్ పాత్ర, మహిళల భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళలపై బహిరంగ ప్రదేశాలు, పని ప్రదేశాల్లో జరిగే ఈవ్‌టీజింగ్, అసభ్య ప్రవర్తనను అరికట్టడంలో షీ టీమ్స్ కీలక పాత్ర పోషిస్తున్నాయని షీ టీమ్ సిబ్బంది వివరించారు. ఎరువుల దుకాణాలకు వచ్చే మహిళా రైతులతో గౌరవంగా ప్రవర్తించాలని, ఎవరైనా వేధింపులకు పాల్పడితే వెంటనే స్పందించాలని డీలర్లకు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 లేదా 112 కు ఫోన్ చేయాలని, అలాగే రామగుండం షీ టీమ్ వాట్సాప్ నంబర్ 6303923700, మంచిర్యాల షీ టీమ్ నంబర్ 8712659385లను గుర్తుంచుకోవాలని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న డయల్-112 సేవలు పోలీస్, అగ్నిమాపక, వైద్య, మహిళల రక్షణ వంటి విభాగాలను ఒకే నంబర్ ద్వారా అనుసంధానం చేసి వేగవంతమైన సహాయం అందిస్తున్నాయని పేర్కొన్నారు. అదేవిధంగా మహిళల భద్రత కోసం రూపొందించిన టి-సేఫ్ (ం-ఞుటవ) యాప్ ను మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకుని, అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ అసిస్టెంట్ సీనియర్ ప్రొఫెసర్ సి. చీరాలు, ఫెసిలిటేటర్ శశిధర్, షీ టీమ్ సిబ్బంది కానిస్టేబుల్ సతీష్, మహిళా కానిస్టేబుల్లు జ్యోతి, వనితలతో పాటు మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాలకు చెందిన ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.



# తెలంగాణ ఆత్మగౌరవం దెబ్బతీసిన తేజస్వీసూర్య

మొదటి పేజీ తరువాయి

తెలిపారు. ఎంపీ తప్పు మాట్లాడితే.. క్షమాపణ చెప్పాల్సింది పోయి వెనుకేసుకుని వస్తున్నారని మండిపడ్డారు. లోక్ సభలో బీఆర్ఎస్ ఎంపీలు లేని లోటు తెలుస్తోందన్నారు. బీజేపీ ఎంపీ వ్యాఖ్యలపై కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు పెదవులు మూసుకుని కూర్చున్నారని మండిపడ్డారు. తేజస్వి సూర్య మూతి పగిలే సమాధానం చెప్పలేకపోయారని అన్నారు. తెలంగాణ ప్రజల మనోభావాలను గాయపరిచారన్నారు. మహిళా బిల్లు విషయంలో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు నాటకామాడుతున్నాయని విమర్శించారు. ఎంపీ తేజస్వి యాదవ్ వ్యాఖ్యలను సీఎం రేవంత్ ఇప్పటి వరకు ఖండించలేదని,రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం రాబోతుందని, దానికి నిదర్శనం బీఆర్ఎస్‌లో జీవన్ రెడ్డి చేరిక అని స్పష్టం చేశారు. రాజకీయల్లో విలువలతో కూడిన రాజకీయం చేసిన వ్యక్తి జీవన్ రెడ్డి అని కొనియాడారు.మహిళా బిల్లును డీలిమిటేషన్‌తో ఎందుకు ముడి పెట్టారని ప్రశ్నించారు. మెజారిటీ లేకున్నా బిల్లు పెడతారా అని నిలదీస్తూ.. రాజకీయం కోసమే బిల్లు ప్రవేశపెట్టారని మాజీ మంత్రి హరీశ్ రావు వ్యాఖ్యలు చేశారు. మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు టి.జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరబోతున్న సందర్భంగా జిల్లాలో పండుగ వాతావరణం కనిపిస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ నెల 20న జగిత్యాలలో జరగనున్న కేసీఆర్ ' ప్రజా ఆశీర్వాద సభ' ఏర్పాట్లను మాజీ మంత్రి హరీష్‌రావు, కొప్పుల ఈశ్వర్ , ఎమ్మెల్సీ రమణ, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తదితరులతో కలిసి పరిశీలించారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో రాజకీయ పునారేకీకరణ జరుగుతుందని వెల్లడించారు. జగిత్యాల నుంచి బీఆర్ఎస్ జైత్రయాత్ర ప్రారంభం అవుతుందని, జగిత్యాల నుంచి బీఆర్ఎస్ పార్టీకి పూర్వ వైభవం వస్తుందని దీమాను వ్యక్తం చేశారు.కేసీఆర్ బయటకు వస్తే గుంట నక్కలు బయపడుతున్నాయని పేర్కొన్నారు.కేసీఆర్ జగిత్యాలలో సభ ఉంటే మేడి గడ్డలో రేవంత్ సభ ఏర్పాటు చేసుకున్నాడని విమర్శించారు. రేవంత్ హైట్‌లో చిన్న అనుకున్న. కానీ రేవంత్‌ది చిన్న మెదడని, ఇక్కడ ఉన్న ఎమ్మెల్యే హై బ్రిడ్, క్రాస్ బ్రిడ్ ఎమ్మెల్యేనా అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసిన కేసీఆర్ సభ విజయవంతమవుతుందని, కేసీఆర్ సీఎం కావడం ఖాయమని అన్నారు. ఈనెల 20న కేసీఆర్ సాయంత్రం 5,30 నిముషాలకు చేరుకుంటారని వివరించారు. సుమరు గంట సేపు కేసీఆర్ సభ ఉంటుందని కేటీఆర్ వెల్లడించారు.

# పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు

## రెండు వాణిజ్య నౌకలపై ఇరాన్ సైన్యం కాల్పులు

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

టెహ్రాన్, ఏప్రిల్ 18 : పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. నౌకా దిగ్బంధనం కొనసాగుతుందని ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో ఇరాన్ మళ్లీ హోర్ముజ్ జలసంధిని మూసేసింది. తాజాగా హోర్ముజ్‌లో ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకలపై కాల్పులు జరిగినట్లు వార్తలు వస్తున్నాయి. రెండు వాణిజ్య నౌకలపై ఇరాన్ సైన్యం కాల్పులకు పాల్పడినట్టు అంతర్జాతీయ మీడియా పేర్కొంది. వాటిల్లో భారత జెండా ఉన్న ట్యాంకర్ ఒకటి ఉన్నట్టు సమాచారం. హోర్ముజ్ జలసంధి గుండా వెళ్తున్న రెండు వాణిజ్య నౌకలపై ఐఆర్‌జీసీకి చెందిన ఇరాన్ గన్‌బోట్లు కాల్పులు జరిపాయి. అయితే ఈ దాడిలో ట్యాంకర్లు, వాటిల్లోని సిబ్బంది సురక్షితంగానే ఉన్నారని సమాచారం. ఈ నేపథ్యంలో భారత్‌కు చెందిన మరో రెండు నౌకలను దారి మళ్లించినట్టు 'ట్యాంకర్ ట్రాకర్స్' తెలిపింది. ఇరాక్ నుంచి రెండు మిలియన్ బ్యారెళ్ల ముడి చమురును భారత్‌కు తీసుకొస్తున్న ట్యాంకర్లు హోర్ముజ్ జలసంధి నుంచి వెనక్కి మళ్లినట్టు సమాచారం. కాగా, అమెరికాతో చర్చల సందర్భంగా హోర్ముజ్ జలసంధిని పూర్తిగా తెరుస్తున్నట్టు శుక్రవారం ఇరాన్ ప్రకటించింది.

# రేవంత్ దేశ ప్రజలను ఏకం చేశారు

మొదటి పేజీ తరువాయి

మంత్రులకు సీఎం రేవంత్ వినతిపత్రం ఇచ్చారు. ఎప్పటికీ మేమే అధికారంలో ఉంటామని కళలు కన్నారు. మా మామ తర్వాత నేను సీఎం అవుతా లేకపోతే మా కుటుంబ సభ్యులు అవుతారని హరీశ్ రావు భావించారు' అంటూ వ్యాఖ్యలు చేశారు. గతంలో హరీశ్ రావు వేరే పార్టీల నాయకుల ఇళ్లకు వెళ్లలేదా అని ఎంపీ ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి హైబ్రిడ్ విధానం క్రాస్ బీడ్ అంటున్న హరీశ్ రావు... అసలు బీఆర్ఎస్ విధానం క్రాస్ బీడ్ అంటూ వ్యాఖ్యానించారు. క్రాస్ ఓటింగ్ చేసి తెలంగాణలో 8 మంది బీజేపీ ఎంపీలను బీఆర్ఎస్ గెలిపించిందని విమర్శించారు. కాంగ్రెస్‌ను ఓడించాలని బీఆర్ఎస్ అవయవదానం చేసి బీజేపీని గెలిపించిందని ఆరోపించారు. బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణపై చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు మాట్లాడారని ఎంపీ తెలిపారు. తాను స్వయంగా స్పీకర్ వద్ద సమయం తీసుకుని వెళ్లి తేజస్వి సూర్య వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేసినట్లు చెప్పారు. పార్లమెంట్ మకర్ ద్వార్ వద్ద ఆందోళన చేశామని... స్పీకర్‌ను కలిసి తేజస్వి సూర్యపై ఫిర్యాదు చేశామని తెలిపారు. రేవంత్ రెడ్డి మళ్లీ, మళ్లీ ఉండాలి... కేసీఆర్ ఎప్పటికీ ఫామ్ హౌస్‌కు పరిమితం కావాలని తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నారన్నారు. గత బీఆర్ఎస్ పాలన చరిత్ర తెలంగాణ ప్రజలకు తెలుసని.. మీ కుటుంబ పాలనతో తెలంగాణకు ఎప్పటికీ మర్చిపోలేని గాయం అయిందంటూ ఎంపీ చామల కిరణ్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# మహిళా బిల్లును అడ్డుకోవడం దురదృష్టకరం

మొదటి పేజీ తరువాయి

పార్టీలతో తాము మాట్లాడామని కిషన్‌రెడ్డి ప్రస్తావించారు. లోక్‌సభలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి వాళ్లకు తెలియజేసే ప్రయత్నం చేశామని తెలిపారు. ఈ బిల్లులపై కేంద్ర ప్రభుత్వం స్పష్టంగా ఒక పార్టీకి సంబంధించిన అంశం కాదని చెప్పిందని అన్నారు. ఇండియా కూటమి నేతలు కుట్ర చేసి మహిళా రిజర్వేషన్ బిల్లు, నియోజకవర్గాల బిల్లును అడ్డుకున్నారని ఆగ్రహించారు. కాంగ్రెస్ అనేకసార్లు మహిళా రిజర్వేషన్ బిల్లులో ద్వంద్వ వైఖరి అవలంబించిందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ఇప్పటి వరకు 7 సార్లు బిల్లు పాస్ కాకుండా అడ్డుకుందని కిషన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ‍ుయోజకవర్గాల పునర్విభజన జరగాలని గతంలో చేసిన చట్టంలోనే ఉందని, దక్షిణాది రాష్ట్రాలకు న్యాయం జరిగేలా మంచి ఫార్ములాను మోదీ తీసుకొచ్చారని అన్నారు. కానీ, 131వ రాజ్యాంగ సవరణ బిల్లును అడ్డుకొని కాంగ్రెస్ పార్టీ చారిత్రక తప్పిదం చేసిందన్నారు. వరుసగా ఎన్నికల్లో ఓడిపోతున్నామనే నిరాశ, నిస్పృహ కాంగ్రెస్‌లో కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. మహిళలు, దక్షిణాది రాష్ట్రాలకు మేలు జరిగే బిల్లును అడ్డుకొని విపక్షాలు తప్పు చేశాయన్నారు. రాజకీయాల్లోకి రావాలనుకునే మహిళల ఉత్సాహంపై నీళ్లు చల్లారు. సర్జికల్ స్ట్రైక్స్, ఆపరేషన్ సిందూర్‌ను కూడా అవమానించేలా రాహుల్ గాంధీ మాట్లాడారు. ప్రధాని మోదీని జాదుగర్ అంటూ అవమానించారని కిషన్‌రెడ్డి మండిపడ్డారు.

# దేశవ్యాప్తంగా మహిళలను ఏకం చేస్తాం

మొదటి పేజీ తరువాయి

చట్టసభలకు రాకుండా అడ్డుకున్నారు. దక్షిణాదికి అన్యాయం జరగదని చెప్పినా సాంకేతిక కారణాలతో మహిళా బిల్లును అడ్డుకున్నారు. దేశవ్యాప్తంగా మహిళలను ఏకం చేసి కాంగ్రెస్, విపక్షాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తాం. డీలిమిటేషన్, 131వ రాజ్యాంగ సవరణ బిల్లుల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపాదనను ఒక్క ఎంపీ కూడా పార్లమెంట్‌లో ప్రస్తావించలేదని లక్ష్మణ్ అన్నారు.

# హర్మ్యూజ్‌పై మళ్లీ పీటముడి

## మూసేస్తున్నట్లు ఇరాన్ ప్రకటన

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

టెహ్రాన్, ఏప్రిల్ 18 : పశ్చిమాసియాలో పరిస్థితులు మళ్లీ ఉద్రిక్తంగా మారుతున్నాయి. హోర్ముజ్ జలసంధి తెరుచుకుందనే ఆనందం 24 గంటలు కూడా నిలవలేదు. మళ్లీ హోర్ముజ్ జలసంధిని మూసేస్తున్నట్టు ఇరాన్ ప్రకటించింది. అమెరికా తమ నౌకలపై విధించిన సముద్ర నిర్బంధం కొనసాగు తుండడమే ఇందుకు కారణమని టెహ్రాన్ పేర్కొంది. హోర్ముజ్‌పై కట్టుదిట్టమైన నియంత్రణ విధించినట్లు ప్రకటించింది. అమెరికా తన నిర్బంధాన్ని ఎత్తివేయకపోతే జలసంధి పూర్తిగా తెరవబోమని ఇరాన్ తేల్చి చెప్పింది. హోర్ముజ్‌ను తెరిచినప్పటికీ ఇరాన్ నౌకలపై తమ దిగ్బంధనం కొనసాగుతుందని ట్రంప్ ప్రకటించడం ఉద్రిక్తతలను పెంచింది. హోర్ముజ్ జలసంధి గురించి, శాంతి ఒప్పందం గురించి ట్రంప్ సోషల్ మీడియాలో చేస్తున్న పోస్టలన్నీ అబద్ధాలేనని, దౌత్య చర్చలపై ముందుకు సాగుతుండగా ఇలాంటి తప్పుడు సమచారాన్ని ఇరాన్ అంగీకరించదని ఆ దేశ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ ఘాలిబఫ్ పేర్కొన్నారు. కాగా, అమెరికా-ఇరాన్ మధ్య ఏప్రిల్ 20న రెండో దఫా శాంతి చర్చలు జరగబోతున్నట్టు వార్తలు వస్తున్నాయి. పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్ వేదికగానే ఇవి జరగబోతున్నట్టు ఇరాన్ మీడియా పేర్కొంటోంది. అయితే ఈ శాంతి చర్చలు వేదిక, తేదీ గురించి అమెరికా ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. ఈ క్రమంలో హర్మ్యూజ్ జలసంధిని తెరుస్తామని ప్రకటించిన ఇరాన్ మళ్లీ ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. శనివారం తాజాగా మళ్లీ మూసివేస్తున్నట్లు ప్రకటించింది. ఇరాన్ ఓడరేవులపై అమెరికా దిగ్బందనం ఉన్నంత వరకు హర్మ్యూజ్ జలసంధిని మూసివేసి రవాణాను అడ్డుకుంటామని ఇరాన్ అమెరికాను హెచ్చరించింది. అమెరికాతో ఇరాన్ అణు ఒప్పందానికి వచ్చే వరకు ఈ జలసంధి దిగ్బంధనం కొనసాగుతుందని ట్రంప్ ప్రకటించిన కొన్ని గంటల్లోనే ఇరాన్ హర్మ్యూజ్‌ని మూసివేస్తున్నట్లు ప్రకటించింది.కాగా, ట్రంప్ శనివారం 'కొన్ని మంచి వార్తలున్నాయని చెప్పుకొచ్చారు. బుధవారంలోగా ఒప్పందం కుదరకపోతే యుద్ధంలో కాల్పుల విరమణను పొడిగించకపోవచ్చని ఆయన అన్నారు. ట్రంప్ వ్యాఖ్యల అనంతరం ఇరాన్ ఈ నిర్ణయం తీసుకుంది.

# భూముల మార్కెట్ విలువ పెంచే ప్రతిపాదన

మొదటి పేజీ తరువాయి

వెల్లడించారు. చిట్‌చాట్‌లో పలు కీలక అంశాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. భూముల ధరల పెంపు, రిజిస్ట్రేషన్ విధానంలో మార్పులు, రెవెన్యూ పాలసీ వంటి విషయాలపై స్పష్టత ఇచ్చారు. మంత్రి మాట్లాడుతూ, భూముల రిజిస్ట్రేషన్‌ను మ్యాప్‌తో అనుసంధానం చేస్తూ ఈ నెల 20వ తేదీ నుంచి కొత్త విధానం ప్రారంభమవుతుందని చెప్పారు. మ్యాప్‌తో కూడిన తొలి రిజిస్ట్రేషన్ పాలేరు ప్రాంతంలో ప్రారంభం కానుందని తెలిపారు. నామినేటెడ్ పోస్టుల భర్తీ కూడా త్వరలోనే చేపడతామని పేర్కొన్నారు. సమ్మర్ తర్వాత జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు జరిగే అవకాశముందని ఆయన తెలిపారు. అసైన్డ్ భూములపై వచ్చిన ఫిర్యాదులను త్వరలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇప్పటికే నాలుగు రకాల ఫిర్యాదులను గుర్తించి వాటి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు ఇచ్చామని వెల్లడించారు. ఏ శాఖ ఎవరికీ శాశ్వతం కాదని, శాఖలపై ఆశలు పెట్టుకోవడం సహజమని మంత్రి వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో తనపై ప్రతిపక్షం విమర్శలు చేసినప్పుడు ఇతర మంత్రులు తనకు మద్దతుగా నిలిచారని తెలిపారు. ప్రతిపక్షం ట్రాప్‌లో పడకుండా ఓపికగా సమాధానాలు ఇచ్చానని అన్నారు. ఇక బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలపై లిస్ట్ తయారు అవుతోందని, సరైన సమయంలో అన్ని విషయాలు బయటకు వస్తాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

# తెలంగాణలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

మొదటి పేజీ తరువాయి

వెళ్లిన ప్రజలు ఎండవేడిమి తట్టుకోలేక ఆపసోపాలు పడుతున్నారు. శనివారం కుమురంభీం జిల్లా కెరిమెరిలో అత్యధికంగా 44.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నిజామాబాద్ జిల్లా మెండోరాలో 44.5 డిగ్రీలు, జగిత్యాల జిల్లా ఎండపల్లిలో 44.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రోజు రోజుకూ ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో చిన్నారులు, వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దని వాతావరణ శాఖ సూచించింది.ఉదయం నుంచే ఎండ తీవ్రత విపీతరంగా ఉంటోంది. ఉక్కపోత వాతావరణం పెరిగి రాత్రిపూట కూడా ఉష్ణోగ్రతలు తగ్గడం లేదు. మార్చి చివరి నుంచి సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఏప్రిల్ మొదటి వారంలో కొన్ని ప్రాంతాల్లో వర్షాల వల్ల కొంత ఉపశమనం లభించినప్పటికీ, ఎండలు మళ్లీ తీవ్రరూపం దాల్చాయి. ప్రస్తుతం సాధారణం కంటే 3 డిగ్రీల వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ పరిస్థితులకు ప్రధాన కారణంగా ఎల్ నినో ఏర్పడే సూచనలు కనిపిస్తున్నాయి. పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణోగ్రతలు 0.5 నుంచి 1 డిగ్రీ పెరగడంతో ఎల్ నినో ప్రభావం ఏర్పడి, దక్షిణ భారతదేశంపై ఎండల ప్రభావం ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఎల్ నినో కారణంగా నైరుతి రుతుపవనాలు బలహీనపడి, వర్షపాతం తగ్గే అవకాశం ఉంది. వేసవి కాలం మరింత తీవ్రంగా ఉండవచ్చని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. రానున్న రోజుల్లో ముఖ్యంగా మే, జూన్ నెలల్లో ఎండల తీవ్రత మరింత పెరిగే సూచనలు ఉన్నాయి. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు. చెదురుమదురు వర్షాలు కురిసే అవకాశమూ ఉందని అధికారులు చెబుతున్నారు.

# డీలిమిటేషన్‌కు మహిళా బిల్లు ముసుగు

మొదటి పేజీ తరువాయి

ఈ విషయం కేంద్రంలోని పాలకులకు కూడా బాగా తెలుసని చెప్పారు. రాజ్యాంగ సవరణకు అవసరమైన మూడింట రెండు వంతుల మెజారిటీని తాజా బిల్లు పొందలేదని స్పష్టంగా తెలిసినప్పటికీ, మోదీ ప్రభుత్వం బిల్లును ప్రవేశపెట్టిందని విమర్శించారు. పార్లమెంటులో దక్షిణ భారతదేశ గళాన్ని అణచివేస్తున్న తీరుపై బిఆర్ఎస్ తరపున తాము తీవ్ర ఆందోళనను, నిరసనను వ్యక్తంచేస్తున్నామని కేటీఆర్ చెప్పారు. మహిళా రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లు ఇప్పటికే ఆమోదం పొందింది కాబట్టి, ఈ దేశ మహిళలకు ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. మహిళా రిజర్వేషన్‌ను అమలు చేయాలనుకుంటే ప్రస్తుతం ఉన్న 543 స్థానాలతోనే అమలు చేయవచ్చని చెప్పారు. పార్లమెంటులో దక్షిణ భారతదేశానికి ప్రస్తుతం 24? స్థానాలు ఉన్నాయని, ఆ 24 శాతం స్థానాలు యథాతథంగా కొనసాగేలా చూడాలని అన్నారు. ఒకవేళ దక్షిణ భారత ప్రాధాన్యాన్ని 24 శాతం కంటే తగ్గిస్తే ఈ దేశ నిర్మాణంలో విశేష కృషిచేసిన దక్షిణ భారత ప్రజల నుంచి తీవ్రమైన నిరసనలు, ఆగ్రహం వ్యక్తమవుతాయని కేటీఆర్ హెచ్చరించారు.

# రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడం ఆనందం

మొదటి పేజీ తరువాయి

ఎగురవేసి నల్లచట్టం ప్రతిని దహనం చేశాము. అప్పుడు నేను దహనం చేసిన ప్రతిల మంటను వ్యాపించనివ్వండి అని నేను అన్నాను. అదే నిన్న పార్లమెంటులో కూడా మంటలు చెలరేగాయి' అని స్టాలిన్ వీడియోలో అన్నారు. హిళా రిజర్వేషన్ల నెపంతో మోసపూరిత ప్రయత్నాన్ని ప్రతిఘటించిన తమిళనాడు ప్రజలకు, ముఖ్యంగా మహిళలను ఆయన ప్రశంసించారు. అలాగే శుక్రవారం పార్లమెంటులో 50,60 వ దశకాల నాటి పాత డిఎంకెని చూడడం అంటే ఏమిటని అడుగున్న కొంతమంది అపరిపక్వ వ్యక్తులతో 'ఇదే డిఎంకె' చూడండి' అని నేను చెప్పాను. నిన్న మేమ దాన్ని బలంగా చూపించాం అని స్టాలిన్ వీడియో సందేశంలో అన్నారు. పార్లమెంటులో దీనిని ఓడించిన ప్రతి ఒక్కరికీ తాను కతృతజ్ఞతలు తెలిపారు. ఇండియా బ్లాక్ పార్టీలతో సహా అన్ని ప్రతిపక్ష పార్టీల ఎంపీలు ఏకతాటిపై నిలబడటం వల్లే ఇది సాధ్యమైందని ఆయన అన్నారు. దేశాన్ని విభజించే ప్రయత్నాల కు ఇది భారీ దెబ్బ అని ఆయన పేర్కొన్నారు. ఈ పరిణామం ప్రతిపక్ష పార్టీల మధ్య పెరుగుతున్న ఐక్యతను ప్రదర్శిస్తోందని ఆయన తెలిపారు. ఇది మోడీ ప్రభుత్వానికి ఆరంభం మాత్రమే. మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లు 12 ఏళ్లలో తొలిసారిగా పార్లమెంటులో వీగిపోయిందని ఆయన ఎత్తిచూపారు. ప్రతిపక్ష పార్టీల సభ్యులకు ఈ సందర్భం స్టాలిన్ కృతజ్ఞతలు తెలిపారు.

# మహిళా రిజర్వేషన్‌లో చిత్తశుద్ధి లేదు

మొదటి పేజీ తరువాయి

భావించాలి. ఈ బిల్లుపై ప్రధాని మోదీకి నిజాయతీ లేదు. నిజాయతీగా మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకువస్తే.. పార్లమెంట్‌లో అందరూ మద్దతు తెలిపేవారని అన్నారు. అయితే మహిళా బిల్లు పేరుతో డీలిమిటేషన్ బిల్లు తీసుకువచ్చి దక్షిణాదికి అన్యాయం చేయాలని చూశారు. ప్రధాని మోదీ.. ఉత్తర, దక్షిణ భారత్ మధ్య అంతరాలు సృష్టించే విధానాన్ని విరమించుకోవాలన్నారు. మహిళా రిజర్వేషన్ల బిల్లుపై మాకు చిత్తశుద్ధి ఉంది. 2023 నాటి మహిళా బిల్లును పార్లమెంట్‌లో పెట్టాలి. ఆ బిల్లు పెడితే మద్దతు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. ఇందులోనూ ఎస్సీ, ఎస్టీ ఓబీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి. మహిళా రిజర్వేషన్ల బిల్లు విషయంలో రాజకీయం చేయాల్సిన అవసరం లేదని సీఎం రేవంత్ అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రధాని నరేంద్ర మోదీ సర్కార్ నిజాయితీగా తీసుకురాలేదని రేవంత్ రెడ్డి అన్నారు. మూడు బిల్లుల పేరుతో డీలిమిటేషన్ అమలుకు కుట్ర చేశారని ఆరోపించారు. రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్ర చేసిందని.. దక్షిణాదికి జరిగే అన్యాయాన్ని లోక్ సభ సాక్షిగా అడ్డుకున్నామని పేర్కొన్నారు. విపక్షాల ఐక్యతతో మోదీ సర్కార్ ఓడిపోయిందన్నారు. ఇది రాజకీయ ఓటమి కాదని, బీజేపీ విధానాల ఓటమి అంటూ వ్యాఖ్యానించారు. మహిళా రిజర్వేషన్ల బిల్లు ఇప్పటికే పాసైందని.. చిన్న సవరణలతో రిజర్వేషన్లు అమలు చేయవచ్చని రేవంత్ అన్నారు. రిజర్వేషన్లు తొలగించేందుకే బీజేపీ కుట్ర చేసిందని.. బీజేపీకి 400 సీట్లు వచ్చి ఉంటే రాజ్యాంగాన్ని మార్చేవారని తీవ్రంగా మండిపడ్డారు. విపక్షాలపై బురద జల్లేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. 2023 మహిళా బిల్లును యథాతథంగా అమలు చేయాలని బీజేపీకి సూచించారు. అలా చేస్తే ఇండి కూటమి ఏకగ్రీవంగా మద్దతు ఇచ్చేందుకు సిద్ధమని ఆయన పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాలను ఒప్పించి తీసుకువచ్చే బాధ్యత తనదని ఈ సందర్భంగా రేవంత్ హామీ ఇచ్చారు. మహిళా రిజర్వేషన్లపై తమకు చిత్తశుద్ధి ఉందని, యూపీ ఎన్నికల్లోపు వాటిని అమలు చేయాలని ముఖ్యమంత్రి డిమాండ్ చేశారు. దీంతో ప్రజల్లో ఎవరికి మద్దతు ఉందో ప్రజాక్షేత్రంలోనే తేలుతుందని రేవంత్ రెడ్డి సవాల్ చేశారు. బిల్లును అడ్డుకోకుంటే డీలిమిటేషన్ పేరుతో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసేవారని ధ్వజమెత్తారు. నార్త్, సౌత్ మధ్య అంతరాలు పెట్టే విధానం ఇకనైనా మార్చుకో వాలని బీజేపీకి సీఎం రేవంత్ రెడ్డి హితవుపలికారు. ఇకపోతే బీజేపీతో పొత్తు పెట్టుకున్న పార్టీల మనగడ భవిష్యత్తులో కష్టంగాఉంటుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. తెలుగుదేశం, చంద్రబాబు నాయుడు పరిస్థితి కూడా అలాగే అవుతుందని పేర్కొన్నారు. నితీశ్ కుమార్, ఏక్ నాథ్ షిండేలా పరిస్థితి మనం ఇప్పుడు చూస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం బీజేపీకి కేంద్రంలో సీట్లు తక్కువగా ఉన్నాయి కాబట్టి టీడీపీకి ఇంపార్టెన్స్ ఇస్తోందని పేర్కొన్నారు. లోక్‌సభ, రాజ్యసభ ఉన్నది చట్టాలు చేయడానికి మాత్రమేనని చెప్పుకొచ్చారు. వాటిని ఇంప్లిమెంట్ చేసేది స్థానికంగా ఉండే రాష్ట్ర ప్రభుత్వాలు అధికార యంత్రాంగమని తెలిపారు. 2/3 మెజార్టీ వచ్చినంత మాత్రాన అన్నింటిని చట్టాలు చేయలేమని పేర్కొన్నారు. కేంద్రంలో మెజార్టీ ఉందని ప్రధానిగా ఉన్న ఎవరైనా తనకు తనకు రాజుగా 2/ 3 మెజార్టీతో చట్టం చేసుకుంటే ఒప్పుకోరు కదా అని ప్రశ్నించారు. డిక్టేటర్‌షిప్‌ని ఎవరు ఒప్పుకోరని చెప్పారు. ఏపీలో ప్రతిపక్షానికి కేవలం 11 సీట్లే ఉన్నాయని తెలిపారు. 2011 జనాభా లెక్కల ప్రకారం మహిళలకు రిజర్వేషన్ కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు.

# రెండోవిడత రైతుభరోసా విడుదలకు సిద్ధం

మొదటి పేజీ తరువాయి

కానున్నాయి. మొత్తం 73 లక్షల మంది రైతులకు ఈ పథకం ద్వారా ప్రయోజనం చేకూరనుంది. మిగిలిన రైతుల కోసం మూడో విడత నిధులను విడుదల చేయడానికి కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించింది. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే సమయంలో ఈ నగదు అందడం వల్ల రైతన్నలకు వడ్డీ వ్యాపారుల భారం తప్పుతుంది. నిధులు సకాలంలో అందడం వల్ల అన్నదాతలు సాగు పనులను వేగవంతం చేసే అవకాశం ఉంటుంది. తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చే క్రమంలో రైతు భరోసా నిధుల విడుదలకు ప్రాధాన్యం ఇస్తోంది. కాటారం సభ వేదికగా జరగనున్న ఈ కార్యక్రమం రాష్ట్ర వ్యవసాయ రంగంలో కొత్త ఉత్సాహాన్ని నింపనుంది.

# మహిళలకు విపక్షాలు వ్యతిరేకం

మొదటి పేజీ తరువాయి

చేరేలా తెలియజేయాలని పిలుపునిచ్చారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ 131వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం శుక్రవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. అయితే, 298-230 ఓట్ల తేడాతో ఇది వీగిపోయింది. ఇకపోతే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. కరవు భత్యం (డీఏ) 2 శాతం పెంచడానికి నిర్ణయం తీసుకుంది. దీనికి కేంద్ర క్యాబినెట్ ఆమోద ముద్ర వేసింది. ఏటా రెండుసార్లు కేంద్ర ప్రభుత్వం డీఏను సవరిస్తుంది. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా ఉద్యోగులు, పెన్షనర్లకు ఈ భత్యాన్ని అందజేస్తారు. ఏటా జనవరి, జులైలో ఈ సవరింపు ఉంటుంది. అయితే ఈసారి డీఏ పెంపు ప్రకటన ఆలస్యమైంది. దాంతో ఉద్యోగుల నుంచి ఆందోళన వ్యక్తమైంది. అలాగే ఈ క్యాబినెట్ సమావేశంలో సావరిన్ మారిటైమ్ ఫండ్ ఏర్పాటుకు కూడా ఆమోదం లభించింది. దీనికోసం రూ.13వేల కోట్లు కేటాయించనున్నారు. దీనికింద భారత జెండా నౌకలు, భారత్ నుంచి రాకపోకలు సాగించే నౌకలకు బీమా కవరేజీ అందించడమే లక్ష్యం. పశ్చిమాసియా ఉద్రిక్తతలతో హర్మ్యూజ్ జలసంధిలో రవాణా నౌకలపై దాడులు జరిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ నిధిని ఏర్పాటుచేయడం గమనార్హం.

# ప్రజల సమస్యల పరిష్కారం కొరకే ప్రజాదర్బార్

## రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు, ఏప్రిల్ 18 : ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ప్రజా దర్బార్ ఏర్పాటు చేశామని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. శనివారం ములుగు మండలంలోని వివిధ గ్రామాల్లో రాయినిగూడెం, కొత్తూరు,పంచోత్తులపల్లె, సర్వాపురం, పెగడపల్లి, అంకన్నగూడెం గ్రామాల ప్రజల సమస్య పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్ కార్యక్రమాల్లో మంత్రి సీతక్క,జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.తో కలిసి ప్రజల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకుంటూ అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భాల్లో మంత్రి సీతక్క మాట్లాడుతూ గ్రామాలలోని సమస్యలను నేరుగా పరిష్కరించడానికి గ్రామాలలో ప్రజా దర్బార్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని పేర్కొన్నారు. మారుమూల ప్రాంతాలలో ఉండే గ్రామస్తులు కార్యాలయాలకు రాలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారిని దృష్టిలో ఉంచుకొని స్వయంగా ఆ గ్రామాలలోనే ప్రజా దర్బార్ నిర్వహించి,సమస్యలపై గ్రామ అభివృద్ధిపై కూలంకషంగా చర్చించుకోవడానికి అణువుగా ఉండటానికి ఇలాంటి కార్యక్రమాలను ప్రజలతో మమేకమై ఏర్పాటు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం ద్వారా స్థానిక సమస్యలు వెంటనే పరిష్కరించడం వలన ప్రజలు సమస్యల నుంచి ఉపశమనం కలగడమే కాక అనేక ప్రయోజనాలు చేకూరుతూ మెరుగైన అభివృద్ధి సాధ్యపడుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందించడానికి అహర్నిశలు జిల్లా అభివృద్ధికి పాటుపడుతున్న జిల్లా కలెక్టర్ ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భాల్లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకొని గ్రామాలలోనే ప్రజాదర్బార్ కార్యక్రమాలు నిర్వహించడంద్వారా స్థానిక సమస్యలు స్థానికంగానే పరిష్కరించడానికి వీలవుతుందని, మారుమూల ప్రాంతాలలోఉండే ప్రజలు సమస్యల విన్నపానికై కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేదని గ్రామాలకే ప్రభుత్వ యంత్రాంగం అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి వేగంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. డిఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్,అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి,సంపత్ రావు,మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రేగ కళ్యాణి,ఆర్డిఓ వెంకటేష్,రాష్ట్ర పంచాయతీ రాజ్ డైరెక్టర్ భగవాన్ రెడ్డి,స్థానిక ప్రజా ప్రతినిధులు,అన్ని శాఖల అధికారులు, ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సభ ఏర్పాట్లపై కలెక్టర్, ఎస్పీ సమీక్ష



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, ఏప్రిల్ 18 : జిల్లాలో జరగనున్న ముఖ్యమంత్రి సభ ఏర్పాట్లను శనివారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సంకీర్త్ సంయుక్తంగా పరిశీలించారు. సభా స్థలం, హెలిప్యాడ్, పార్కింగ్ ప్రాంతాలు, వేదిక ఏర్పాట్లను వారు సమగ్రంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సభ ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న బారికేడ్లు, స్టేజ్ నిర్మాణం వంటి అంశాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పార్కింగ్ సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించిన కలెక్టర్, అవసరమైతే అదనపు స్థలాన్ని చదును చేసి వాహనాల నిలుపుదల సౌకర్యాన్ని విస్తరించాలని సూచించారు. హెలిప్యాడ్‌ను పరిశీలిస్తూ, దుమ్ము ఎగరకుండా నీరు చల్లడం, స్థలాన్ని సమంగా తయారు చేయడం వంటి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్ అండ్ బి ఈఈ రమేష్, డీఎస్పీ సూర్యనారాయణ, సీఐలు, ఎస్సైలు తదితర అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్రాన్ని రోడ్డు ప్రమాద రహిత మార్చేందుకు పెద్ద ఎత్తున అరైవ్ అలైవ్ కార్యక్రమం

## సీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

శేరిలింగంపల్లి, ఏప్రిల్ 18 : తెలంగాణ రాష్ట్రాన్ని రోడ్డు ప్రమాద రహిత మార్చేందుకు పెద్ద ఎత్తున ఆరైవ్ అలైవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా శనివారం గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ నందు నిర్వహించిన "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని రోడ్డు ప్రమాద రహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రజల భాగస్వామ్యంతో పెద్ద ఎత్తున "అరైవ అలైవ్" అనే నినాదంతో రోడ్డు భద్రతా, ట్రాఫిక్ నిబంధనల మీద అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజు రహదారులపై ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయని వేలాది మంది వారి విలువైన ప్రాణాలను కోల్పోతున్న విషయాన్ని మనం ప్రతిరోజు పత్రికల్లో చూస్తున్నామని అన్నారు. అందుకే ఈ రోడ్డు ప్రమాదాలను నివారించడానికి రాష్ట్ర ప్రభుత్వం " అరైవ్ అలైవ్ " అనే నినాదంతో, రోడ్డు రవాణా శాఖ, పోలీసు శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఏప్రిల్ 13 నుండి 18 వరకు పెద్ద ఎత్తున రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని చేపట్టిందని గుర్తు చేశారు. రోడ్డు ప్రమాదాల కారణంగా ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా దెబ్బతింటున్నాయని, వారి జీవితాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకొని తెలంగాణ ప్రజా ప్రభుత్వం అన్ని విధాల సామ దాన ,భేద, దండ రూపాల్లో రోడ్డు ప్రమాదాలను నివారించడానికి నడుం కట్టిందని తెలిపారు. దీనికి అనుగుణంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు పోలీస్, రవాణా శాఖ ద్వారా పెద్ద ఎత్తున నిర్వహిస్తుందని తెలిపారు. ప్రజల భాగస్వామ్యం లేకుండా ఏ కార్యక్రమం విజయవంతం కాదు అందుకే రాష్ట్ర ప్రభుత్వం ప్రజల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించి ప్రజలలో రోడ్డు భద్రత పై విస్తృత ప్రచారం చేస్తుందని తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వారిని మొదటి 'గోల్డెన్ అవర్లో' హాస్పిటల్కు చేర్చి వారి ప్రాణాలను కాపాడాలనీ, గతంలో ఎక్కడైనా రోడ్డు ప్రమాదం జరిగితే కేసుల భయంతో ఎవరు పట్టించుకోకపోయేది. ఇప్పుడు ప్రమాదం జరిగిన మొదటి గంటలో హాస్పిటల్ కి చేర్పిస్తే 25 వేల పారితోషికం తో రహవీర్ అవార్డు అందిస్తుంది అని అన్నారు. ప్రమాదాలను నివారించడానికి అధికారులు యువతకు, విద్యార్థులకు, ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలపై రోడ్డు భద్రత నియమాలపై తరచుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. శాసన సభ్యులు ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ, ప్రభుత్వం చేపట్టిన రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం ఎంతో గొప్ప కార్యక్రమం అని, దీన్ని ప్రజల సహకారంతో విస్తృతంగా ప్రచారం చేసి ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు. రహదారి ప్రమాదాలు ముఖ్యంగా అతివేగం,హెల్మెట్ లేమి, సీట్ బెల్ట్ ధరించకపోవడం, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ఎక్కువ సంభవిస్తున్నాయని అన్నారు.ట్రాఫిక్ పోలీస్ రవాణా శాఖ తరచూవాహనాల తనిఖీలను నిర్వహించి రోడ్డు భద్రత నియమాలపై ఆవగాహన కల్పించాలని కోరారు. రాష్ట్ర రవాణా శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ మాట్లాడుతూ, అతివేగంగా వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు గురై మరణిస్తున్నారని అన్నారు. రోడ్ ప్రమాదాలను నివారించడానికి రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ పెద్ద ఎత్తున అరైవ్ అలైవ్ అనే నినాదంతో అవగాహన కల్పించడం, రోడ్డు నియమ నిబంధనలను కచ్చితంగా అమలు చేయడం జరుగుతుందని అన్నారు. ప్రజలందరూ ట్రాఫిక్ నియమాలను రోడ్డు భద్రత నిబంధనలను పాటించి వారి ప్రాణాలు కాపాడుకొని బాధ్యతగా మెలగాలని అనంతరం రోడ్డు నిబంధనలు పాటిస్తామని రోడ్డు ప్రమాదాలు జరగకుండా తమ కర్తవ్యాన్ని నిర్వహిస్తామని ప్రతిజ్ఞ నిర్వహించారు. ఉత్తమ డ్రైవర్లుగా దేశ్య, రమేష్ కేబి సింగర్ లను ఈ సందర్భంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, రవాణా శాఖ అధికారులు, డ్రైవర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# డీఎంహెచ్ఓ సుడిగాలి పర్యటన

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల తనిఖీ



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కరీంనగర్, ఏప్రిల్ 18 : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ చెల్పూర్, చల్లూరు, వీణవంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జమ్మికుంట-2 సబ్ సెంటర్, చల్లూరు పల్లె దవాఖానలను శనివారం ఆకస్మికంగా సందర్శించారు. హాజరు రిజిస్టర్లు, అవుట్ పేషెంట్ రికార్డులు, ఎన్‌సీడీ రిజిస్టర్, ఫార్మసీ స్టోర్లు, అలాగే టీకాల నిల్వ కోసం ఉపయోగించే ఐఎల్ఆర్ యంత్రం, దాని రోజువారీ ఉష్ణోగ్రత నమోదు వివరాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ పీహెచ్‌సీల్లో డెలివరీలు, మాతా-శిశు ఆరోగ్య సేవలను మెరుగుపరచాలని సూచించారు. గర్భిణీల చెకప్‌లు, అభా కార్డులను పెంచాలని, 13 సంవత్సరాలు పైబడిన వారందరికీ నిర్వహించిన ఆరోగ్య మహిళ క్యాంపుల స్క్రీనింగ్‌కు ఫాలోఅప్ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రసూతి గది పరిశుభ్రత, ప్రోటోకాల్ అమలును సమీక్షించడంతోపాటు చల్లూరు సబ్ సెంటర్ నిర్మాణ భవనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రావణ్ కుమార్, వైద్యాధికారులు డాక్టర్ తులసి దాస్, డాక్టర్ సుచిత్ర, సిబ్బంది పాల్గొన్నారు.



# జిల్లాలో సంక్షేమ వారాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు

## - రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ అంకిత్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 18 : జిల్లాలో సంక్షేమ వారాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టడం జరిగిందని భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ చెప్పారు. శనివారం హైదరాబాద్ నుండి నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంక్షేమ శాఖల అధికారులతో సంక్షేమ వారం నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 20వ తేదీ నుండి 26వ తేదీ వరకు నిర్వహించనున్న 7 రోజుల సంక్షేమ వారాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఈ సందర్భంగా సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 20వ తేదీ నుండి 26వ తేదీ వరకు జిల్లాలో సంక్షేమ వారాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలోని ఎస్సి, ఎస్టి, బిసి, మైనారిటీ గురుకులాలు, వసతి గృహాలలో వంటగది, పారిశుద్ధ్యం, మరమ్మత్తు పనులు చేపడతామని, విద్యార్థులకు వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు, తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహించడంతో పాటు వేసవి శిబిరాలు, బడిబాట కార్యక్రమాలను సమన్వయంతో అమలు చేస్తామని తెలిపారు. రైతు రిజిస్ట్రీ 100 శాతం పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడుతూ జనగణన కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు జిల్లాలో తగిన ఏర్పాట్లు చేయవలసిందిగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు స్వయంగా ఆన్‌లైన్ నమోదు (సెల్ఫ్ ఎన్యూమరేషన్) చేసుకునే అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం మే 11 నుండి జూన్ 9 వరకు ఎన్యూమరేటర్లు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమం పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించబడనున్నందున అవసరమైన సాంకేతిక సదుపాయాలు కల్పించి, ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీఈఓ నాగలక్ష్మి, సిపిఓ సంజీవరావు, గృహ నిర్మాణ శాఖ పిడి రవీంద్రనాథ్ తదితర అధికారులు పాల్గొన్నారు.



# యాసంగి వరి కొనుగోళ్లను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలి

## అదనపు కలెక్టర్ వేణుగోపాల్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 18 : యాసంగి 2025--26 ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో రైస్ మిల్లర్లు, ఎఫ్‌సీఐ అధికారులు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో సుమారు 83,000 మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యాన్ని వ్యవసాయ శాఖ అధికారులు నాణ్యత ప్రమాణాల ప్రకారం పరిశీలించి, అర్హమైన ధాన్యానికి మాత్రమే టోకెన్లు, కొనుగోలు పత్రాలు జారీ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పీఆర్-126 వరి రకం విషయంలో రైస్ మిల్లర్లు వ్యక్తం చేసిన సమస్యలను ప్రస్తావించారు. ఈ రకంలో పిన్‌పాయింట్ డ్యామేజ్ కారణంగా ఎఫ్‌సీఐ వద్ద బియ్యం ఆమోదంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. సంబంధిత అధికారులు సమన్వయం చేసుకొని సమస్యకు పరిష్కారం కనుగొని బియ్యం సజావుగా ఆమోదం పొందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తున్న సంస్థలు రైతులకు తగిన సౌకర్యాలు కల్పించి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో రైతులు ఎండల సమయంలో కాకుండా చల్లని సమయంలో ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలని అవగాహన కల్పించాలని చెప్పారు. రైస్ మిల్లర్లు తమ మిల్లుల వద్ద హమాలీలు, గోదాం స్థలాలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. సంబంధిత అధికారులు కొనుగోలు సిబ్బందికి శిక్షణ అందించి సమన్వయంతో పని చేస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ విద్యా చందన, జిల్లా పౌర సరఫరాల అధికారి ఎ. ప్రేమ్ కుమార్, జిల్లా మార్కెటింగ్ అధికారి త్రినాధ్ బాబు, జిల్లా సహకార అధికారి రాజశేఖర్, ఎఫ్‌సీఐ అధికారులు వెంకట రమణ, పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రాసిక్యూషన్ రివ్యూ కమిటీ సమావేశంలో కీలక చర్చలు

## - కేసుల వేగవంత విచారణ, కన్విక్షన్ రేటు పెంపుపై దిశానిర్దేశం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 18 : భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్, హేమచంద్రపురంలో శనివారం ప్రాసిక్యూషన్ రివ్యూ కమిటీ (పీఆర్‌సీ) సమావేశం నిర్వహించారు. భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో జిల్లాలోని పోలీస్ స్టేషన్ల స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, కోర్టు డ్యూటీ అధికారులు, కోర్టు లైజన్ అధికారులు, ప్రాసిక్యూషన్ అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో గడిచిన ఫిబ్రవరి, మార్చి నెలల్లో కోర్టుల్లో విచారణకు వచ్చిన కేసులపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. కన్విక్షన్, అక్విటల్ కేసుల పురోగతిని విశ్లేషిస్తూ, దర్యాప్తులో ఉన్న లోపాలు, సవాళ్లు, మెరుగుదలకు అవసరమైన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ, కేసుల వేగవంత విచారణకు ప్రాధాన్యత ఇవ్వాలని, చార్జ్‌షీట్లను సమయానికి దాఖలు చేయాలని అధికారులకు సూచించారు. సాక్షులకు సమన్లు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని, కోర్టు విచారణల్లో ఆలస్యం జరగకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. దర్యాప్తు ప్రక్రియలో టెక్నికల్, సైంటిఫిక్, డిజిటల్ ఆధారాల సేకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని, కేసుల నాణ్యతను మెరుగుపరచి కన్విక్షన్ రేటును పెంచాలని దిశానిర్దేశం చేశారు. బాధితులకు త్వరితగతిన న్యాయం అందించేందుకు పోలీస్--ప్రాసిక్యూషన్ విభాగాల మధ్య సమన్వయం మరింత బలోపేతం చేయాలని సూచించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ విజయలక్ష్మి కూడా దర్యాప్తు అధికారులకు కేసుల నిర్వహణ, సాక్ష్యాల సమర్పణ, కోర్టు విచారణలో పాటించాల్సిన అంశాలపై విలువైన సూచనలు చేశారు. ఈ సమావేశం ద్వారా కేసుల దర్యాప్తు, న్యాయపరమైన ప్రక్రియలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు స్పష్టమైన మార్గదర్శకాలు పొందారు.




# ట్రాఫిక్ నియమాలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత: డీఎస్పీ ఆదినారాయణ

## - 'అరైవ్--అలైవ్' అవగాహనా కార్యక్రమంలో వినూత్నంగా పోలీసుల చొరవ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 18 : భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాలో రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు కొత్తగూడెం త్రీ టౌన్ పోలీసులు శనివారం రైల్వే స్టేషన్ ప్రాంగణంలో వినూత్న అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి డీఎస్పీ ఆదినారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన "అరైవ్--అలైవ్" అవగాహనా కార్యక్రమంలో భాగంగా వాహనదారులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేస్తూ రోడ్డు భద్రతా నియమాలపై చైతన్యం కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఆదినారాయణ మాట్లాడుతూ, ప్రతి ఏడాది ప్రకృతి వైపరీత్యాల కంటే రోడ్డు ప్రమాదాల్లో మరణించే వారి సంఖ్య అధికంగా ఉందని తెలిపారు. ప్రమాదాలను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ స్వీయ క్రమశిక్షణతో ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం ప్రాణాలను రక్షించడంలో కీలకమని చెప్పారు. ప్రజల భద్రత, శ్రేయస్సు కోసం పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని పేర్కొంటూ, బాధ్యతగల పౌరులుగా రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్నవారు రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

# బిజెపి ఆధ్వర్యంలో కాంగ్రెస్, విపక్షాల చిత్రపటాల దహనం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, ఏప్రిల్ 18 : నరేంద్ర మోడీ నేతృత్వంలో బిజెపి ప్రభుత్వం 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టగా, కాంగ్రెస్, విపక్షాలు ఆ బిల్లును అడ్డుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తూ జగిత్యాల జిల్లా జగిత్యాల పట్టణ అధ్యక్షుడు కొక్కు గంగాధర్ ఆధ్వర్యంలో శనివారం కాంగ్రెస్, మిత్రపక్షాల చిత్రపటాలను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లు వంటి చారిత్రాత్మక నిర్ణయాన్ని వ్యతిరేకించడం అంటే మహిళల సాధికారతను అడ్డుకోవడమేనన్నారు. దశాబ్దాలుగా మహిళలు రాజకీయాల్లో తగిన ప్రాతినిధ్యం కోసం పోరాడుతుంటే, విపక్షాలు మాత్రం తమ స్వార్థ రాజకీయాల కోసం ఈ బిల్లును అడ్డుకోవడం దురదృష్టకరం అన్నారు. మాటల్లో మహిళా సాధికారత అని చెప్పుకుంటూ, చేతల్లో మాత్రం వ్యతిరేకించడం వారి ద్వంద్వ వైఖరికి నిదర్శనం అన్నారు. మహిళలకు సమాన అవకాశాలు కల్పించడానికి తీసుకొచ్చిన ఈ బిల్లును అడ్డుకోవడం అంటే సమాజ ప్రగతిని అడ్డుకోవడమేనని స్పష్టం చేశారు. ఇప్పటికైనా విపక్షాలు తమ సంకుచిత రాజకీయాలను పక్కనబెట్టి, మహిళల హక్కులను గౌరవిస్తూ ఈ బిల్లుకు మద్దతు ఇవ్వాలని, లేకపోతే మహిళల తీర్పు ప్రజాస్వామ్యంలో వారికి తగిన సమాధానం చెబుతుందని హెచ్చరించారు. రానున్న రోజులలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మాట అంటే మడమ తిప్పని నాయకుడు మహిళల బిల్లును రానున్న రోజులలో ఆమోదం తెలిపే వరకు వదిలి పెట్టడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షులు కొక్కు గంగాధర్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఆముదరాజు, రూరల్ మండల అధ్యక్షులు రమేష్, అర్బన్ మండల అధ్యక్షులు రామ్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మ్యాచరి అశోక్, కార్యాలయ కార్యదర్శి జుంబర్తి దివాకర్, సోషల్ మీడియా కన్వీనర్ సురేష్, బీజేపీ జగిత్యాల మున్సిపల్ కౌన్సిలర్లు సిరిపురం శ్రీలత శ్రీనివాస్, వేముల శ్రీనివాస్, నిమ్మల నాగరాజు, చిన్నాడి మధురిమ, జ్యోతి, జున్ను రాజేందర్, గేదాసు రాజేందర్, ఇట్యాల రాము, కొప్పు భాస్కర్, మర్రిపల్లి సాగర్, గుండేటి సాయి కృష్ణ, తుదిగేని శంకర్, అక్కినపల్లి కాశీనాథం, ఠాగూర్ కిషోర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by **KORUKANTI MANIDEEP PATEL,** Printed at SRI BALAJI PRINTING PRESS, H.No. 4-4-/85, Thilak Road, Karimnagar, Telangana - 505001 and Published at H.No.2-6-242, Ist Floor, Bus stand to Wesly Church Road, Mukarampura, Karimnagar, Karimnagar (Dist.), Telangana-505001, Editor: **GOLI SAMMI REDDY.** RNI.No.TELTEL/2010/35941. Cell: 9394322782, email: prajalakshyam@gmail.com